# కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అద్దిన ఆహితాగ్నులు













**మూలము:** **''Vedic Voices '' - Intimate Narratives of a living** "ANDHRA TRADITION"

**అనువాదము:** శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్ గారు, **సరసభారతి** సాహితీ సంస్థ – ఉయ్యూరు వ్యవస్థాపకులు


## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అద్దిన ఆహితాగ్నులు -1

- శ్రీ **గబ్బిట దుర్గాప్రసాద్** గారి **సరసభారతి ఉయ్యూరు వెబ్సైటు** నుంచి సేకరించడమైంది.

అసలే అందాల సీమలు. ప్రకృతి సోయగాలకు ఆటపట్టు. ముక్కారు పంటలకు నిలయాలు. పవిత్ర దేవాలయ క్షేత్రాలు. కొబ్బరి తోటల పరవశాలు. ఒక్కసారి చూస్తే అక్కడి నుండి రాబుద్ధి పుట్టని ఆకర్షణ విలసితాలు కోనసీమ సీమలు. మరి వీటికి తోడు పవిత్రత కలిస్తే, వేద గానాలు పరవశింపజేస్తే, వీటికి మరింత శోభ తెచ్చే నిత్యాగ్ని హోత్రాలు ప్రజ్వరిల్లుతుంటే, ఆహితాగ్నులు పవిత్రాగ్నులను కంటికి రెప్ప లాగా కాపాడుకొంటూ ఉంటే ఇక ఆ అనుభవం, అనుభూతి మరువగలమా! అప్పుడు అది భూలోక స్వర్గం అనటం చాలుతుందా? చాలనే చాలదు. అందుకే ''కోనసీమ అందాలకు వేద పవిత్ర సొబగులు, సౌరభాలు అలదినట్లుంటాయని అన్నాను. దీనికి కారణభూతులు అక్కడి ఆహితాగ్నులు. # **ఆహితాగ్ని-** అంటే **గృహంలో పవిత్రాగ్నిని అంటే వేద సంస్కార ప్రకారం అగ్నిహోత్రాన్ని ఉంచుకున్నవాడు**# అని నిఘంటు (ఆంధ్ర శబ్ద రత్నాకర) అర్థం. **అగ్నిహోత్రాన్ని కాపాడేవాడు**. ఆయననే **సోమయాజి** అనీ అంటారు. ఆహితాగ్నులు కోనసీమ ప్రాంతంలో ఉన్న బ్రాహ్మణ అగ్రహారాలలో ఉంటారు. వీరిని "వేదంలో ఉన్నవారు" అని పిలుస్తారు. వారు కూడా నేను వేదంలో ఉన్నాను అని చెప్పుకొంటారు. అది గౌరవం. "**గర్భాష్టమం**"లో "**ఉపనయన**" సంస్కారం జరిగి, "**త్రికాల సంధ్యావందనం**", "**అగ్నికార్యం**" చేస్తూ గురువు వద్ద ఉంటూ "**82పన్నా**"ల "**తైత్తిరీయ సంహిత**"ను "**ఎనిమిది**" నుంచి "**పన్నెండేళ్ళ**"లో నేర్చుకొంటారు. "**మధుకర**" వృత్తినవలంబించి, దానినే భుజిస్తాడు. తెల్లవారు ఝామున "**4 గంటల**"కే కాలకృత్యాదులు తీర్చుకొని గురువు ఎదుట కూర్చుని ఆయన చెప్పింది మరలా చెబుతూ అంటే **''సమావర్తన''** చేస్తూ నేరుస్తాడు. ఇదంతా బ్రహ్మచర్యం లో పూర్తవుతుంది. ఇక రెండవదైన గృహస్థాశ్రమం లోకి ప్రవేశించటానికి అగ్నిసాక్షిగా పెద్దలు కుదిర్చిన అనుకూలవతి అయిన కన్యను భార్యగా పొంది గృహస్థు అవుతాడు. అర్ధాంగితో నిత్యం అగ్నిని ఆరాధిస్తాడు దీనిని **గార్హస్పత్యాగ్ని** అంటారు. అతడికి ఇంకా చదవాలని నేర్చుకోవాలని ఉంటే అగ్రహారంలోనే చెప్పగలిగిన గురువు వద్ద చేరి నేరుస్తాడు. లేక బయటి ప్రదేశాలకు వెళ్లి నేర్చుకుంటాడు **పద పాఠం, క్రమపాఠం**లలో నిష్ణాతులౌతారు ఎక్కువ మంది ఇక్కడే ఆగిపోయి పరీక్షలకు హాజరై, సర్టిఫికెట్లు పొంది సంతృప్తి చెందుతారు. ఇంకా ముందుకు పోవాలనుకోనేవారు ఇంతకన్నా కష్టమైన **ఘనపాఠం** నేర్చుకుంటారు. దీన్ని సాధించిన వారిని **ఘనపాఠి** అంటారు. దీని పైది **జటాపాఠం** అనే మరింత క్లిష్ట ప్రక్రియ. ఎక్కువ మంది దీన్ని నేర్చే ప్రయత్నం చేసినా బహు కొద్ది మందే దీని అంతు చూడగలిగి నిష్ణాతులవుతారు. **కేరళ** లో **రథపాఠం** అనే మరో ప్రక్రియ ఉంది. దీన్ని **నంబూద్రి బ్రాహ్మణులు** ఎక్కువగా

నేరుస్తారు. కాని తీరాంధ్ర లేక సాగరాంధ్రలో అలవాటులో లేదు. **తైత్తిరీయ సంహిత, బ్రాహ్మణాలు ఆరణ్యకాలు, ఉపనిషత్తులను** సంపూర్తిగా నేర్చినవారు మిగిలిన వేదాలను వాని శాఖలను నేరుస్తారు. **ఋగ్వేదం**ను అదే గురువుకాని వేరొక గురువు వద్ద కానీ అభ్యసిస్తారు. ఇంకా ఉత్సాహముంటే **సామవేదాన్ని** నేర్చుకుంటారు. ఇది **సోమ క్రతువు**లకు తప్పనిసరి. **గాన విధానం ఇందులో ప్రత్యేకత**. ఇందులో **జైమినీయ, కౌథుమ, రాణాయనీయ** శాఖలలో అద్వితీయులయ్యే ప్రయత్నం చేస్తారు. వేదంలోని లోతులను తరచటానికి ఈ **ముఖేయ అధ్యయనం** పెద్దగా తోడ్పడదు. అందుకని **మీమాంస, వ్యాకరణాలు** చదివి వేదార్థ ప్రవీణులౌతారు. వివాహాది కార్యాలు చేయించటానికి స్మార్తం నేరుస్తారు. **ఆపస్తంభ ధర్మ సూత్రా**లను క్షుణ్ణంగా నేర్చుకొంటేనే ఇది సాధ్యమవుతుంది. మిగిలిన వాటిలో కూడా సర్టిఫికెట్లు కావాలంటే వాటినీ తరచి సాధిస్తారు. **పురోహితుడు** అనిపించుకుంటాడు. "**శ్రౌతం**"లో నిష్ణాతులు "**ఋత్విజు**"లౌతారు. "**గృహ్యసూత్రాలు**" నేర్చి **నిత్యకర్మలు ఉపనయనాది** కార్యాలు చేయిస్తారు. "**శ్రౌతసూత్రాలు**" నేరిస్తే "**యజ్ఞయాగాదులు**" చేయిస్తారు. **వేదం చదివి పండిత పరీక్షనిచ్చి ఉత్తీర్ణులైన వారిని వేదపండితులంటారు.** ఈ క్రమంలో మొదటగా **బ్రహ్మశ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారి ఋణం తీర్చుకోలేనిది. అన్నేళ్ళు కష్టపడి వేద విద్యనేర్చి పండితులైతే పొట్టగడిచేది యెట్లా? వారి ఇళ్ళల్లో పొయ్యి వెలిగేదెలాగా? కోనసీమలో దీనిపై ముందుగా ఆలోచించి పరిష్కార మార్గం కనిపెట్టినవారు **బ్రహ్మశ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారు. **ప్రతి దేవాలయంలోనూ వేద పండితులచేత సామూహిక వేదపారాయణ రోజుకు కనీసం మూడు గంటలు చేయించారు. ఇలా చేసే ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు**. దీన్ని గమనించిన ప్రభుత్వం **తిరుపతి తిరుమల దేవస్థానం** కార్య ప్రణాళిక సిద్ధం చేసి అమలుచేసింది. దేవాలయాలలో పూజారి ప్రసాదాలు మాత్రమేకాక వేద పారాయణ చేసే పండితులను నియమించింది. **శ్రీశైలం, తిరుమల, బెజవాడ** కనకదుర్గమ్మ మొదలైన ముఖ్య దేవాలయాలలో ఈ పథకం ముందు ప్రారంభమైంది. నాలుగు వేదాలలో నిష్ణాతులైన పండితులు ఎనిమిది మందికి అవకాశాలు లభించాయి. దీని వలన అప్పుల్లో కూరుకుపోయిన బ్రాహ్మణ పండితులకు కొంచెం ఊరట కలిగింది. ప్రభుత్వం ప్రకటించిన గౌరవ వేతనం వలన పిల్లల పెళ్ళిళ్ళు చేసే వీలు కలిగింది. ఈ విధానాన్ని కోనసీమలో ప్రారంభింప జేసిన **శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారి చిత్రపటాన్ని ప్రతి బ్రాహ్మణ కుటుంబలో దేవుని మందిరంలో ఉంచి కృతజ్ఞతలు తెలుపుకుంటోంది. ఆయన్ను ప్రాతఃస్మరణీయులను చేసుకున్నారు కొనసీమవారు. పండితులు తమ పిల్లలకు కూడా వేదవిద్యను నేర్పిస్తున్నారు. ఈ వేదపండితులకు పెన్షన్ సౌకర్యం కూడా కలిగించమనే ఆందోళనా ఉన్నది. అయితే ఆహితాగ్నులు మాత్రం వేదాన్ని పండితులు అమ్ముకుంటున్నారు. ఇది వేద విక్రయం అవుతుంది అని బాధపడ్డారు. **భారతదేశ వేద పండితులలో ప్రథమ స్థానంలో ఉన్నవారు "శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి"**

గారు. 1980లో ఆయన 92వ ఏట కూడా వారు కాకినాడ స్వగృహంలో **తైత్తిరీయ సంహిత** లోని **అగ్ని సూత్రాలు, అశ్వమేధ యాగ మంత్రాలు "స్ఫుటము"గా, "ఉచ్చైస్వరం"తో గానం చేశారు**. ఎక్కడా తొట్రుపాటు, వణుకు లేవట. ఒక మహర్షి మంత్ర పఠనంలాగా ఉందని చూసినవారు ఆశ్చర్య పోయారట. కారణజన్ములాయన. దీనికి 74 ఏళ్ళ క్రితం అంటే ఆయన 18వ ఏటనే ఒక క్రతువుకు అధ్వర్యులుగా ఉన్నారట. ఏమి జన్మ సుకృతం? **గణపతి శాస్త్రి** గారు కోనసీమలో ప్రారంభించిన **సామూహిక వేదపారాయణ** "ప్రతివారినీ చైతన్యవంతులను చేసి, వేద విద్య వ్యాప్తి, వేదపండిత సత్కారం తమ విధి అని గుర్తించేట్లు చేసింది." దీనితో సంక్రమణం నాడు లేక నెలకోసారి కాని స్థానిక బ్రాహ్మణ సంఘాలు వేదపండితులను ఆహ్వానించి మొదటి నలభై నాలుగు పన్నాలలో ఏదో ఒకదాన్ని వల్లించమని కోరేవారు. వారికి సంఘం తగిన పరితోషికమిచ్చి సత్కరించి పంపేది. ఈ సంస్కృతి ఆంధ్ర దేశమంతటా విస్తరించింది. వీలైన చోట్ల వేదసభలు శాస్త్రార్థ చర్చలు చేయించి గౌరవిస్తున్నారు. వాటిని చూసి ఆనంద పారవశ్యం పొందనివారు ఉండరు. "**కంచి**", "**శృంగేరి**" పీఠాధిపతులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రోత్సహిస్తున్నారు. వేదపండితులు గ్రామ, పట్టణాలు సందర్శించి తమ విద్వత్తు ప్రదర్శించి తగిన బహుమానాలు అందుకోవటం నేడు సర్వసాధారణమై పోయింది. ఇదంతా **శ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి**గారి పూనిక, వేదమాత సేవా భాగ్యమే. దేవాలయాలలో **ఘనపండితుడికి నెలకు రూ.1800**, **క్రమ పండితుడికి నెలకు రూ.1500** రూపాయలు గౌరవ భృతి ఇస్తున్నారు. **రిటైరైన వారికి కూడా నెలకు వెయ్యి రూపాయ**లిస్తున్నారు. వీరికి అమెరికాలో గొప్ప ఆదరణ లభిస్తోంది. కాని కేరళ పండిత నంబూద్రి కుటుంబాలు మాత్రం అమెరికా వెళ్ళటానికి ఉత్సాహం చూపటం లేదట. ఇప్పటికీ కోనసీమ సంప్రదాయ కుటుంబీకులు వేదంలో సర్టిఫికేట్ ఉన్న కొడుకులను, మనవళ్ళను అమెరికా పంపటానికి ఇష్టపడటం లేదట. వీరు చెప్పే సామెత దూరపుకొండలు నునుపు. వేదపండిత సర్టిఫికేట్ ఉన్నవారినే పంపటానికి ఇష్టపడకపోతే నిత్యాగ్నిహోత్రులైన ఆహితాగ్నులు బయట దేశానికి ఎలా వెడతారు? వారికి గృహమే స్వర్గ సీమ. వీరి విశేషాలు తర్వాత తెలుసుకొందాం.



**మూలం:**

https://sarasabharati-vuyyuru.com/2018/07/25/

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అద్దిన ఆహితాగ్నులు -2

### ఆహితాగ్ని దిన చర్య:

**శ్రౌతం** నేర్చినవారు సంప్రదాయాన్ని ఖచ్చితంగా పాటించి **ఆహితాగ్నిగా** ఉంటారు. **త్రేతాగ్నులను** అర్చిస్తారు. **రోజుకు రెండుసార్లు వేడిపాలను అగ్నిహోత్రానికి సమర్పిస్తారు**. తర్వాత **అగ్నిష్టోమం** చేస్తారు. **భారత, నేపాల్** దేశాలలో ఉన్న ఆహితాగ్నుల సంఖ్య **626** అయితే అందులో **ఆంధ్ర ప్రాంతం**లోనే **200** మంది ఉన్నట్లు తెలుస్తోంది. **శ్రౌతకర్మ విధానం గృహిణితో చేసే క్లిష్ట విధానం**. వీరి భాష కూడా ప్రత్యేకంగా ఉంటుంది. **నిత్యకర్మ**లని, **కామ్యకర్మ**లనే మాటలు వాడుతారు. **నిత్యకర్మ - విధిగా తాను ఆచరించాల్సినది. కామ్యకర్మ - మనసులో ఉన్న కోర్కె ఫలించటానికి చేసేదిగా భావించవచ్చు**. దీన్ని **నైమిత్తికం** అని అంటారు. అంటే **జాతకర్మ, అంత్యక్రియ, ఆయుర్వృద్ధి, ఆరోగ్యాభివృద్ధి**లకోసం చేసేవి. వీటికి **ప్రాయశ్చిత్తాలు** కూడా చేయాలి. వేద విహిత కర్మలను చేసే వారిని "**శ్రౌత**" లేక "**యజమాని**" అంటారు. యజమాని అర్ధాంగితో కలిసి ఉదయమే "**ఔపోసనాగ్ని**"ని "**ఆధానం**" ([సంస్కార పూర్వకముగా అగ్నిని)] స్థాపించుట) చేయాలి. దీనితో "**త్రేతాగ్ను**"లను అర్చించాలి. ఇంట్లోని ప్రత్యేక గదిలో "**పడమర**" వైపు గుండ్రని "**గార్హపత్య అగ్ని**" అంటే వంట చేసుకునే అగ్ని, "**తూర్పు**"న **చతురస్రాకారపు** "**ఆహవనీయ**", "**దక్షిణాన దక్షిణాగ్ని**"లను **మట్టిముద్దలతో** ఏర్పాటు చేసుకొంటారు. ఒకదానికొకటి సంబంధం ఉండేట్లు మధ్యలో **వేది** (యజ్ఞము మొదలగువానికై చదరముగా నేర్పఱచిన తిన్నె [అరుగు, వేదిక]) ఉంటుంది. "**వేది**" అంటే "**హోమ ద్రవ్యాలు**" ఉంచే ప్రదేశం. **ఈ పవిత్ర అగ్నిహోత్రాలు దంపతులు ప్రత్యేకంగా సంరక్షించుకొనేవి మాత్రమే. కుటుంబం లోని వారు, సహకరించేవారు మాత్రమే వీటిని చూడటానికి అర్హులు. మిగిల వారెవ్వరికీ ఈ గదిలో ప్రవేశం ఉండదు. దంపతులలో ఒకరు మరణించేదాకా ఇంతే. మరణిస్తే వాటిని తొలగిస్తారు. ఆ ఇంటికి మాత్రమే ఆ అగ్నిహోత్రం ప్రత్యేకం అని భావం. అగ్ని వారికి ప్రత్యక్ష దైవం.** ఆహితాగ్ని భార్యతో **ఔపోసనాగ్ని**తో నిత్యాగ్ని హోమం చేస్తూ అంటే **గార్హపత్యాగ్ని** ని కొలుస్తాడు. **అగ్నిహోత్ర గోవును సూర్యోదయ, సూర్యాస్తమయ వేళలో పాలు పితికి, అగ్నికార్యం నిర్వహించి, నైవేద్యం పెట్టగా మిగిలిన వాటిని ఉదయ, సాయం వేళల ప్రసాదంగా కుటుంబం అంతా స్వీకరిస్తారు.** అగ్నిహోత్రంలో సమిధలు వేయటమూ ఒక పవిత్ర కార్యమే. **ఉదయ సాయం సంధ్యలలో సంధ్యావందనం, అగ్నిహోత్రం, వైశ్వదేవం చేస్తూ దేవతలందరికి సంతుష్టి కలిగిస్తారు.** సాంకేతికంగా వివాహమైన నవ దంపతులు అగ్నిహోత్రిలుగా

ఆ ఇంటి **గార్హపత్యాగ్ని** ఆరాధనకు అర్హులవుతారు. **గార్హపత్యాగ్ని**తో పాలను వేడి చేసి **ఆహవనీయ అగ్నికి** సమర్పిస్తారు. దంపతులు ఆధానంతో **త్రేతాగ్ని అర్చన** చేస్తారు. ఒక్కొక్క దంపతులు తమ జీవితకాలంలో ఇలా అనేక వేలసార్లు చేయటం జరుగుతుంది. **ఉదయం సూర్య, ప్రజాపతి**లకు, **సాయంత్రం అగ్ని, ప్రజాపతి**లకు హవిస్సులు సమర్పిస్తారు. **15 రోజులకొ**కసారి **''దర్శ పూర్ణ మాస''** ను, **ఇష్టి**ని నిర్వహించి దేవతలకు హవిస్సు సమర్పిస్తారు. **అగ్నికి సోమకు చేసేదే "అగ్నిష్టోమం"**, అగ్ని ఇంద్రులకూ, అగ్నికి, ప్రజాపతికి ప్రత్యేకంగా కూడా చేస్తారు. బియ్యపు పిండికి నీళ్లు కలిపి గుడ్రంగా తట్టి గార్హపత్యాగ్నిలో ఉడికించి కూడా "**పురొడాశం**" గా దేవతలకు సమర్పిస్తారు. పాలతో పాటు ఇదీ ప్రసాదంగా భుజిస్తారు. ఇలా నిత్యం అగ్ని ఆధానం, అగ్నిహోత్రం పక్షానికోసారి ఇష్టితోపాటు మిగిలిన నిత్య కార్యాలు చేస్తారు. **ఒక ఏడాది దీక్షగా త్రేతాగ్ని హోత్రం చేసిన దంపతులు ఇంట్లోనేకాక బయటకూడా "శ్రౌతకర్మలు" చేయటానికి అర్హులౌతారు**. బయటి దాన్ని **అగ్నిక్షేత్ర**మని, అక్కడి అగ్నిని **మహావేది** అని అంటారు. దీనికి ముందు **అగ్నిష్టోమం** చేసి అర్హత సాధించాలి. **సోమరసం** తయారు చేసి అగ్నికి ఆహుతిగా ఇవ్వాలి. పశుబలి కూడా ఉండేది కాని ఇప్పుడు అమలులో లేదు. **ముంజ** లేక **దర్భ** తాడు భర్త నడుం చుట్టూ కట్టుకోవాలి. **యోక్త్ర** ను భార్య నడుముకు కట్టాలి. అప్పుడు **అగ్నిష్టోమం** చేయాలి. **సోమలత** దొరకటం కష్టం కనుక ఇప్పుడు వేర్వేరు లతలను **(పూతికలత)** ఉపయోగిస్తున్నారు. **సోమలత**ను గొప్ప అతిథిగా మహారాజుగా భావించి గౌరవంగా స్వాగతం పలుకుతారు. అయిదవ రోజు **సవనం (సోమపానము)** చేస్తారు. అంటే **తీగను పిండటం** చేస్తాడు అధ్వర్యుడు. **సామవేదం** లోని **12 సూత్రాలను,12 యజుర్వేద మంత్రా**లను స్తోత్రంగా గానం చేస్తారు. **సోమరసాన్ని** వడపోసి మొదట కుండలోను తర్వాత కోయ్య పాత్రలైన **చమస్సు**లలోను పోసి అగ్నికి ఆహుతిస్తారు. తర్వాత సోమరసం త్రాగుతారు. రెండవసారి కూడా ఇలానే చేస్తారు. ఇలా **అగ్నిష్టోమం** పూర్తయ్యాక **అవభృత స్నాన** (యజ్ఞాంత స్నానము) విధి ఉంటుంది. దీనితో పూర్తిగా దంపతులు పరమ పవిత్రులౌతారు. ఇదంతా జనన, మరణాలకు ప్రతీకగా భావిస్తారు. దీన్ని చేసిన దంపతులకు కొత్తపేర్లు పెడతారు. "**సోమాన్ని**" అగ్నిహోత్రానికి సమర్పించినందువలన ఆయనను "**సోమయాజి**" లేక "**సోమయాజులు**'' అనీ, ఆమెను "**సోమిదేవమ్మ**" అనీ పిలుస్తారు. మొదటినుంచీ ఉన్న పేర్లతో ఇక పిలవనే పిలవరు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అద్దిన ఆహితాగ్నులు -3

తీరాంధ్రలో **అగ్నిష్టోమం** అనేక రకాల **అగ్నిచయనం** తో చేస్తారు. దీనినే సూక్ష్మంగా **చయనం** అంటారు. వేలాది ఇటుకలను దీనికి వాడుతారు. అడుగున **శ్యేన** అంటే **ఎగిరే గరుడ పక్షి** ఆకారంగా చేస్తారు. దీన్ని

**శ్యేన చితి** అంటారు. **అయిదు అంతస్తులలో ఇటుకలుపేర్చి, అగ్నిహోత్రం చేయటానికి అనువుగా తయారుచేస్తారు**. అగ్నిదేవుడికి, పురుష ప్రజాపతికి హవిస్సులు సమర్పిస్తారు. **శుక్ల యజుర్వేదా**నికి చెందిన **శతపథ బ్రాహ్మణం** అగ్నిచయనంపై విస్తృతంగా వివరించింది. పాశ్చాత్యులకు ఇది బాగా అర్థమైన విషయం. **చయనం** చేసేవారు అగ్నిని తీసుకురావటానికి **ఉక్ష** అనే బూర్లమూకుడు లాంటి దానిని ఉపయోగిస్తారు. కానీ కోనసీమ బ్రాహ్మణ్యం **తైత్తిరీయ** విధానాన్నే ఉపయోగిస్తారు. **అగ్నిచయనం** అందర్నీ విశేషంగా ఆకర్షిస్తుంది. **1975** లో **కేరళ నంబూద్రి బ్రాహ్మణులు** చేసిన **అగ్నిచయనాన్ని ఫ్రిట్స స్టాల్, రాబర్ట్ గార్డేనర్** లు రెండు భాగాల అతి పెద్ద గ్రంథం (AGNI - The Vedic Ritual of the Fire Altar) గా చిత్రాలతో సహా ముద్రించారు. దీనినే **అల్టార్ ఆఫ్ ఫైర్** సినిమాగా కూడా తీశారు. దీన్ని **అతి ప్రాచీన సజీవ సాక్షాత్కార చివరి క్రతువు**గా పేర్కొన్నారు. ఆంధ్రాలో మాత్రం ఏమాత్రం మార్పులు లేకుండా అగ్నిచయనం చేస్తూనే ఉన్నారు. **చయనం** చేసినవారిని గౌరవంగా **చయనులు** అని సంబోధిస్తారు. **అగ్ని చయనం** తర్వాత ఆంధ్రలో **వాజపేయం** ప్రాముఖ్యత పొందింది. **17 మంది ప్రజాపతులకు హవిస్సులు అందజేసే కార్యమిది.17 రోజుల దీక్షతో చేస్తారు**. ప్రతిరోజూ "**సుర** ను **బియ్యం**, లేక **బార్లీ** లేక **చిరు ధాన్యా**లను **పులియబెట్టి** తయారు చేస్తారు. దీన్నే **కిణ్వన ప్రక్రియ** లేక **ఫెర్మెంటేషన్** అంటారు. చివరి రోజు **సోమలత**ను పిండి **సోమరసం** తయారుచేసి మంత్రాలను చదువుతూ ఆహుతులుగా సమర్పిస్తారు. ఒకప్పుడు **నల్లమేక**ను బలి ఇచ్చేవారు. యజమాని, భార్య కలిసి **యూప స్థంభం** ఎక్కి తమకు అమరత్వం సిద్ధించిందని ప్రకటించటం ఇందులో పరాకాష్ట. దీనికి పై మెట్టుగా **పౌండరీకం** అనే క్రతువు ఉంది. **ఇది 40 రోజుల దీక్ష తో చేసేది**. ఈ క్రతువులన్నీ ఎన్నో రోజుల ముందు ఆలోచన, వస్తుసేకరణ ,తగిన ప్రణాళికలతో చేయాల్సినవి. వీటికి **హోత, అధ్వర్యుడు, ఉద్గారుడు, బ్రాహ్మణులు** కావాలి. **మహావేది** నిర్మాణం చేయాలి. ఎంతో డబ్బు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అందరికీ వారి వారి అర్హతను బట్టి దక్షిణ సమర్పించాలి. పై నలుగురిలో ప్రతి ఒక్కరికీ ముగ్గురేసి సహాయకులు కావాలి. అంటే 16 మంది ఉండాలి 17వ వారు కొన్ని ప్రత్యేక విధులు చేస్తారు. 18వ వారు సదస్యం నిర్వహిస్తారు. వీళ్ళందర్నీ యజమాని అందులో నిష్ణాతులైన వారి సలహాతో ఎంపిక చేస్తాడు. ఇతనినే **సోమప్రవాకుడు** అంటారు. ఇందులో ఏమాత్రం దోషం జరిగినా తాను పాపకూపంలో పడినట్లు భావిస్తారు. ఆహితాగ్నికి ఒకరు సహాయంగా ఉంటే చాలు. కొడుకు కాని తమ్ముడుకాని దగ్గర బంధువుకాని పనికొస్తాడు. **ఇష్టి** ని **పాడ్యమి,పౌర్ణమి** నాడు చేస్తారు. పంటల కాలంలో **అగ్రయణం** చేస్తారు. దీనికి యజమాని **అధ్వర్య , హోత, బ్రాహ్మణ, ఆగ్నీధ్ర**లను ఏర్పాటు చేసుకోవాలి. **ఆగ్నీధ్ర అధ్వర్యుడి**కి సాయంగా ఉంటాడు. అగ్రహారంలోని ఇతర ఆహితాగ్నిలను దీనికి వినియోగించుకోవచ్చు. **అధ్వర్యుడు, హోతా** ఇద్దరు ఉంటే చాలు అని **ఆపస్తంభ సూత్రాలు** చెబుతున్నాయి. కోనసీమలోని

**శ్రీరామపురం, ఇరగవరం, కామేశ్వరి, వ్యాఘ్రేశ్వరం** అగ్రహారాలలో ఆహితాగ్నులు అగ్నిహోత్రం అంతటి పవిత్రులు. వీరి గురించి వరుసగా తెలుసుకొందాం.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -4

కోనసీమలో ఉచ్ఛస్థితిలో, స్వర్ణయుగంగా ఉన్న శ్రౌత కార్యక్రమాలు 1980 నాటికి ప్రాభవం కోల్పోయాయి. కాని **దెందుకూరి, విష్ణుభట్ల** వంటి కొన్ని కుటుంబాలు మాత్రమే **శ్రౌతాన్ని** కొనసాగిస్తున్నాయి. 1940లో **శ్రీ డొక్కా రామయ్య** అనే ధనిక వితరణశీలి అయిన బ్రాహ్మణుడు వేద పండితులకు **శ్రీరామపురం అగ్రహారాన్ని** ఇచ్చి ఉండటానికి ఏర్పాటు చేశారు. అప్పుడు 14 బ్రాహ్మణ కుటుంబాలు మాత్రమే ఉండేవి. **ఈశ్వర,రాధాకృష్ణ,సూర్య,అంబిక, విఘ్నేశ్వరు** లతో కూడిన ఒక **పంచాయతన దేవాలయం** ఉండేది. ఒకేఒక్క మట్టి ముఖ్యవీధి, ఒక చిన్న బడి, పోస్టాఫీసు, సుబ్రహ్మణ్య దత్తాత్రేయ మందిరాలు ఉండేవి. కుగ్రామమే అయినా వైదిక బ్రాహ్మణులు లౌకిక బ్రాహ్మణులతో కలిసి భోజనం చేసేవారుకాదు. కనుక వేరు వేరుగా వైదిక, లౌకిక బ్రాహ్మణులు నివసించేవారు. ఆహితాగ్ని లు ఆహితాగ్నిలు కాని వారింట భోజనం చేసేవారుకాదు. వారి ఆడవారు వండినా తినే వారుకాదు. దీనికి దగ్గరలో ప్రధాన రహదారికి బహుదూరంలో **కామేశ్వరి అగ్రహారం**లో కొద్దిమంది బ్రాహ్మణులుండేవారు. వేద విధానం ఉచ్ఛస్థితిలో ఉన్నా కూడా, త్రేతాగ్నులను అర్చిస్తున్న ఆహిఆగ్నులు, వేదపండితులు తమ పిల్లలకు నేర్పుకొంటూ ఈ రెండు అగ్రహారాలలో ఉండేవారు. ఈ రెండూ **అమలాపురం** కాలువకు చెరి ఒకవైపున ఉండేవి. **శ్రీరామపురా**నికి మైలున్నరదూరం లోఉన్న **వ్యాఘ్రేశ్వరం** ఒకప్పటి అగ్రహారం. ఇక్కడ ముగ్గురు ఆహితాగ్నులు ఉండేవారు. అంటే అతి సమీపంలో ఉన్న ఈ గ్రామాలలో మొత్తం మీద ఏడుగురు ఆహితాగ్నిలు ఉండేవారు. గోదావరి నదిపై ఉన్న **ఇరగవరం** బ్రాహ్మణపల్లెలో వేదపండితులు ఎక్కువ.

### బ్రహ్మశ్రీ భమిడిపాటి యజ్ఞేశ్వర సోమయాజి:

కోనసీమలోని లోని **శ్రీరామపురం** అగ్రహార వాసి **బ్రహ్మశ్రీ భమిడిపాటి యజ్ఞేశ్వర సోమయాజి** గారు. వీరిని అందరూ **బాబళ్ళశాస్త్రి** గారు అని పిలుస్తారు. వీరింట్లో మిగిలిన ఆహితాగ్నుల ఇళ్ళల్లో లాగానే కుక్కలు, పిల్లులు కనిపించవు. అదొక నియమం వారికి. **శ్రౌత** కర్మల సందర్భంలో ఇంట్లో "**కూర్మం**" అంటే "**తాబేలు**" తిరగాలి. అప్పుడు దాన్ని అతి జాగ్రత్తగా కాపాడుకొంటారు. **శ్రీ భమిడిపాటి యజ్ఞేశ్వర సోమయాజి** గారు **శ్రీవత్సస** గోత్రీకులు. 1930లో జన్మించారు. దాదాపు 20వ శతాబ్దం అంతా జీవించారు. బయట అరుగుపై కూర్చుని అందరితో సంభాషించేవారు. తొంభైవ పడికి దగ్గరపడుతున్న కొన్ని నెలల వరకు ఈ వ్యాసంగం సాగింది. **భారతదేశంలో 19, 20 శతాబ్దాలలోని ఆహితగ్నిలలో ఉత్కృష్టమైనవారుగా గణనకెక్కిన**

**మహానుభావులాయన.** ఆయన కుటుంబంలో మూలపురుషులు 18వ శతాబ్దికి చెందిన **భమిడిపాటి బ్రహ్మీకృత ఆచార్యులు**. వివాహమాడి సంతానం పొందకుండానే సన్యసించిన వారాయన. అదొక గొప్ప విషయంగా ఆనాడు చెప్పుకునేవారు. తండ్రి తరపు వారిలో **వీరభద్ర సోమయాజి, అచ్యుతరామ సోమయాజులు, యజ్ఞేశ్వర సోమయాజులు, చిన సుబ్రహ్మణ్య సోమయాజి** ముఖ్యులు. వీరిలో **చిన సుబ్రహ్మణ్య సోమయాజులు** గారే **బాబళ్ళ సోమయాజులగారి** తండ్రిగారు. తల్లిగారు **ఆకెళ్ళ** వేద కుటుంబానికి చెందిన **కామేశ్వరి.** ఈ అయిదవ తరం వారు ఆరవ తరానికి జన్మనిచ్చి ఆరుగురు కుమారులను కన్నారు. ఈ ఆరుగురూ ఆహితాగ్నులే. ఇందులో అయిదుగురు సోమయాజులయ్యారు. ఆరవ ఆయన కూడా అయ్యేవారు కాని **అగ్నిష్టోమ** దశలో చనిపోయారు. **బాబళ్ళ** గారి ఒకే ఒక కుమారుడు **బుల్లెబ్బాయి** అని పిలువబడే **సుబ్రహ్మణ్య సోమయాజి** అంతుపట్టని వ్యాధులతో ఇబ్బందిపడి వేదపండితుడు కాకుండానే మరణించి పుత్రశోకం కలిగించగా ఇరవై రోజుల ఏకైక కుమార్తె కూడా చనిపోవటం ఆ కుటుంబానికి ఆశనిపాతమైంది. కాని కొడుకు **బుల్లెబ్బాయికి సోమశేఖర, యజ్ఞేశ్వర ప్రసాద్** ఇద్దరు కొడుకులు. **సోమశేఖర**ను బాబళ్ల గారి చిన్న తమ్ముడికి పెంపుడిచ్చారు. **యజ్ఞేశ్వరప్రసాద్**కు ముగ్గురు అందమైన కూతుళ్ళు. మగ సంతానం లేదు. అందుకని బాబళ్ళవారి వంశం ఆగిపోయింది. ఈ ముగ్గురు కుమార్తెలే బ్రాహ్మీభూతులవారి తొమ్మిదవ తరం వారు. స్కూల్ టీచర్ అయిన **యజ్ఞేశ్వర ప్రసాద్**, భార్య **లక్ష్మి** వీధి మొదటి ఇంట్లో ఉంటూ అతిథి అభ్యాగతులకు స్వాగతం పలికి ఆతిథ్యమిచ్చి తృప్తిపడుతున్నారు. 1961 లో పుట్టిన **బాబళ్ళ** వారి మనవడు **యజ్ఞేశ్వర వెంకట సత్య సూర్యరామ సుబ్రహ్మణ్య సోమయాజి** ఏడవతరం సోమయాజి అవ్వాల్సినవాడు కాలేకపోయాడు. **బాబళ్ళ** వారు **ముక్కామల**లో జన్మించినా, దగ్గరలోని **ఇరుసుమండ** గ్రామంలో మేనమామలింట పెరిగారు. బాబళ్ళ వారి భార్య **సుందరి, ఆకెళ్ళ సుబ్బావధాని** గారి కుమార్తె. ఆయన కంటే ఆరేళ్ళు చిన్నది. **ఇరుసుమండ** లో ఇద్దరూ కలిసి బడికి వెళ్ళేవారు. ఆయనకు తొమ్మిదో ఏటనే తెలుగు వ్రాయటం చదవటం వచ్చేశాయి. ఆమె మూడవ తరగతిలో ఉండగా ఆయనకు 18, ఆవిడకు 12వ ఏట ఐదు రోజుల వివాహం జరిగి 71 ఏళ్ళు దాంపత్య జీవితాన్ని అనుభవించిన జంట అయ్యారు. మొదట్లో **ముక్కామల**లో కాపురం పెట్టినా, తర్వాత **శ్రీరామపురం** చేరారు. బాబళ్ళ గారి తండ్రి తన కొడుకులకే కాక చాలామందికి విద్యాగురువు. **శ్రీరామపురం**లో రెండవ ఆహితాగ్నిగా గుర్తింపు పొందినవారు కూడా. అప్పుడు **ముక్కామల**లో 20 మంది వేదపండితులు ఉండేవారు. కొందరు సమీప గ్రామాల నుండి తెరచాప పడవలో కాలువదాటి, కొందరు ఫంట్ లలో లేక ఆ ఒడ్డునా, ఈ ఒడ్డునా పాతబడిన కొయ్యస్తంభాలకు కట్టిన తాడును ఆధారంగా వచ్చేవారు, దువ్వూరి యాజులు అనే ఆయన కపిలేశ్వరపురం నుంచి వచ్చేవాడు. బాబళ్ళ తండ్రి గారు వేదాన్ని వల్లిస్తూ తదేక ధ్యానంలో ఉంటే,

''పిల్లలమైన మేము ఒంటేలి కని, రెండేళ్ళ కనీ సాకుతో నెమ్మదిగా జారుకొనే వాళ్ళం'' అని **దువ్వూరి** గుర్తు చేసుకున్నారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -5

**బాబళ్ళ శాస్త్రి** గారు **82 పన్నాలు** పూర్తిచేయగానే, తనకు సంక్రమించిన **గంగలకుర్రు** పొలాలపై అజమాయిషీ చేస్తూ, కొద్ది మందికి వేదపాఠాలు చెబుతూ, తాను **తైత్తిరీయ శాఖ**పై సాధించిన పట్టును నిలబెట్టుకొంటూ మరింత ముందుకు సాగారు. **వేదం, శ్రౌతం, ధర్మ శాస్త్రం, మీమాంస, జ్యోతిషం, వేదాంతం, వ్యాకరణం** మొదలైన వాటిపై లోతైన అవగాహన సాధించి తన జ్ఞాన తృష్ణ తీర్చుకున్నారు. అనునిత్యం వీటిని స్పృశిస్తూ అవగాహన పెంచుకున్నారు. వార్ధక్యంలో కూడా చెవుడు వచ్చినా కళ్ళు సరిగ్గా కనిపించక పోయినా, రోజూ ఏదో ఒక తాటాకు గ్రంథాన్ని కంటి సులోచానాలకు రెండుమూడు అంగుళాల దూరంలో ఉంచుకుని పరిశీలించేవారు. అంతటి విజ్ఞాన తృష్ణ ఉండేది. తమ తండ్రిగారు తన జీవితంలో ఆర్థిక బాధలకు గురికాకుండా ఆర్థిక సౌకర్యం కలిగించినందుకు కృతజ్ఞతలు చెప్పుకొనేవారు. తండ్రిగారితో తన అనుబంధం చాలా గొప్పదని అనేవారు. తన చదువు నిరాటంకంగా సాగాలని తండ్రి కోరేవారు. ప్రతి విషయంపై ఆయనే శ్రద్ధ చూపేవారు. తనకేరకమైన ఇబ్బంది కలిగించలేదు. యవ్వనమంతా ఉయ్యాలలో ఊగుతూ సుఖ సంతోషాలతో గడిపారు. తండ్రిగారి కంటే తక్కువ మంది విద్యార్థులను చేర్చుకొని వారిపై పూర్తి అంకితభావంతో బోధించేవారు. గ్రంథ పఠన కాలంలో కూడా నలుగురు విద్యార్థులు ఇంట్లో ఉండేవారు. తన మనవడు **ప్రసాద్**కు కూడా **82 పన్నాలు** 1971 నుండి 1980 వరకు తొమ్మిదేళ్ళు క్షుణ్ణంగా నేర్పిన గురూత్తములాయన. పరీక్షలకు కట్టకపోయినా ప్రసాద్ 1986లో దగ్గర స్కూల్లో స్కూల్ మాస్టర్ అయ్యాడు. తాతగారితో నిత్యం పొలాలకు వెళ్లివచ్చేవాడు. అతని సహాధ్యాయులు **చిర్రావూరి రామం, శ్రీపాద మాణిక్య, ప్రభల కృష్ణమూర్తి, సామవేదం నారాయణ**. వీరిలో ఎవరో ఒకరు ప్రసాద్ వెంట తాతగారితో వెళ్ళేవారు. వీరుకాక ఆయనవద్ద నేర్చినవారు కోనసీమలో చాలామంది వేదపండితులైనారు. పొలాల గట్లమీదో, కొబ్బరి చెట్ల నీడనో కూర్చుని వీరు అధ్యయనం సాగిస్తూ కన్పించేవారు. వీరిని శాస్త్రిగారు పర్యవేక్షిస్తూ ఉండేవారు. మధ్యాహ్న సమయానికి ఇంటికి చేరి ఉదయ పాఠాలను సమీక్షించుకోనేవారు. నాగలిపట్టి భూమిని దున్నగలిగే శాస్త్రిగారు ముసలితనంలో పర్యవేక్షణకే పరిమితమయ్యారు. వేదపరీక్షలను నిర్దుష్టంగా కఠినంగా జరిపేవారు శాస్త్రి గారు. అందుకే మనవడు ప్రసాద్ పరిషత్ పరీక్షలకు హాజరవలేదు. శాస్త్రి గారు మరికొందరు సహాధ్యాయులైన వేదపండితులు కలిసి తాము కొంత ధనం వేసుకుని, కొంత వితరణ శీలురవద్ద సేకరించి ఒక ట్రస్ట్ ను ఏర్పాటు చేశారు. దీనితో

**వేదం, సంస్కృతం, శ్రౌతం స్మార్తం, అపరం, ఆగమం, మీమాంస, వ్యాకరణం** మొదలైన విషయాలపై **అమలాపురం, రాజమండ్రి** మొదలైన చోట్లలో సభలు జరిపి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైనవారికి పురస్కారాలు అందించారు. 1987 వైశాఖమాసంలో **వ్యాఘ్రేశ్వర** గ్రామం ముందుకు వచ్చి వీటికి పూర్తి సహకారం అందించి, ఆతిథ్యమిచ్చింది. 30 మంది వేదంలో, నలుగురు స్మార్తంలో, ఒకరు ఆగమంలో పరీక్షనిచ్చారు. వీరంతా పది నుంచి పన్నెండేళ్ళు కష్టపడి విద్యనేర్చినవారే. రెండు రోజుల పాటు వివిధ శాస్త్రాలలో, వేదపారాయణలో పరీక్షలు నిర్వహించి, రెండవ రోజు సాయంత్రం ఉత్తీర్ణులైనవారినీ, నిష్ణాతులైన గురువులను ఘనంగా సన్మానించి చిరస్మరణీయం చేశారు. ఉత్తీర్ణులైన విద్యార్ధులకు 150 నుంచి 200 రూపాయలవరకు ప్రోత్సాహక నగదు పారితోషికాలను అందజేశారు. శాస్త్రిగారికి నడి వయస్సు నాటికి కుటుంబంలో శ్రౌతం ఉత్కృష్ట స్థితిపొంది, ఆహితాగ్నులు పెరిగి తాను స్వయంగా ఏదీ చేసుకోవాల్సిన అవసరం కలగలేదు. ఆయనకు ఎన్నో చోట్ల నుండి ఆహ్వానాలు వచ్చాయి. కాని వెళ్ళటానికి ఇష్టపడలేదు. ''వెళ్ళే ధైర్యం నాకు లేకపోయింది '' అని నవ్వుతూ చెప్పేవారు. 1959 లో 55వ ఏడు వచ్చేదాకా నిత్యాగ్ని హోత్రానికి ఆధానం చేసేవారు. ఆరునెలల తర్వాత **అగ్నిష్టోమం** మొదటి సోమ క్రతువు చేశారు. దీనినే కోనసీమలో **యజ్ఞం** అంటారు. దగ్గరలో **నేదునూరు** గ్రామవాసి, ఆయన స్నేహితుడు, వేదంలో విశేషమైన ప్రాభవం ఉన్న **లంకా వెంకటరామ శాస్త్రి** గారు అధ్వర్యుగా వ్యవహరించారు. లంకా వారు కొద్ది రోజుల్లో అగ్నిష్టోమం పూర్తిచేసే ఏర్పాట్లలో ఉన్నారు. శాస్త్రి గారి యజ్ఞం అందరిలో గొప్ప ఉత్సాహం కలిగించి శ్రౌతానికి మహోన్నత దశ అయింది. ఇలా అయిదేళ్ళు గడిపారు. ఆయన గౌరవం విపరీతంగా పెరిగి కుటుంబంలో అగ్రహారాలలో కోనసీమ అంతా ఆయనకు బ్రహ్మరథం పట్టింది. **నా పూర్వీకులు చేసిన దానినే నేనూ కొనసాగిస్తున్నాను అన్న సంతృప్తి నాది** అనే వారాయన. **అగ్నిష్టోమం** తర్వాత **శ్రావణ పశు** నిర్వహించారు. 1960లో భాద్రపద మాసంలో **అరుణ కేతుక** చేశారు. **ఇందులో అగ్నిహోత్రంలో ప్రతీకాత్మక ఇటుకలు, నీటి నైవేద్యం ఉంటాయి.** శాస్త్రిగారి పెంపుడు తాబేలు దీనికి సహకరించింది. దీనికి 12 రోజులు **మధుకరం** ఎత్తాలి. ఎప్పుడో బ్రహ్మచర్యంలో చేసింది ఇప్పుడు మళ్ళీ చేయటం అన్నమాట. చాతుర్మాస్య ఆహుతులను సమర్పించాలి. కొత్తపంట చేతికి వచ్చే సమయంలో **అగ్రయణం {ఆగ్రహాయణ మనెడి ఒక ఇష్టి. మార్గశీర్షమాసమున సాగ్నికముగా చేయవలసినదియు, నవసస్యములకు సంబంధించినదియు అగు యాగము. అగ్రమ్ -అయనాత్ - అగ్ర అయన ఉత్తరాయణమునకు మొదలు చేయునది.}** చేయాలి. ఇలా శాస్త్రి గారు అర్ధాంగి **సుందరి** దంపతులు 1990లో ఆయన 87వ ఏడు, ఆమెకు 81 వచ్చేదాకా చేశారు. 1991 లో ఇద్దరూ చెవిటి వారు ఆవటంతో దీన్ని మొట్టమొదటిసారిగా వదిలేశారు. యథావిధిగా నిత్యాగ్నిహోత్రం ఇష్టి చేశారు. **శాస్త్రిగారి ప్రత్యేకత**

**దీర్ఘకాలం నిర్వహించే "నక్షత్ర", లేక "పవిత్ర హోమా"లలో కనిపిస్తుంది.** సాధారణంగా గ్రహశాంతి కోసం నవగ్రహ పూజలు చేసి, దానాలు ఇస్తూ ఉంటారు. **శ్రీరామపురా**నికి నడక దూరంలోనే శనైశ్చర దేవాలయం **మందపల్లి**లో ఉంది. హిందువులతోపాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా ఈ దేవాలయం దర్శించి శని బాధ నివృత్తి చేసుకొంటారు. శాస్త్రి గారు ఏనాడూ మందపల్లి వెళ్లనూ లేదు లేక మరో చోటనైనా నవగ్రహ పూజ చేయలేదు. శాస్త్రిగారు "**నలభై రోజుల**" "**నక్షత్ర ఇష్టి**" మాత్రం చేసేవారు. 1960 వరకు ఇవి నిరాటంకంగా సాగాయి. అది ఆయన శక్తి పరవళ్ళు తొక్కిన కాలం. ఆయనకు కొన్ని నిశ్చితాభిప్రాయాలున్నాయి. **"చయనం"లో యజమాని దీక్ష తీసుకోకుండా యజ్ఞ వాటిక ఇటుకలు తాకరాదు. తాకితే చేతికి గ్లోవ్స్ లేకుండా ఎలక్ట్రీషియన్ విద్యుత్ప్రవహించే తీగలను ముట్టుకొంటే ఎలా షాక్ తగిలి చస్తాడో అలా అగ్నిదేవుడు దహిస్తాడు అని నమ్మకం. సోమాన్ని అగ్నిలో వ్రేల్చి సోమయాజి అయితే జీవితాన్ని సరైన మార్గంలో అంటే గాడిలో బండి నడిచినట్లు హాయిగా గడపగలడు.**

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -6:

1962లో శాస్త్రి గారికి **శ్రీరామపురం**లో ఒక ఇళ్లస్థలం ఏర్పాటు చేయబడగా కుటుంబాన్ని **ముక్కామల** నుంచి ఇక్కడికి మార్చారు. ఆయన మనసులో **సప్తగోదావరి** ఎప్పుడూ మసలుతూ ఉండేది. **కౌశికుడైన విశ్వామిత్రుని** వరంగా తలుస్తూ ఉండేవారు, స్థలం ఇచ్చినవారు ఇల్లు కట్టుకోవటానికి ధనమూ అందజేయటంతో ఇల్లు కట్టుకొని అందులో అగ్నిహోత్ర గదినీ ఏర్పాటు చేసుకున్నారు. దాత 15 బస్తాలు పండే ఒక ఎకరం పల్లం భూమిని కూడా ఇచ్చాడు. నిత్యాగ్నిహోత్రులు, ఆహితాగ్ని అవటం, వేద పండితులకు నిరంతరం ఆ దంపతులు అతిథ్యమిస్తూ ఉండటం వలన దాత వీరికి రోడ్డు ప్రక్కనే ఉన్న స్థలం ఇచ్చి అతిథి అభ్యాగతులెవరు ఊళ్లోకి వచ్చినా తెలుసుకొనే వీలు కల్పించాడు. ఏ ఆహితాగ్ని అయినా వేరొక ఆహితాగ్ని ఇంట్లో ఆయన భార్య చేతి వంట తింటాడు. ఆమె ఇచ్చిన ఉదకం పుచ్చుకొంటాడు. అది విధానం. అందుకని **ముక్కామల, సీతారామపురం, వ్యాఘ్రేశ్వరా**లలో వేద సభలు జరిగినప్పుడల్లా వీరంతా శాస్త్రి గారింటికి వచ్చి ఆతిథ్యం పొంది వెళ్ళేవారు. **తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితులను, వేద విద్యను అమితంగా పోషించింది. వారికి నెలవారీ వేతనం, స్టైఫండ్, పెన్షన్, గౌరవ భృతి వగైరాలను కలిపించి వారి జీవితాలలో వెలుగులు నింపింది**. ఈ దేవస్థానం చాలాసార్లు శాస్త్రిగారిని వచ్చి వేదపారాయణ చేయమని కనీసం గౌరవ భృతి స్వీకరించమని కోరింది. **ఆహితాగ్ని వేదాన్ని అమ్ముకోడు**అని చెప్పి సున్నితంగా తిరస్కరించే వారాయన. **వేద విక్రయం మహాపాపం అని భావించేవారు**. కనుక వారెప్పుడూ దాన గ్రహీతగా లేరు. ఎప్పుడూ ''**అపరిగ్రాహీత**'' గానే ఉండిపోయారు. తిరుపతి దేవస్తానం పట్టువదలని

విక్రమార్కుడిలా వెంటపడుతూనే ఉంది. ఆయన ఇక ఒప్పుకోరు అని గ్రహించి ఆయనను పెన్షన్ ప్లాన్ లో చేర్చి, ఉద్యోగం లేని ఆయన కుమారుడికి బహుమానంగా అందజేసింది. **వేద పరీక్షలకు శాస్త్రిగారిని పరీక్షాధికారిగా ఆహ్వానించినా తన విధి సంతృప్తికరంగా చేసేవారే కాని దానికిచ్చే భృతిని ఎన్నడూ స్వీకరించని నిష్ఠాగరిష్ఠులాయన. తప్పనిసరై కనీసం శాలువా అయినా కప్పే భాగ్యం కలిగించమని వేడితే ''సరే ఇది దత్తాత్రేయునికి సమర్పణ '' అని నవ్వేవారు**. తర్వాత దాన్ని వేరొకరికి కప్పి సంతృప్తి పడేవారు. 14వ శతాబ్దికి చెందిన అద్వైత మత ప్రచారకులు **పంచదశి** వంటి వేదాంత గ్రంథకర్త విజయనగర సామ్రాజ్య స్థాపనాచారులు **శ్రీ విద్యారణ్య స్వామి** దేవాలయం కౌశికనదీ తీరంలో, తమ ఇంటికి అతి సమీపంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని జపతపాలకు అక్కడ అందరికి వసతిగా ఉంటుందని శాస్త్రి గారు భావించి, చివరకు విద్యారణ్యులవారి గురించి జనాలకు పెద్దగా తెలియదని విరమించుకున్నారు. కాని అత్రి మహర్షి కుమారుడు దత్తాత్రేయ స్వామి బహుజన హితుడు అని భావించి, ఆయన త్రిమూర్తి స్వరూపుడు అవటంతో మొగ్గు చూపారు. కొందరు దత్తాత్రేయుడు వేదం చెప్పిన దేవత కాడు అనగా బోసినవ్వుతో "**విష్ణువు**" "**గార్హపత్యాగ్ని**"లో, "**శివుడు**" "**దక్షిణాగ్ని**"లో, "**బ్రహ్మ**" "**ఆహవనీయాగ్ని**"గా ఉన్నారు అని బదులు చెప్పారు. ఇంతటి గొప్ప ఆహితాగ్ని, విశిష్ట వేద పండితులైన శాస్త్రిగారి అగ్నిహోత్రం గదిని స్థానికులెవ్వరూ చూడనేలేదు చూసే అవకాశమూ దొరికేదికాదు. 1987లో ఒక ఉత్సాహవంతుడైన దాత ముందుకు రావటంతో చిన్న దత్తాత్రేయ దేవాలయాన్ని శాస్త్రి గారు విధి విధానంగా నిర్మించి తనకోరిక తీర్చుకున్నారు. దీని చుట్టూ **రావి, మర్రి, వేప, మేడి** వంటి పవిత్ర వృక్షాలు పెంచటానికి స్థలం సేకరించాలనీ అనుకున్నారు. ఈ వృక్షాలను, దత్తాత్రేయస్వామిని దర్శించే ప్రజలకు మనోభీష్టి కలుగుతుందని అభిప్రాయ పడ్డాడు. **బాబళ్ల శాస్త్రి గారు ముక్కు సూటి మనిషి. స్వేచ్ఛాజీవి. సంభాషణలో తన విద్యాగర్వం ప్రదర్శించరు. చాలా నిక్కచ్చిగా అభిప్రాయాలు చెప్పటం ఆయన నైజం**. బహు విద్యలలో ఆరితేరిన పండితులు కూడా, బ్రహ్మ చెవుడుతో బాధపడుతున్న శాస్త్రి గారి వద్దకు వచ్చి సందేహ నివృత్తి చేసుకొనేవారు. పంచములు కూడా వారి దర్శనం చేసుకొని తరించేవాళ్ళు. అందుకే స్థానికులు వారిని మహా పురుషుడు అన్నారు. ఇలాంటి వారిని ఆంగ్లంలో **క్రాకర్ బారల్ ఫిలాసఫర్స్** అంటారు. మహాపండితులైనా, అక్షరం ముక్క రాని వారైనా ఆయనను ఏదైనా అడిగితే తక్షణ సమాధానం చెప్పే సంస్కారి. పరులకోసమే తప్ప తనకోసం జీవించని ఉత్తమ పురుషులు శాస్త్రి గారు. **శ్రీరామపురం**లో శాస్త్రిగారి అరుగు వేదపండితులతో, వారి మధ్య అనేక విషయాలపై చర్చలతో హోరెత్తి పోయేది. ఒక్కోసారి ఆయన అధ్యాపనానికి ఇబ్బంది కలిగేది. అదొక మినీ సభా ప్రాంగణంగా భాసించేది. ఆయన దీనికి సాక్షీభూతంగా ఉంటూ, ఉద్రేకాలకువారు లోనుకాకుండా చూస్తూ, అర్థవంతమైన సమతుల్యమైన చర్చలుగా మార్చేసేవారు. ఘర్షణ వాతావరణాన్ని నివారించి

ప్రశాంతత కల్గించటం ఆయన నేర్పు. శాస్త్రిగారి అరుగు గురించి విన్నవారికి కృష్ణశాస్త్రి గారు రచించిన మా అరుగు గుర్తుకు రావటం సహజం. శాస్త్రాలలో నిష్ణాతులే అయినా, కాలానికంటే ముందే ఉండే ఆలోచనా పరులాయన. దేశంలో విస్తరించిన బహు సంస్కృతుల వ్యాప్తిని చూసినవారు. కనుక సహనానికి ప్రతీకగా ఉండేవారు. శాస్త్రిగారిలో పవిత్రత, విలువలు ప్రత్యక్షాలు. **అప్పటికే అదృశ్యమైన సువర్ణ యుగానికి ఆయన వెలకట్టలేని వారధి**. ఆయన క్రోధినామ సంవత్సర మార్గశిర శుద్ధ చవితి నాడు జన్మించి, దుందుభి నామ సంవత్సర జ్యేష్ఠ మాసంలో సుందరిగారిని వివాహమాడినట్లు ప్రసంగవశాత్తు తరచుగా చెప్పేవారు. 19వ శతాబ్దంలో తమ తండ్రి, గురువులు నడచిన మార్గాన్నే శాశ్వతం చేసే ప్రయత్నం తాను చేశాను అనేవారు. **ధర్మ విషయంలో, కర్మకాండ విషయంలో ఆయన చాలా నిక్కచ్చి. ఆధునికతను దీనిలో ప్రవేశించటానికి అంగీకరించని వ్యక్తిత్వం ఆయనది. సాధారణ శ్రౌత విధులకు కట్టుబడే ఉండాలని, సూత్రప్రాయంగా అంగీకరించేవారు**. ఒక్కసారి మాత్రమే "**లంకా**" వారి యజ్ఞంలో తన మాట, మార్గం నుంచి కొంచెం ప్రక్కకు జరగాల్సి వచ్చిందని బాధపడ్డారు. **లంకా**వారి **అగ్నిష్టోమం**లో చిన్న సదస్యం పాత్ర అంటే 17వ పురోహితుడిగా, బ్రహ్మకు సహాయకుడిగా ఉండాల్సి వచ్చిందట. తమ "**అపరిగ్రహత్వం**" అనే స్వచ్ఛంద నియమం వలన కర్మకాండలకు వెళ్ళేవారు కాదు. **వేదవిద్యాభ్యసనం చేసిన ఏ శిష్యుని నుంచీ ఆయన ఒక్క దమ్మిడీ కూడా దక్షిణగా పుచ్చుకోలేదు. ఋత్విజులకిచ్చే దక్షిణ స్వీకరించే వారు కాదు. ఇలా పుచ్చుకుంటే వేద విక్రయం అని వారి గట్టి నమ్మకం. "భూమి ఎవరైనా దానం ఇస్తే తీసుకోవటానికి, శ్రౌత క్రియలకు దక్షిణ తీసుకోవటానికి తేడా ఉందంటారు**". ఋత్విక్కుగా ఉండటానికి కూడా పెద్దగా ఇష్టపడేవారు కాదు. సరైన శిక్షణ లేని వారితో, సరైన సంబారాలు లేకుండా చేస్తే దాని ఫలితం వ్యతిరేకంగా ఉంటుంది అంటారు. **సంప్రదాయంగా వస్తున్నా వేద విద్యాభ్యాసంలో కొన్ని తప్పులు జరుగుతాయనీ, పరీక్షా విధానం సరళతరం చేస్తున్నారని, గురు ముఖ విద్య కంటే పుస్తకాలతో నేర్చుకోవటం ఆయన అంగీకరించలేదు. దీని వలన క్రియలో పొరబాట్లు జరిగి, క్రియలకు తగిన మంత్రాలు చెప్పకపోవటం జరిగి చేసే వాడికీ చేయించేవాడికి మాత్రమే కాకుండా విశ్వానికి కూడా అనర్థం జరుగుతుంది అనేవారు**. అందుకే ఋత్విజ శిక్షణ పొసైనవారితో కలిసి పని చేయటం ఇష్టం ఉండేదికాదు. వారిలో పరిపూర్ణత ఉంటుందనటం తనకు తెలీని విషయం అనేవారు. చాలాసార్లు "**సోమభక్షణ**"లోని ప్రమాదాలపై ఆయన హెచ్చరించేవారు. కాలంలో ఎన్నో మార్పులొస్తున్నాయి. **భమిడిపాటి** వంశంలోనే అగ్నిష్టోమానికి 18 మంది ఋత్విజులు, సర్వతోముఖానికి తగినంత మంది తయారయ్యారని సంతోషంగా చెప్పేవారు. ఒకప్పుడు నాలుగైదు రోజులు చేసే ఉపనయనం ఇవాళ కొన్ని గంటల తంతుతో సరిపుచ్చటం ఆయనకు నచ్చని విషయం. అలాంటివాడు ఏ విధంగా బ్రాహ్మణుడు అనిపించుకొంటాడని ప్రశ్నిస్తారు. తన ఆహితాగ్ని గురువు **బులుసు**

**సోమయాజులు** గారు అని గర్వంగా శాస్త్రి గారు చెప్పుకొంటారు. **అభిచార** ఎలా చేయాలో ఆయనే దగ్గరుండి నేర్పారని కృతజ్ఞత తెలియజేస్తారు. నిత్యాగ్నిహోత్ర విధానంలో తనకు ఎన్నో అద్భుత దృశ్యాలు కనపడినాయన్నారు. ఒకసారి అగ్నిహోత్ర సమయంలో ఒక అద్భుత తేజస్సు హోమం నుండి బయటికి వచ్చి తన కళ్ళ ముందు దర్శనమిచ్చిందని ఇదొక శుభ సూచనగా తాను భావించానని, తన కోడలు ప్రసవించి మగపిల్లాడికి జన్మనిచ్చిందని ఆనందంగా చెప్పారు. మరోసారి ఆహవనీయాగ్ని పూజ చేస్తుంటే ఒక చతుర్భుజ పురుషుడు కనిపించాడని, దీని ఫలితం ఏమిటి అని ఆలోచించగా, రెండవ మనవడుకూడా త్వరలోనే రాబోతున్నాడని తెలిసిందని ఆ ''వేదపండు'' అయిన ఆహితాగ్ని **బాబళ్ళ శాస్త్రి** గారనే **బ్రహ్మశ్రీ భమిడిపాటి యజ్ఞేశ్వర సోమయాజులు** గారు చెప్పారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -7

గురువుగా ఋత్విక్కుగా తి.తి.దే ఆస్థాన పండితునిగా దక్షిణ స్వీకరించని, అర్హులు కాని వారితో సోమరసం తాగని "**బాబళ్ల శాస్త్రి**" గారు ఆనాటి వైదిక ఉన్నత బ్రాహ్మణులలో అరుదైన వ్యక్తి. ఆయనంత వారు ఆయనే. ఆయన తర్వాత వేరెవరూ లేరు అన్నారు వారి ప్రక్కింటి సామవేదం వారు. 1993 జూన్1 లో తుంటి ఎముకకు గాయమైనప్పటి నుంచి మంచంపై దర్భ పరచుకొని పడుకునేవారు. ప్రక్క మంచంపై కేన్సర్ వ్యాధితో చావు బ్రతుకుల మధ్య ఉన్న ఒక్కగానొక్క కుమారుడు **బుల్లెబ్బాయి** పడుకోనేవాడు. శాస్త్రి గారి చేయి ఎప్పుడూ ఆప్యాయంగా అతని మీదనే ఉంచేవారు. కుమారుడికంటే తన అంత్యేష్టి ముందు జరిగితే బాగుండునని కోరుకొనేవారు. ఇలా జరిగితే తండ్రి శ్రార్ధం కొడుకు పెట్టే అవకాశం ఉంటుందని వారి భావన. కొడుకు చేతులమీదుగా చనిపోయానన్న సంతృప్తి మిగులుతుందని ఆశ. భగవంతుడు శాస్త్రి గారి కోరిక నెరవేర్చాడు. శాస్త్రి గారు 1993 ఆగస్ట్6న ఉత్తమ లోకాలకు వెడితే, 64 ఏళ్ళ కొడుకు ఆరు నెలల తర్వాత1994 జనవరి 1న చనిపోయాడు. ఆహితాగ్ని అయిన శాస్త్రిగారు మరణించారు కనుక వారికి **బ్రహ్మమేధ** అంతిమ సంస్కారం జరగాలి. **ఇది మూడు గంటలు త్రేతాగ్నులతో ఇతర దహన కృత్యాలతో పాటు ఎముకలను మళ్ళీ దహనం చేసి సోమయాజులకు చేసే ప్రక్రియగా** చేశారు. దీన్ని **పునర్దహనం** అంటారు. దీన్ని **లోష్ట చితిపై** నిర్వహిస్తారు. **శ్రీరామపురం, నేదునూరు, వ్యాఘ్రేశ్వర** యువ ఆహితాగ్నిలు చూసిన **మొదటి బ్రహ్మమేధం**. తర్వాత కాలంలో చాలా మందికి జరిపారు. **దువ్వూరి యాజులు** గారి భార్య **సూర్య** గారికి, **పుల్లెల** వారి భార్య **కామేశ్వరి** గారికీ, **బులుసు చయనులు** గారికి, **లంకా** వారికి ఇలాగే చేశారు. **ఆహితాగ్ని మరణిస్తే మరణించిన క్షణం నుంచి ''అశౌచం'' అంటే''మైల'' పాటించరు. "బ్రహ్మమేధం" జరినప్పటినుంచి మైల పాటిస్తారు**. తాను చనిపోతే పూణాలో ఉన్న తన ప్రియశిష్యుడు

ఆధ్యాత్మిక కుమారుడు **చిర్రావూరి రామం** వచ్చేదాకా అంత్యక్రియలు చేయవద్దని చావు మంచంలో ఉండగానే ఆదేశించారు శాస్త్రి గారు. టెలిగ్రాం అందుకొని రైల్లోపడి రాజమండ్రి వచ్చి టాక్సీలో రోజున్నర తర్వాత శ్రీరాంపురం చేరాడు రామం. చిక్కి శల్యమైన శాస్త్రిగారి పార్థివ దేహాన్ని అగ్నిహోత్రం గదికి వెలుపల మంచు గడ్డలపై ఉంచారు. శాస్త్రీయంగా, న్యాయబద్ధంగా ఆయన అప్పటికి ఇంకా చనిపోనట్లే లెక్క. రామం రాగానే మిగిలినవారితో కలిసి శాస్త్రిగారి మండుతున్న ఆరణి చితులను బయటికి తీసి, **గార్హపత్యాగ్ని** లో కలిపి, **ఆహవనీయ, దక్షిణాగ్ని**లో కూడా కలిపి మూడిటిలోను **మహాజ్వాల** వచ్చేట్లు చేశారు. **చివరి ఇష్టి ఇంటిలోనే నిర్వహించి**, ఆయన భార్య చివరి రోజులలో చేయలేకపోయిన అగ్నిహోత్రం ఇష్టి, అగ్రయణాలకు ప్రాయశ్చిత్త హోమాలు చేసి ఈ సమిధలను మూడు కుండలలో **గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్ని**లుగా సేకరించారు. నాలుగవ కుండ **గృహాగ్ని ఔపసనాగ్ని**లను మూడువైపులా తాళ్ళతో కట్టి ఇంటిబయటకు చేర్చి, కొడుకు **బుల్లెబ్బాయి**కి ఆసరాగా ఉంటూ, భార్య సుందరి గారికి కడసారి చూపు కల్పించి, బుల్లెబ్బాయి బ్రతికి ఉన్నాడు కనుక మనవడు మనవడు ప్రసాద్ అంత్యక్రియలలో పాల్గొనరాదు కనుక అతన్ని ఇంటివద్దనే ఉండిపొమ్మని, స్మశానానికి పార్థివదేహాన్ని చేర్చి, **త్రేతాగ్నులను ఆయన దేహంపై ఉంచి ఆహవనీయాగ్నిని ఆయన శిరసు క్రింద ఉంచి దక్షిణాగ్నిని ఛాతీపై కుడివైపున, గార్హపత్యాగ్నిని కుడితొడ వద్ద ఉంచి కట్టెపుల్లలను కప్పి యథావిధిగా దహనక్రియ పూర్తి చేశారు**. మూడు గంటలలో ఆయన దేహం తాను ఇంతకాలం ఆరాధించిన అగ్నికి ఆహుతై, ఆయన పవిత్రాగ్నిదేవునిలో చేరిపోయారు. **బ్రహ్మమేధ, పునర్దహన, లోష్ట చితి విషయాలు స్థానిక లౌకిక అపర కర్మలు చేయించే వారికి అవగాహన ఉండనివి. ఒకవేళ ఉన్నా వాటిని నిర్దుష్టంగా చేయించే సాహసం చేయలేరు**. శాస్త్రిగారి **అపరకర్మ** అంటే **దహనం తర్వాత రోజు నుంచి 12వ రోజు వరకు నిర్వర్తించాల్సిన వాటిని** అమలాపురం లోని **ఆకొండి సూర్యనారాయణ** గారిని పిలిపించి యథావిధిగా చేయించారు. 13వ రోజు **అస్థి సంచయనం, పునర్దహనం, లోష్ట చితి** ఏర్పాటులను **చిర్రావూరి రామం** గారు అనే **బాబళ్ళ శాస్త్రి** గారి **ముఖ్య శిష్యుడు**, ఆయనకు ఆధ్యాత్మిక కుమారుడు, **దువ్వూరి యాజులు, బులుసు చయనులు** గారి సాయంతో **పితృమేధ సూత్రాల**తో చేశారు. **ఇవి అందరికి అందుబాటులో లేనివి కనుక పుస్తకమే శరణ్యం.** ఆయన చితాభస్మాన్ని భద్రపరచి గంగలో కలపాల్సిన పనేలేదు, కారణం, ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైన పవిత్రమైన కౌశికీనది సమీపంలోనే ఉంది కనుక. సపిండీకరణ జరిగిన రెండు వారాల తర్వాత ఇంట్లో ఉన్న ఆయతన మట్టి హోమ గుండాలను ఛిద్రం చేశారు. అయన ప్రేతాత్మ పితృరూపం పొందింది. నెలమాసికాలు పెట్టారు. కొడుకు బుల్లెబ్బాయి నాలుగు పెట్టాడు. నాల్గవది పెట్టె రోజు ఉదయమే ఆయన చనిపోయాడు. శాస్త్రి గారి భార్యను ఓదార్చటం ఎవరి తరమూ కాలేదు. అసలే చెవుడు. ఇప్పుడు కొడుకు మరణంతో తాను గుడ్డిదాన్నే

అయ్యానని రోదించింది. ఆమె కూడా జులైలో చనిపోయింది. విధవ అయిన కోడలు సావిత్రి రెండు తరాలు కళ్ళ ముందే అదృశ్యమవటం జీర్ణించు కోలేకపోయింది. ఊరి జనం శాస్త్రి గారింటికి ముహూర్తాల కోసం, ధర్మసందేహాలు తీర్చుకోవటానికి రావటం పరిపాటి. ఇప్పుడు మనవడు **యజ్ఞేశ్వర ప్రసాద్** ఆ పని చేస్తున్నాడు. ఇతడు తాతగారి వద్ద 82 పన్నాల "**తైత్తిరీయం**" 19వ ఏటికే నేర్చాడు. తర్వాత లౌకిక విద్యా నేర్చి సైన్స్ గ్రాడ్యుయేట్ అయ్యాడు. దగ్గర ఊరిలో టీచర్ గా పని చేశాడు. **పాలకొల్లు** పిల్ల **లక్ష్మీనరసకాంత**ను వివాహమాడి వరుసగా అందమైన ముగ్గురు ఆడపిల్లలు **రేఖ, మాధురి, కల్యాణి**లకు తండ్రి అయ్యాడు. దురదృష్టవశాత్తు ఇక ఆమెకు సంతానం కలగదని డాక్టర్లు చెప్పారు. దీనితో బ్రహ్మీభూత **బాబళ్ళ శాస్త్రి** గారి వంశం ఆగిపోవటం విచారకరం. ప్రసాద్ సైన్స్ లెక్కలు, సోషల్, తెలుగులను చక్కగా బోధించేవాడు. తెలుగు తప్ప ఆ విద్యలను హూణ విద్యలని ఆ కాలంలో అనేవారు. అతడు **అమలాపురం**లోని **గోదావరి మండల వేద పరిషత్** కు కార్యదర్శి. యవ్వనంలో ఋత్విక్కుగా బాగా రాణించాడు. తన పూర్వీకుల శ్రౌతం తమకు అచ్చిరాలేదని భావించాడు. తన తాతగారు తన తండ్రి కంటే పూర్తి అధికారి. తనను తీర్చి దిద్దింది ఆయనే అనేవాడు ప్రసాద్. తాతగారి సలహా ఆనాడు దైవాజ్ఞగా భావించేవారు. స్మార్తంలో ప్రతి సూక్ష్మ విషయం తాతగారికి తెలుసునని కాని ఎన్నడూ దాన్ని కర్మకాండలకు వాడలేదని అన్నాడు. తమ ఇంట్లో జరిగే కార్యక్రమాలన్నీ తరతరాలుగా ఇంటి పురోహితుడుగా ఉన్న అగ్రహారంలోని ఆహితాగ్ని **బులుసు చయనులు** గారే చేసేవారని అన్నారు. వేద సభలకు, పెళ్లిళ్లకు ఉపనయనాలకు వచ్చే ఆహితాగ్ని బ్రాహ్మణులకు ఆహితాగ్ని అవసరం ఉందని గ్రహించి శాస్త్రి గారు, అర్ధాంగి **సుందరి**గారు 1970 నుండి 1990 వరకు ఇరవై ఏళ్ళు శ్రావణ, భాద్రపద మాసాలలో **ముక్కామల**కు వెళ్లి నలభై రోజులు ఉండి ఆమె చేతి మీదుగా వంట చేయించి ఆహితాగ్ని వేదపండితులకు భోజనాలు పెట్టేవారు. దీన్ని శాస్త్రిగారు **ప్రసాదం** అనేవారు. 1980లో ఒక విదేశీ ఇక్కడికి విషయాలు తెలుసుకోనాలనే ఆసక్తితో వస్తే, అతనితో శాస్త్రిగారు "మీరు మాలో ఒకరు. మీరు ఇక్కడి వారికంటే మా సంప్రదాయాలు, ఆచారాలు తెలుసుకోవటానికి మిక్కిలి ఉత్సాహం, ఆసక్తి చూపిస్తున్న సహృదయులు. ఏదో పూర్వజన్మవశాత్తు మీరు ఆ దేశంలో పుట్టారు. కాని మీరు మా దేశానికి, మా ప్రాంతానికి, మా సంప్రదాయానికి చెందినవారే" అని మనస్ఫూర్తిగా ఆహ్వానించిన గొప్పసంస్కారి శాస్త్రి గారు. **చిర్రావూరి రామం** శాస్త్రిగారి అంతేవాసి, ఆత్మీయ సుపుత్రుని వంటి వారు. అందుకే **శాస్త్రి** గారు తన అంత్యేష్టి ఈయన వచ్చాకనే జరగాలని కోరారు. గురువుగారికి ఇష్టిలో చాలా ఏళ్ళు సహాయకులుగా ఉన్నారు. కలిసి **వేదం, మీమాంస, వ్యాకరణం, తర్కం** నేర్చారు. ఆయన రాజమండ్రిలో ప్రభుత్వ ఓరియంటల్ కాలేజిలో సంస్కృతం బోధించారు. శాస్త్రిగారి మరణ సమయంలోనూ వారు ఉద్యోగం చేస్తూనే ఉన్నారు. పూణా

యూనివర్సిటిలో బోధన చేసినా, నచ్చక వదిలేశారు. వేదాలలో ప్రాచీన విజ్ఞానం ఉందని అంటారు. ఆయనకు **సెంటర్ ఫర్ రిసెర్చ్ ఇన్ ది సైన్సెస్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియా** స్థాపించాలని ఉండేది. దీని **ద్వారా కుష్టు, ల్యూకోడర్మా, చెవుడు, పాముకాటు, జ్వరం, గుండె జబ్బు, క్షయ, తెల్లజుట్టు** మొదలైన వాటి నివారణకు మందులు కనిపెట్టాలని ఆయన ఆలోచన. భోపాల్ గాస్ దుర్ఘటనలో కంటిచూపు కోల్పోయిన వారికి కంటి చూపు తెప్పించటానికి, వేదపండితులచే అక్కడ హోమాలు చేయించారు. బాబళ్ళ శాస్త్రిగారి మరణం **శ్రీరామపురం, నేదునూరు, వ్యాఘ్రేశ్వరం**లలోని నలుగురు ఆహితాగ్నులపై ప్రభావం చూపించింది. భావి తరాలను ప్రభావితం చేసే శాస్త్రి గారు లేకపోవటం పెద్ద లోటే అని ఆ అగాధాన్ని పూడ్చలేమని అనుకున్నారు. శాస్త్రిగారి నిజాయితీ, సమర్ధత, ముందుచూపు, సద్యోస్పందన నిజాన్ని గుర్తించే నైజం ఇతరులెవ్వరిలోను లేనివి, రానివి, రాలేనివి కూడా. ఒకసారి శాస్త్రి గారు ఏదో గ్రంథం తిరగేస్తున్న **దువ్వూరి యాజులు** గారిని చూసి ఏం చేస్తున్నారు? అని అడిగితే ఆయన "గ్రంథం తిరగేస్తున్నా 'అనగానే ''ఎందుకా శ్రమ? మీరే ఒక ఉద్గ్రంథం కదా ''అన్నారట. అదీ ఆ మనీషి గొప్పతనం.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -8

### రెండవ ఆహితాగ్ని – బ్రహ్మశ్రీ దువ్వూరి యజ్ఞేశ్వర పొండరీక సోమయాజులు గారు

**బాబళ్ళ శాస్త్రి** గారి కుటుంబం **శ్రీరామపురం** చేరేనాటికి **శ్రీ దువ్వూరి యజ్ఞేశ్వర పొండరీక యాజులు** గారు అప్పటికే 17 ఏళ్ళ నుంచి రోజు రెండుసార్లు అగ్నిహోత్రాన్ని చేస్తున్నారు. వీరిని **దువ్వూరి యాజులు** గారు అనే అందరూ పిలిచేవారు. రెండు కుటుంబాలు ప్రక్కప్రక్కనే ఉండేవి. చివరి ఏడేళ్ళు నూతన గృహంలో అగ్నిహోత్రం చేశారు. 1915లో **కపిలేశ్వరపురం**లో జన్మించిన ఆయన **ఆత్రేయస** గోత్రీకులు. ఉదార హృదయులు. వీరి కుటుంబంలో నాలుగు తరాలవారు వేదంలో సర్టిఫికేట్ పొందినవారు. ఈయన మూడవ కొడుకు 27 ఏళ్ళకే వేదపండితుడయ్యాడు. మూడవ కొడుకు కొడుకు అంటే యాజులుగారి మనవడు ఘనపాఠీ. యాజులుగారు నాలుగేళ్ళు తండ్రి వద్దనే వేదం అభ్యసించారు. మరో అయిదేళ్ళు **ముక్కామలలో బాబళ్ళశాస్త్రి** గారి తండ్రి **చిన్న సుబ్రహ్మణ్య సోమయాజులు** గారి వద్ద నేర్చారు. పరీక్ష ఇచ్చాక, పెద్దక్క గారి భర్త వద్ద అంటే బావగారి వద్ద **కోరుమిల్లి, తణుకు, వ్యాఘ్రేశ్వరా**లలో చదివారు. **శ్రౌతం**తో మిగిలిన విషయాలనూ 24 వయేట 1939 కి పూర్తి చేశారు. అప్పటికే పెళ్లి అయి ఒక కొడుకు, కూతురు కలిగారు. శ్రౌతం నేరుస్తూ వేద పాఠాలు బోధించారు''నేను చదువుకోలేదు సంతకం చేయటం కూడా రాదు '' అని ఆ రోజులను జ్ఞాపకం చేసుకొన్నారు. తర్వాతే వ్రాయటం చదవటం అలవాటైంది. బడికి వెళ్ళనే లేదు. వేదం తప్ప మరే వ్యాపకం లేదు. తమ తాతగారు వైదికోగ్రవాది **(మిలిటెంట్ వైదిక్)** అని

చెప్పేవారు. **స్వస్తి వాచకం, ఋగ్వేదం 1-8 ౨ క్రమ, ఘన, జటలు** తప్పులు లేకుండా వల్లించినందుకు పారితోషికాలు పొందారు. తప్పులు లేకుండా స్వస్తి చెప్పిన వారిని ''వీరుని'' గా భావించేవారట. అంటే హీరో అన్నమాట. **సామూహిక స్వస్తి** అంటే ఆయనకు చాలా ఇష్టం. అలా చేయటంలో ఎంతో ఉత్తేజం కలుగుతుందన్నారు. ఒకసారి **శ్రీరామపురం** నుండి తమ బృందం భార్యలతో సహా హైదరాబాద్ వెళ్లి ౨7 రోజులు స్వస్తి చెప్పారు. అది అద్భుతమైన కాలం అని గుర్తు చేసుకొన్నారు. వేదం నేర్పటానికి తరచు ఊరు వదలి వెళ్ళాల్సి రావటంతో తన పొరుగువారైన **లంకా** వారిలాగా వ్యవసాయంపై దృష్టిపెట్టలేక పోయానని బాధపడ్డారు. **లంకా**వారు యాభై ఏళ్ళు వ్యవసాయం చేశారని చెప్పారు. ఆహితాగ్ని మనవడు, ఆహితాగ్ని కుమారుడు ఆహితాగ్ని అయిన తమ్ముడికి అన్న, ఆహితాగ్ని **బాబళ్ళ శాస్త్రి** గారి ఆహితాగ్ని తండ్రిగారి శిష్యుడు అయిన **యాజులుగారు ''నా జీవితమంతా శ్రౌతంలోనే గడిచింది. అది తప్ప నాకు వేరే ఏమీ తెలీదు ''** అని చెప్పారు. ఇది పూర్తి సత్యం కాదు. ఎందుకంటే ముసలితనంలో కళ్ళు కనబడకపోయినా, ఇతరుల సాయంతో నదికి వెళ్లి నిత్య స్నానం చేసేవారు. 86 ఏళ్ళ వయసులో కూడా మనవడు కిరణ్ కు వేదం నేర్పేవారు. ఈ వయసులో కంటి చూపు లేని వారెవ్వరూ అలా బోధించినవారు లేరు. జీవితంలో 1- ప్రధాన ౨-మధ్య 3- ముసలితనం అనే మూడు దశలుంటాయి. 33 ఏళ్ళ వయసులో అంటే మధ్య వయసు ప్రారంభంలో యజ్ఞం చేయాలి. 61వ ఏట కదలలేని స్తితి వస్తుంది. ఈ వయసులో కాళ్ళు చేతులు మనం చెప్పినట్లు వినవు కనుక కర్మకాండకు ఇబ్బంది కలుగుతుంది. **బాబళ్ళశాస్త్రి** గారు **అగ్నిహోత్రం** ప్రారంభించే సమయానికి **యాజులు**గారు 30వ ఏటనే 1945 నాటికి "**అగ్నిష్టోమం**" చేసి ఆహితాగ్నిలలో కూడా ముందున్నారు. ఒక దశాబ్దం తర్వాత ఆయన మేనల్లుడు **మిత్రనారాయణ** అగ్నిహోత్రం ప్రారంభించి ౨౨వ ఏటనే యజ్ఞం చేసి యాజులు గారి రికార్డ్ను అధిగమించాడు. **యాజులుగారి ఆధానం, అగ్నిహోత్రం కపిలేశ్వరపురంలోనే జరిగాయి**. అన్నగారు చేస్తుంటే చూసి నేర్చుకున్నారు. నాలుగేళ్ల తర్వాత 1949లో అక్కడే **అగ్నిచయనం, శ్రౌతం** నిర్వహించారు. ఇప్పుడూ పెద్దన్నగారిని ముందు చేయించి తాను చేశారు. **చయనం, 40 రోజుల "అగ్నిచయనం" ను "పౌండలీకం" అంటారు**. వీటిని చేయిస్తున్నప్పుడు తానే ఎందుకు **పౌండలీకం** చేయకూడదు అనే ఆలోచనకలిగింది. శాస్త్రాలు తిరగేసి కావలసిన సమాచారం సేకరించారు. **పౌండలీకం**లో ఉన్న **మహావ్రతం**లో **''అంతర వేది**''పై వేదం చదివిన బ్రహ్మచారి బ్రహ్మచర్య దీక్ష చేబట్టటానికి **పుంశ్చలి** అంటే **వేశ్యతో సంభోగం చేయిస్తారు** దీనివలన అతనిలో బ్రహ్మాండమైన వీర్య వృద్ధి జరుగుతుందని నమ్మకం. చాలా తెలివిగా దీన్ని నిర్వహించారు యాజులు గారు. **వ్యాఘ్రేశ్వరం**లోని ఆహితాగ్ని **బులుసు కామేశ్వర, సత్యవతి దంపతులు** తమ అగ్నిహోత్రాన్ని ఫోటోలు తీయటానికి ఆనందంగా ఒప్పుకున్నారు. యాజులు గారికి మనవడు **సీతారామ శాస్త్రి** ఈ విషయం చెప్పగా దిగ్భ్రాంతి చెందారట.

**''అగ్నిహోత్రాన్ని ఇతరులకు చూపించటం అంటే కన్నతల్లి వస్త్రాలను ఊడదీయటమే"** అన్నారట **యాజులు. తన అగ్నిహోత్రం పవిత్రం, రహస్యం అనే వారట**. భార్య **సూర్యసోమిదేవమ్మ** గారినీ ఎవరికీ కనిపించనిచ్చేవారుకారు.



## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -9

### ఆహితాగ్ని – బ్రహ్మశ్రీ దువ్వూరి యజ్ఞేశ్వర పౌండరీక సోమయాజులు గారు -2

1922 లో **శ్రీమతి సూర్య** గారిని వివాహమాడిన **దువ్వూరి యాజులు** గారు 67ఏళ్ళ వైవాహిక జీవిత సౌఖ్యం అనుభవవించి 10 మంది సంతానం పొందారు. **వైవాహిక జీవితంపై పూర్తి నమ్మకం, గౌరవం కలవారాయన. వివాహంలో పరమార్థం, శ్రద్ధ, బ్రహ్మలోకం ఉన్నాయని అంటారు**. వివాహ వేడుక దంపతులకే కాక బంధు మిత్ర అభిమానులకూ ఆనందదాయకం కన్నుల పండుగ. **పెళ్లిచూపులలో మొదలైన చూపులు అయిదు రోజుల వివాహంలో ఎన్నోసార్లు భార్యను భర్త చూస్తాడు. ఆ చూపుల్లో ఆమె అంద చందాలనుకాక, ఆమె అంతఃసౌందర్యాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేస్తాడు. అప్పుడే అది "నిజమైన చూపు" అవుతుంది**. ఆమెకు 7 ఆయనకు 14 ఏళ్ళ వయసులో వివాహమైంది. యాజులుగారి తండ్రి, మేనమామ సంబంధం ఖాయం చేశారు. గౌతమి గోదావరిపై అన్ని వసతులు, రోడ్డు, పడవ ప్రయాణ సౌకర్యం ఉన్న **నేదునూరు**కు చెందిన దూరపు బంధువు ఆమె. ''ఆ అయిదు రోజుల పెళ్లి మరువరాని అనుభవం'' అంటారు ఆయన. మామగారు వంట చేసేవాడు అత్తగారు కాదు. మిఠాయిలు వండేవాడు. అవి ఎంతో పవిత్రమైన రోజులు. ఆయనకు కట్నంగా 116 వెండి రూపాయలిచ్చారు. ఆయన బావమరిది వాటిని అంగవస్త్రంలో మూటకట్టి మోసుకు వచ్చాడు. అప్పుడు ఒక రూపాయి అంటే రెండున్నర తులాల వెండి. పెళ్లి కొడుక్కి పట్టు పంచలు ఆడపడుచుకు తలా13 రూపాయలు ఇచ్చారు. పెళ్లి కుమార్తె నగలకోసం యాజులుగారు 200 రూపాయలు ఖర్చు చేసి వడ్డాణం, నెక్లెస్, గాజులు చేయించారు. **యాజులుగారు భార్యకు తానే గురువై**

**మంత్రార్థాలు వివరిస్తూ విధులకు ఎలా తోడ్పడాలో బోధించారు. అందులో ఆడవారి కోసం చాలా ప్రత్యేక మంత్రాలున్నాయి. వీటిని భట్టీయం వేయాల్సిందే.** పెళ్లి అయిన 16 ఏళ్ళకు యజ్ఞానికి ముహూర్తం ఏర్పాటు చేసుకున్నారు. ఆమెకు అగ్నిష్టోమ మంత్రాలు నేర్పారు. ఆమె చనిపోయిన నాలుగేళ్ళ తర్వాత సోమిదేవమ్మగా, ఆమె అంత్యేష్టికి పునర్దహనం చేశారు. ఆహితాగ్ని భార్యకు ఇలా చేయటం సంప్రదాయం. ఆమె తనలాగా సోమపానం చేయకపోయినా దాని ప్రభావం ఆమెకు లభించాయి అని యాజులు గారు వివరించారు. **ఆమె చనిపోయేదాక భర్త వదిలేసిన భోజనం అంటే ఉచ్ఛిష్టం తినేది. ఈ నియమాన్ని జీవితాంతం పాటించిన సాధ్వి.** 24 ఏళ్ళకే విద్య పూర్తి చేసిన యజులు గారు మొదట కొడుకుకు తర్వాత కుమార్తెకు తండ్రి అయ్యారు ''నాభార్య 14 కాన్పులు కన్నది. అన్నీ ఇంట్లోనే. ఎరుకలసాని వచ్చి 4 రూపాయలకే పురుడు పోసేది. ఆ కాలంలో మందులు సాధారణమైనవి, చవక, తేలికగా దొరికేవి. నలుగురు పిల్లలు చిన్నతనంలోనే చనిపోయారు. ''బహు సంతానానికి తండ్రిగా గర్వపడేవాడిని. ఒకసారి హైదరాబాద్ లో నా సంతానం సంగతి తెలిసిన ఒక స్త్రీ అమాంతంగా నాపాదాలను స్పృశించి కళ్ళకు అద్దుకుని నమస్కారం చేసింది. అగ్రహారాలలో ఉండేవారికి కనీసం 20 మంది మనవాళ్ళు మనవరాళ్ళు ఉండటం ఆనాడు సహజం, సమంజసం. నాకు 40 మంది ఉండటం నా అదృష్టం ''అని చెప్పారు. తేలికగానే అయిదుగురు ఆడపిల్లల వివాహాలు చేశారు. వరకట్నంను ఆక్షేపించే వారిని లెక్క చేసేవారు కాదాయన.

1940 -50 దశకంలో డెల్టా ప్రాంతమంతా ఆయన పేరు మారు మోగేది. 1990 నాటికి పరిస్థితులు చాలా మారిపోయాయని, పెళ్ళిళ్ళు కుదర్చటం కష్టమైపోతోందని బాధపడ్డారు. విలువలు పతనమయ్యాయని అన్నారు. వేదం, యజ్ఞయాగాది క్రతువులపై జనంలో ఆసక్తి తగ్గిందని వ్యథ చెందారు. తన కుటుంబంలోనే మనవరాళ్ళ పెళ్ళిళ్ళు చేయటం తనకు ఆశక్యంగా ఉందని, కారణం కట్నకానుకలు విపరీతంగా పెరగటమేనని అన్నారు.1936లో **యాజులు**గారబ్బాయి **సర్వేశ్వర సోమయాజులు** ఆహితాగ్ని అవుతాడని ఆశించారు. 19 ఏళ్ళప్పుడే తండ్రివద్ద వేదం పూర్తిచేసి, పెళ్లి చేసుకొని, గొర్తి వారి వద్ద చేరి ఘనపాఠీ అవుదామనుకొంటే ఈశ్వరానుగ్రహం వేరుగా ఉండి, **శివపురాణం**పై ఆసక్తిపెరిగి, తరచుగా కాశీ వెళ్లి గంగా స్నానం విశ్వేశ్వర దర్శనం చేస్తూ, కోనసీమలో శుభార్యాలలో సంభావన తీసుకొంటూ **శతరుద్రీయం** సాధించి వేదపండితుడై జీవనం గడపాల్సి వచ్చింది. దీనిపై అతన్ని కదిలిస్తే **''యోగం దైవం ఈశ్వర ఈశ్వర''** అనేవాడు శివారాధనమే ముక్తినిస్తుందని నమ్మాడు. యాజులు గారు 25 ఏళ్ళు ఈ కొడుకు పేరు ఎక్కడా ఎత్తలేదు. **సర్వేశ్వర** ఇద్దరు కొడుకులు వేదం నేర్వలేదు. కాని ఒకమ్మాయిని మాత్రం వేద పండితుడికిచ్చి పెళ్లి చేశాడు. వీళ్ళ కొడుకు **ఇరగవరం** వెళ్లి ముత్తాత **గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి** గారి వద్ద అధ్యయనం చేశాడు. **నేదునూరు ''ఋషి''**గా ప్రసిద్ధులైన **లంకా** వారు **సర్వేశ్వర**ను **అపస్తంభ సూత్రాలు**

బోధించమని కోరినా వినలేదు. దువ్వూరి కుటుంబలో ఎగుడు దిగుడులు వచ్చి శ్రౌతమార్గం గాడి తప్పింది. సర్వేశ్వర శివ భక్తుడు అనిపించుకున్నా పౌరాణికుడు, వేదపండితుడు, ఘనపాఠీ కాకపోయినా తిరుపతి దేవస్థానం ఆయనకు వృద్ధాప్యపు పెన్షన్ 1994లో అందజేసింది. ఆయన వేదవిధి —హిందూ మతం మధ్య క్రాస్ రోడ్ పై ఉండిపోయాడు. 2007లో అకస్మాత్తుగా అయన నిత్యాగ్నిహోత్రునిగా అగ్నిష్టోమం చేయాలని అనుకొన్నాడు. అదే సమయంలో చిన్న తమ్ముడు **సూర్య ప్రకాశ అవధాని**, భార్య **కనకదుర్గ** అదే నిర్ణయానికి వచ్చారు. కానీ ఈ ఇద్దరూ **వైశ్వదేవం** దాటి ముందుకు పోలేకపోయారు. యాజులుగారి రెండవ, నాలుగవ, అయిదవ కుమారులు వేద మార్గం వదిలి లౌకికంలో ఉన్నారు.

## యాజులు గారి అంతిమ యాత్ర:

1996 డిసెంబర్. ఒకరోజు యాజులు గారి భార్య **సూర్య** ఆ ఊళ్ళో సామవేదం వారింట్లో జరిగిన పెళ్ళికి వెళ్లి రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరి భర్తకు ప్రొద్దున్నే లేచ్చి కాలకృత్యాల తర్వాత తులసి కోట చుట్టూ ప్రదక్షిణం చేసి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక ప్రసాదం వండాలనుకొన్నది. ఇంతలో గోడకు ఆనుకొని ఆమె పడిపోయారు. అప్పుడాయన అగ్ని హోత్రం చేస్తున్నారు. వెంటనే బయటికి వచ్చి, అప్పటికే ఆమె ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోతున్నాయని గ్రహించి ఆ సమయంలో చదవాల్సిన కర్మ మంత్రాలు చదివారు. అవి **తైత్తిరీయ ఉపనిషత్** మంత్రాలు. ఈమెకు ప్రాయశ్చిత్త కార్యక్రమం చేయాల్సిన అవసరం లేదు. దంపతులిద్దరూ అప్పటికే దీపావళినాడు **అగ్రయణం** చేసి ఉన్నారు. పునిస్త్రీ మరణం పొందినందుకు కాలవ దగ్గర **మూసివాయనం** జరిపారు. పత్నిగా **బ్రహ్మమేధం** చేశారు. అప్పటికే కళ్ళు కనిపించని 51 ఏళ్ళుగా ఇష్టి, సోమయాగం చేసిన ఆయన ఆమె చితి వద్ద నిశ్చేష్టంగా మౌనంగా ఉన్నారు. **''అగ్నిని ఆమె తనతో తీసుకు వెళ్ళింది. నాకు వంటింటి అగ్గిపుల్లలే మిగిలాయి''** అని విచారించారు. 62 ఏళ్ళ నిండు దాంపత్యం విచ్ఛిన్నమైంది. అగ్నికి ఆమె పార్థివ దేహం ఆహుతైంది. ఆమె అస్తులకూ పునర్దహనం చేశారు. చాలా కాలం క్రితం **అగ్నిష్టోమం** చేసి, ఆయన ఒకసారి గోదావరి జిల్లాలో జరిగిన వేదసభకు శ్రావణ మాసంలో వెళ్ళారు. అప్పుడు ఒక ముసలాయన ''నువ్వేనా యజ్ఞం చేసిన వాడివి?'' అని అడిగాడు. ''నేనే ''అన్నారు. ''చాలా డబ్బు అనవసరంగా ప్రయోజనం లేకుండా ఖర్చు చేశావు" అనగానే యాజులుగారు నివ్వెరపోగా ఆయన ''భయపడకు నీకు 80ఏళ్ళు దాటాక నీ అగ్నిహోత్రాన్ని నీ భార్య తీసుకు వెడుతుంది" అన్నాడు. పెద్దాయన ఆనాడే నిజం చెప్పాడు అనుకున్నారిప్పుడు. తన నాయనమ్మ గారు కూడా తాతగారి కంటే ముందే చనిపోయారు. ఆమె అత్తగారూ, తండ్రిగారి పెద్దన్న భార్యా అలాగే పోయారు. భార్య మరణం తర్వాత యాజులు గారు రాత్రి పూట భోజనం చేయకుండా మధ్యాహ్నం ఫలహారం మాత్రమే చేసేవారు.

చివరికాలంలో 86వ ఏట ఒకరోజు ఆయన తన తల్లిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఒక రోజు తనను ఆమె ఒక వింత ప్రశ్న అడిగిందట ''ఒరే నాయనా! దేవుడు నన్ను మరచి పోయాడేమోరా? ఎవరైనా ఆయనకు జ్ఞాపకం చేస్తే బాగుండు'' అని. ఇప్పుడు ఆ మాటలు ఆయన తలచుకున్నారు. 2005 జులై 30 న **శ్రీరామపురం**లో ఆయన పేరిట ఏర్పాటు చేసిన వార్షిక వేద సభ జరిపిన నాలుగు నెలలకు యాజులుగారు తుది శ్వాస విడిచారు. పదేళ్ల క్రితం భార్య సూర్య అంత్యక్రియలు జరిపిన చోటే యాజులు గారివీ జరిపారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -10


### 2వ ఆహితాగ్ని – బ్రహ్మశ్రీ దువ్వూరి యజ్ఞేశ్వర పౌండరీక సోమయాజులు గారు -3

**శ్రీ దువ్వూరి సోమయాజులు** గారి మూడవ కుమారుడు **శ్రీ వెంకట సూర్య ప్రకాశ అవధాని** 1953లో గోదావరికి వరదలు వచ్చినప్పుడు రాజమండ్రి వద్ద పాత రైల్వే బ్రిడ్జిని తాకుతూ 65 అడుగుల ఎత్తున నీరు వచ్చి తీర ప్రాంతాలను అతలాకుతలం చేసి, కపిలేశ్వర ప్రాంతం పూర్తిగా ధ్వంసమైంది. పంటలన్నీ పాడైపోయాయి. కానీ యాజులు గారి ''పంట పండింది'' వారింట మూడవ కుమారుడు **వెంకట సూర్య ప్రకాశ అవధాని** జన్మించటంతో. **సర్వేశ్వర** పుట్టిన దశాబ్దానికి ఈ పుత్రోదయం. ఎనిమిదవ ఏట ఉపనయన సంస్కారం పొంది తండ్రి వద్ద వేదం 8 ఏళ్ళు నేర్చి పూర్తి చేశాడు. ఉదయం 5కే లేచి, స్నాన సంధ్యలు చేసి, తండ్రిగారి అగ్నిహోత్రం పూర్తయ్యాక వేదాభ్యాసం ప్రారంభించి మధ్యాహ్నం 12 వరకు కొనసాగేది. 20వ ఏట వేదం, శ్రౌతాలలో గోదావరి మండల పరిషత్ వద్ద **వ్యాఘ్రేశ్వరం**లో 1973లో పరీక్షనిచ్చి అవధాని అయ్యాడు. **కనకదుర్గ** అనే **గుళ్ళపల్లి** వారి అమ్మాయిని **ఇరగవరం**లో 1970లో పెళ్ళాడాడు. అప్పుడామెకు 12, అతడికి 17. 16వ ఏడుదాకా బడిచదువు లేదు. అక్షరం ముక్క అబ్బకపోతే లాభం లేదని **శ్రీరామపురం** నుంచి **ముక్కామల**కు నడిచి వెళ్లి చదివాడు. తండ్రి అడుగు జాడలలో అప్పటిదాకా ఉన్నా, తర్వాత తెలుగు లేక సంస్కృత పండితుడి ఉద్యోగంలో చేరాలనిపించి, **ముద్దెకూరు**లోని కాలేజిలో చేరి 1976 లో కోర్సు పూర్తి చేశాడు. ట్రైయిన్ లో ప్రయాణం చేస్తూ వరంగల్ లో అయిదు నెలల కోర్సు చేశాడు. అప్పటికే పండితుల సంఖ్య ఎక్కువైందున ఉద్యోగం రావటం కష్టమైంది. **శ్రీరామపురం**లోనే **రావి చయనులు** గారి దగ్గర కావ్యాలు నేర్చాడు. వీటికి అయిన ఖర్చులకు అప్పు చేసీ, సభలో వచ్చే పారితోషికాలతో తీర్చాడు. **వ్యాఘ్రేశ్వరం, రాజమండ్రి, గుంటూరు, విజయవాడ** వేదసభలకు వెళ్లి తన ప్రావీణ్య ప్రదర్శనతో నగదు పారితోషికాలు పొందాడు. 1982లో **శ్రీరామపురం** వదిలి **రాజమండ్రి**లో **శ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ శాస్త్రి** గారి వద్ద అయిదేళ్ళు **మీమాంస శాస్త్రం** అధ్యయనం చేశాడు. సుదూర ప్రాంతాలైన **హైదరాబాద్, సిరిసిల్ల** లకు సంభావన కోసం వెళ్ళేవాడు. ఊళ్ళో ఏదో ఒక కర్మకాండ

చేయిస్తూ ధనం పొందేవాడు. సంస్కార విధానాలన్నీ తండ్రి యాజులు గారి వద్దనే నేర్చాడు. ఒకసారి హైదరాబాద్ కు ఒక బ్రాహ్మణ కుటుంబంలో పెళ్లి చేయించటానికి వెడితే, అక్కడ ఏ అగ్నిహోత్రి భార్యా అన్నం వండి పెట్టకపోయేసరికి అవాక్కై అల్పాహారంతో గడిపాడు. ఇప్పటిదాకా తండ్రిగారి నిత్య ఇష్టి, ఇతర ఆహితాగ్నిలకు అధ్వర్యుగా ఉన్నాడు. నిత్యం **ముక్కామల దేవాలయం**లో **రాజమండ్రి సత్యనారాయణ స్వామి దేవాలయం** లో **టి.టి.డి తరపున నియమింపబడి వేదపారాయణ చేసేవాడు**. నలుగురు పుత్రులకు తల్లిదండ్రులైన  అవధాని, భార్య 1988 జనవరిలో పెద్ద కొడుకు వేదాన్ని తాతగారు **యాజులు** గారి వద్దనేర్చిన **ఫణియజ్ఞేశ్వర యాజుల** పెళ్లి చేశారు. ఆడపిల్లలు లేనందువల్ల కట్నాల బాధ లేదు. **గుళ్ళపల్లి** వారమ్మాయి **లక్ష్మి ఫణి** భార్య. పిల్లలు అక్కరకు వచ్చారు. కనుక మళ్ళీ **శ్రీరామపురం** చేరి తండ్రి గారి వద్ద వేదంతో కాలక్షేపం చేయాలని 1987లో నిశ్చయించాడు. టి.టి.డి ఉద్యోగం చేస్తూ, వేద పారాయణ కొనసాగించాడు. అగ్ని ఆరాధన, ఇష్టి, అగ్నిష్టోమం చేశాడు. తండ్రి గారి పద్ధతినే అనుసరించాడు. తండ్రి తరానికి, తన తరానికి ఉన్న దూరం, తేడా గమనించాడు. నా చుట్టూ ఉన్న సమాజం గురించి కూడా నేను ఆలోచించాలి వారి కోసం పని చేయాలి. ఆదర్శ వైదిక జీవితం గడపాలి. నా అవసరాలను తగ్గించుకోవాలి అని తాను నిర్ణయించుకొన్నట్లు అవధాని చెప్పాడు.అనుకోకుండా అదృష్టం తలుపు తట్టింది. పదేళ్ళ తర్వాత అవధాని ఇంకా **రాజమండ్రి**లోనే ఉండగా **దువ్వూరి** కుటుంబానికి చెందిన ఒక సంపన్న దాత **శ్రీరామపురం**లో చుట్టూ గోడలు ఉన్న ఒక అందమైన ఇంటిని దానిలో ఒక పాఠశాల పెట్టటానికి **శృంగేరి పీఠానికి** అందజేశాడు. ఉద్దేశ్యం బాగానే ఉంది కాని అక్కడ పని చేయటానికి ఉపాధ్యాయుడేవరూ ముందుకు రాలేదు. అప్పుడు దాన్ని **సూర్య ప్రకాశావధాని**కే ఇచ్చిఅక్కడే ఉండిపోమ్మనీ తన కొడుకులకు, తమ్ముడి కొడుకులకు వేదం నేర్పుతూ ఉండమని కోరగా వచ్చి చేరాడు. **శ్రీ దువ్వూరి ఫణియజ్ఞేశ్వర యాజులు** అన్నిటా ప్రథమం. వైదిక - లౌకిక జీవితానికి సమన్వయము సాధించినవాడు **సూర్య ప్రకాశ అవధాని** పెద్ద కుమారుడు **ఫణి యజ్ఞేశ్వర యాజులు**. 1974లో జన్మించి **శ్రీరామపురం**లోనే తాతగారు **యాజులు** గారి వద్ద ఆయన ముసలి గుడ్డి తనపు రోజుల్లో వేదం నేర్చి, ఇంటర్ చదివి, **ఇంగ్లీష్ నేర్చి మాట్లాడగలిగిన మొట్టమొదటి వేదపండితుడుగా రికార్డ్ సాధించాడు**. బి.కాం. చదివి, మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఆర్ట్స్ సాధించి కర్నాటక స్టేట్ బాంక్ లో ఉద్యోగం పొందాలనుకున్నాడు. కాని మళ్ళీ వేదంలోకి వచ్చి, క్రమంలోను **శ్రీరామపురం**లో **సామవేదం వెంకట రమణ** గారి వద్ద నేర్చిన **ఘనం**లోను పరీక్ష ఇచ్చి, **విజయవాడ**లో **శ్రీ విష్ణుభొట్ల లక్ష్మీ నారాయణ ఘనపాఠి** గారి వద్ద రైల్లో వచ్చి వారానికి మూడు రోజులు ఘనం నేర్చి, 1999 లో ''**ఘన**" లో ఘనంగా సర్టిఫికేట్ సాధించాడు. 25వ ఏట మీమాంస పై మనసుపడి తండ్రితో సమానమైె **శ్రౌత విద్య**లో మరీ ముందుకు వెళ్ళాడు. 14 ఏళ్ళ వయసులో 10 ఏళ్ళ మేనమామ

**గొల్లపల్లి వెంకట రామ సూర్యనారాయణ** గారి కూతురు **లక్ష్మి**ని పెళ్ళాడి ఇద్దరు మగపిల్లలు **సూర్య ప్రకాశ పవన కుమార శర్మ, శ్యామ సుందర శ్రీరామ శర్మ**లకు జన్మనిచ్చి, కుటుంబ నియంత్రణ పాటించాడు. పెద్దాడు 8వ ఏటనే **తైత్తిరీయం** తండ్రి వద్ద మొదలుపెట్టి నేర్చాడు. తండ్రిలాగే ఇంగ్లిష్లో ఆసక్తి కలిగి ఇంగ్లిష్ మీడియంలో చేరి చదువుతూ కూడా రోజుకు కనీసం "అయిదు గంటలు" "వేదాధ్యయనం" చేసేవాడు. ప్రాథమిక విద్య ఆంగ్ల మాధ్యమంలో చదివిన ఏకైక వేద పండితుడు అనిపించాడు. చాలా దేవాలయాల నుంచి వేద పారాయణకు ఫణి ఆహ్వానాలు పొందాడు. **అమెరికాలోని న్యుజెర్సీ దేవాలయంలో ఋత్విక్** గా ఆహ్వానమూ వచ్చింది. తాత గారు ఇలాంటి వాటికి ఆశపడవద్దు అన్నారు. కనుక ఇప్పుడేకాదు మరెప్పుడూ అమెరికావంటి ఇతర దేశాలకు వెళ్ళను అని ఖచ్చితంగా చెప్పాడు. 2000 ఫిబ్రవరిలో రాజమండ్రిలో అయిదుగదుల ఫ్లాట్ కట్టుకొని గృహ ప్రవేశం చేశాడు. 2009లో **తిరుపతి వేంకటేశ్వర యూనివర్సిటి** లో **అధ్యాపక ఉద్యోగం** అందుకొని శృంగేరి పీఠం బడి వదిలేసి, **కృష్ణ యజుర్వేదంలో అసిస్టెంట్ ప్రొఫెసర్** ఆ తర్వాత **ప్రొఫెసర్** అయ్యాడు. **ఆ ప్రాంతంలో వేద పండితుడు యూనివర్సిటి ప్రొఫెసర్ అయిన మొట్టమొదటి వ్యక్తి ఫణి.** కంచి పీఠం ఫణిని ఆహ్వానించి, సన్మానించి **వేద భాష్య రత్న** బిరుదుతో సత్కరించింది. నా జీవితం లో ఇదొక గొప్ప మలుపు. తాతగారు **యాజులు** గారు దీనినే కొనసాగించు అన్నారు. అంతే ఇక వేదం—లౌకికంల మధ్య ఊగిసలాడలేదు నేను అన్నాడు ఫణి. 1998లో 16 ఏళ్ళ తర్వాత వేద ప్రవీణులైన **దువ్వూరి** కుటుంబం కొత్త అర్హత, విలువ సాధించింది ఫణి వలన. కాని **దువ్వూరి** ''శ్రౌతం'' బలహీనమైన దారానికి వ్రేలాడుతూ ఉండిపోయింది. 2014లో డయాబెటిస్ వలన **సూర్య ప్రకాశ, కనకదుర్గ**లు బాధపడి 2007లో చేద్దామనుకొన్న **ఆధాన, అగ్నిష్టోమాల**తో చేయాలనుకున్న **వైశ్వదేవం** చేయలేకపోయారు. వారసత్వాన్ని కాపాడాలనుకున్న **శ్రీ దువ్వూరి సీతారామ శాస్త్రి** అన్న **ఫణి**లాగానే తమ్ముడు **సీతారామ శాస్త్రి** అధ్వర్యుగా తాత **యాజులు**గారి వద్ద ప్రారంభించాడు. **తైత్తిరీయం** ముందుకు సాగలేదు. మాతామహుడు **గొల్లపల్లి** వారి వద్ద కూడా ఇలాగే జరిగింది. బలవంతంగా భట్టీయం వేస్తే గొంతు నెప్పి వచ్చేది. తాను వేద వారసత్వాన్ని కాపాడుదామనుకొన్నా పరిస్థితులు సహకరించనందుకు బాధపడ్డాడు. టెక్నికల్ కోర్సు చేసి, అమెరికా వెళ్లి పుష్కలంగా డాలర్లు సంపాదించి అన్న ఫణి, ఫణి కొడుకులు వేద, శ్రోతాల వారసత్వాన్ని నిలబెట్టటానికి సాయపడుదామని అతని కోరిక. తనకు వేదవిద్య అబ్బదని గ్రహించి, తన మన్సులోని ఆశయం సాధించటానికి అప్పటి 65వేల ప్రవాస భారతీయులతో పాటు అమెరికాకు కనెక్టికట్ లోని హాఫర్డ్ కు విమానంలో వెళ్ళాడు. ఆంధ్రప్రదేశ్ నే అంతవరకూ దాటని వాడు దేశాలు ఖండాలు దాటాడు. సత్యం కంప్యూటర్స్ కు చెందిన ''సిగ్నా ఇన్సూరెన్స్ కంపెనీ'' లో చేరి, తర్వాత భార్య **గౌరి శ్యామల**, కొడుకు **కార్తికేయ**, కూతురు **ప్రణతి**లను కూడా అమెరికా తెచ్చుకున్నాడు. ఇతని కజిన్ **యజ్ఞేశ్వర యాజులు** అంటే

**యాజులుగారి పెద్దబ్బాయి సర్వేశ్వర కొడుకు** అంటే మనవడు కూడా విస్కాన్సిన్ లోని మిల్వాకీకి వచ్చాడు. యాజులుగారి మూడవ మనవడు హైదరాబాద్ లో వాల్యు లాబ్ ఉద్యోగి **గిరిజా శంకర్** కూడా అమెరికాకు యెగిరిపోయె ప్రయత్నంలో ఉన్నాడు. అమెరికాలోని హిందూ దేవాలయాల పూజారుల కోసం, హైటెక్ కార్పోరేషన్ల అవసరాలు అప్పుడు వరాలయ్యాయి. అందరి దృష్టి భారతదేశంపైనే ఉంది అప్పుడు. ఒకప్పుడు సీమాంతర ప్రయాణానికి ఒప్పుకోని సనాతనులు ఇప్పుడు మనవళ్ళను పంపటానికి ముందుకొచ్చారు. **సూర్య ప్రకాశ అవధాని** నలుగురు కుమారులు అంటే **యాజులు**గారి మనవళ్ళు **గొల్లపల్లి కుటుంబం** వారి పిల్లలనే పెళ్లి చేసుకున్నారు. సత్సంతానమూ పొందారు. అందులో ఒకరు ఘనపాఠీ మాత్రమే కాక విశ్వవిద్యాలయ ప్రొఫెసర్. మరొకరు అమెరికాలో అయిదేళ్ళ ఉద్యోగంలో చేరాడు. ఇంకొకరు కూడా వెళ్ళటానికి సిద్ధం. యాజులు గారు **శ్రీరామపురంలో పంచాయతన దేవాలయంలో అథర్వ వేదం** పారాయణ చేస్తుంటే దేవతలే దిగివచ్చి ఆసక్తిగా వినేట్లు ఉండేది. ఆ స్వరం ఆ సాధనా ముచ్చటగా పరమ పవిత్రంగా ఉండేదని పెద్దల ఉవాచ. ఒకసారి ఒక అమెరికన్ వచ్చి ఆయన ఇంటర్వ్యూ తీసుకుంటుండగా యాజులు గారు ఆతనితో ''మీరు అమెరికా వెళ్ళాక, అక్కడివాళ్ళతో నాకు అమెరికాలో ఉద్యోగం ఇప్పించని సిఫార్సు చేయండి'' అని చమత్కరించారట. దీనితో **దువ్వూరి** వారి చరిత్ర పూర్తి. మరో ఆహితాగ్ని గారి పరిచయం చూద్దాం.




## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -11

### 3వ ఆహితాగ్ని – బ్రహ్మశ్రీ బులుసు వ్యాఘ్రేశ్వర చయనులు గారు

**శ్రీరామపురం** అగ్రహారంలో మూడవ ఆహితాగ్ని **బ్రహ్మశ్రీ బులుసు వ్యాఘ్రేశ్వర చయనులు** గారు. 1915 లో జన్మించి 82 ఏళ్ళు జీవించి 1997లో మరణించారు. భార్య **సుబ్బలక్ష్మి సోమిదేవమ్మ.** ముప్పై ఏళ్ళు ఇక్కడే సోమిదేవమ్మగా ఉండి, చయనులు గారి మరణానంతరం రాజమండ్రి కూతురు వద్దకు చేరారు. చయనుల గారి మరణంతో ఇంట్లో అగ్నిహోత్రాలన్నీ తీసేశారు. అప్పటికే వైదికులైన **గౌతమస** గోత్రానికి చెందిన వారు

ఇద్దరు ఉన్నారు. ఒకరు **బులుసు వ్యాఘ్రేశ్వర సోమయాజులు** గారు పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు **వ్యాఘ్రేశ్వరం**లోనే ఉంటే, రెండవవారైన ఈ **బులుసు వ్యాఘ్రేశ్వర చయనులు** గారు **శ్రీరామపుర** అగ్రహార వాసి. **అగ్నిచయనం** చేసి "**చయనులు**" అయ్యారు. ఈయననే అందరూ **బులుసు చయనులు** గారు అని సంబోధిస్తారు. **శ్రీరామపురం**లో **రావి చయనులు** అనే స్మార్త బ్రాహ్మణుడు ఉన్నారు కాని ఆయన ఆహితాగ్నీ కాదు, అగ్నిచయనమూ చేయలేదు. బులుసు చయనులు గారి పూర్వీకులంతా గణపతి ఆరాధకులు. ఒకసారి ఆయన పూర్వీకుని ముసలితనంలో గణేశుడు ప్రత్యక్షమైనాడని అందరూ చెప్పుకొనే వారు. వీరిలో మూడు తరాల వారు వేదపండితులు అవుతారని తర్వాత తరం వారు కూడా ప్రముఖ వేద పండితులే అవుతారని వినాయకుడు అప్పుడు ఆయనకువరమిచ్చారట. మన చయనులుగారు చివరి మూడవ తరం వారు. ముగ్గురన్నదమ్ములలో ఈయనకే వేదం అబ్బింది. అదే వయసున్న **రెండుచింతల వెంకటాచలు** తండ్రి గారి వద్ద బ్రహ్మచారిగా వేదాభ్యాసానికి చయనులు గారు చేరారు. **రెండుచింతల వెంకటాచలు** తర్వాత **రెండు చింతల యాజులు** గా **శ్రౌత స్మార్తా**లలో ఎదురు లేని వాడిగా ప్రసిద్ధి చెందాడు. **30 క్రతువులు చేసి వేదంలోనూ, భారతదేశంలోనే సాటిలేనివాడనిపించారు. ఆయన వేదం గానం చేస్తుంటే మహామహా వేదపండితులు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టిచూసేవారట. అంతటి గొప్పవారు రెండు చింతల వారు**. ఎక్కువ కాలం **కాశీ**లోనే గడిపేవారు. అప్పుడప్పుడు **విజయవాడ**లోని స్వగృహానికి వచ్చి వెళ్ళేవారు. కోనసీమలో వేదం, శ్రౌతాల పరిస్థితి తెలుసుకొనేవారు. 1936లో భార్య **లక్ష్మీకాంత**తో కలిసి **మొదటి యజ్ఞం, అగ్నిష్టోమం** చేశారు. 1980లో కాశీలోనే చివరి యజ్ఞం చేశారు. 50 ఏళ్ళకు పైగా అగ్నిహోత్రాన్ని ఆరాధించి 1987లో వారణాసిలోనే మరణించారు రెండు చింతల యాజులు గారు. **బులుసు చయనులు** గారు, **రెండు చింతల చయనులు** గారు కలిసి 82 పన్నాలు పూర్తి చేసి వేదపండితులని పించుకున్నారు. ఇద్దరూ వివాహాలు చేసుకొని జీవిత సౌఖ్యం అనుభవించారు. కాని **వ్యాఘ్రేశ్వరుల** భార్య **రామ సూర్యకాంత** గారు 24వ ఏట టైఫాయిడ్ జ్వరంతో 1945లో చనిపోయారు. కర్మకాండ పదవ రోజున **మూసివాయనం** అంటే **చేటలు, గాజులు** రాజమండ్రి నుంచి వచ్చి వ్యాఘ్రేశ్వరంలో ఇప్పించారు. ఈ యువ దంపతుల కుమారుడు **రామమూర్తి** వయసు కేవలం 6. **రెండు చింతల యాజులు** గారు **బులుసు** వారిని తాను చేయబోయే **పౌండరీక యాగా**నికి **ఋత్విక్కు**గా నియమించాలనుకున్నారు కాని "**అపత్నీకుడు**" **ఋత్విక్కు కాకూడదు** అనే నియమం ఉండటం వలన ఆయనకు కన్యను ఇచ్చి అయిదు రోజుల వివాహం చేయాలి. తన మిత్రునికి ఈ విషయంలో సాయం చేయాలని **గంగలకుర్రు**లో తన 14 ఏళ్ళ కూతురు **సుబ్బలక్ష్మి** ని 30 ఏళ్ళ యువకుడు, భార్య లేనివాడు, వేదపండితుడైన **బులుసు** వారికిచ్చి పెళ్లి చేయటానికి ఆమె తండ్రి అంగీకరించాడు. 8 నెలల తర్వాత వీరి వివాహం జరిగింది. మళ్ళీ ఇప్పుడు బులుసువారు శ్రౌతకర్మలు

చేయటానికి పూర్తిగా అర్హులయ్యారు. **సుబ్బలక్ష్మి వ్యాఘ్రేశ్వరు**లకు ముగ్గురు ఆడపిల్లలు, తర్వాత ఒక కొడుకు, మళ్ళీ కూతురు కలిగారు. **చయనులు** గారి మొదటి భార్య సంతానం **రామమూర్తి వ్యాఘ్రేశ్వరం**లో అమ్మమ్మ గారింట్లో పెరిగాడు. తర్వాత **శ్రీరామపురం** తండ్రి వద్దకు వచ్చాడు. బులుసు, రెండు చింతల కుటుంబాలు పెళ్ళిళ్ళతో బంధువులూ అయ్యారు. **రెండు చింతల** వారి అబ్బాయి **సత్యనారాయణకు బులుసు** వారి మూడవ కుమార్తెతో వివాహం చేసి మూడవసారిగా మళ్ళీ బంధువులవ్వాలనుకొన్నారు. కట్నకానుకలు లేవు కాని అల్లుడికి బులుసు వారు విద్యా గురువులై వేదం నేర్పారు. అతనికి 15, ఆమెకు 10 వయసులో ఇద్దరికీ విజయవాడలో వివాహం చేశారు.



## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -12

### 3వ ఆహితాగ్ని – బ్రహ్మశ్రీ బులుసు వ్యాఘ్రేశ్వర చయనులు గారు -౨

అనేక మార్గాలలో సంపాదన చేశారు. **స్మార్తం** లోనేకాక **శ్రౌతం** లోనూ చేయి తిరిగినవారు. సాధారణంగా ఏదో ఒక దానిలోనే ప్రావీణ్యం ఉంటుంది. రెంటినీ సునాయాసంగా నిర్వహించి సవ్యసాచి అయ్యారు. **బాబళ్ళ శాస్త్రి** గారి కుటుంబానికి తరతరాలుగా బులుసు వారే గృహ పురోహితులు. ఇప్పుడూ అంతే. 15 ఏళ్ళకే స్మార్తంలో ప్రవేశించి మూడేళ్ళ తర్వాత పరీక్ష పాసై, విజృంభించారు. అపర కర్మలు చేయించేవారు కాదు. వేదపాఠశాలలో14 ఏళ్ళు వేదం బోధించారు. అందులో వేదపరీక్షాధికారిగానూ ఉన్నారు. **జీవితకాలంలో "60 శ్రౌత" కార్యక్రమాలు, 6 పౌండరీకాలు" చేయించినట్లు గుర్తు చేసుకున్నారు**. దీనికి "**ఉద్గాత**"గా ఉండేవారు. 1960 కాలం కోనసీమ అంతా బులుసువారి వేద ధ్వనులతో పులకించిపోయింది. 50వ ఏట 1965మాఘమాసంలో అగ్నిష్టోమాన్ని ఆధానాగ్నితో శ్రీరామపురం దేవాలయ ప్రాంగణంలో చేశారు. నాలుగేళ్ల తర్వాత 1969లో పుట్టిన ఊరు **వ్యాఘ్రేశ్వరంలో సర్వ ప్రస్త అగ్ని చయనం** చేసి **చయనులు** అయ్యారు. అదే ఏడాది ఆయన పొరుగునున్న **దువ్వూరి యాజులు** గారు **పౌండరీకం** చేసి **పౌండరీక చయనులు** అయ్యారు. దీనికి **బాబళ్ళ శాస్త్రి** గారు **చయనులు**గారికి తోడ్పడ్డారు. వితరణశీలురైన

**డొంకా** వారు వీరికి ఒక ఇల్లు ఎకరం పొలం ఇచ్చి **శ్రీరామపురా**నికి ఆహ్వానించారు. కానీ కూతురి పెళ్లి ఖర్చులకు కట్న కానుకలకు పిత్రార్జితమేకాక దీనినీ అమ్మేయాల్సి వచ్చింది. 61 ఏళ్ళ వయసులో టి.టి.డి వారి పారాయణ స్కీంలో చేరి పుట్టిన ఊరిలోని దేవాలయంలో చేసేవారు. 78వ ఏట రిటైరయి, పెన్షన్ పొందారు. ఆర్థిక భారం వలన వేద సభలకు వెళ్లి సంభావన పుచ్చుకోనేవారు. కేంద్ర ప్రభుత్వం అగ్నిష్టోమం చేసినవారికి గౌరవ వేతనం ఇచ్చేది. ఆ విషయం వీరికి ఇతర ఆహితాగ్నిలు చెప్పనే లేదు. అది దూరమైపోయింది. ఎన్నో సంస్థలు, వ్యక్తులు బులుసు వారిని ఆహ్వానించి సన్మానించాయి. హైదరాబాద్ లో భారత ప్రధాని **పి.వి. నరసింహారావు** గారి చేతులమీదుగా సన్మానం అందుకొని ఆశ్చర్యపోయారు. ఎవ్వరూ ఆయన సాధించిన విజయాలను చెప్పలేదు. ఈ గౌరవ పురస్కారాన్నీ ప్రచారం చేయలేదు. 80 ఏళ్ళ వయసులో క్రిక్కిరిసిన బస్సుల్లో పడి 20 గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇది మనకు స్వర్ణకమలం 'సినిమాలో వృద్ధ వేదపండితుడు పడిన బాధ గుర్తుకు తెస్తుంది. ఆనాడు ఇచ్చిన గౌరవ భృతి 35.13 డాలర్లు మాత్రమే. కానీ దీనికే పరమ సంతోషం పొందారు. నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ ఎన్టి రామారావు కూడా బులుసువారిని సత్కరించారు. బులుసు చయనులుగారు యవ్వనంలో బహు అందంగా ఉండేవారు. ఇతర దేశీయులను ఆప్యాయంగా ఆహ్వానించేవారాయన. 1996 ఫిబ్రవరి లో 81వ ఏట భార్య **సుబ్బలక్ష్మి** గారితో కలిసి చేసిన **అగ్రయణం**, ఏదో ఒక కారణంతో 1995 చలికాలంలో చేయలేకపోయిన అగ్నికార్యానికి ప్రాయశ్చిత్త విధీ చేశారు. వేదాంతి మాత్రం కాదు. **బాబళ్ళ, లంకా, దువ్వూరి మాత్రం వేదాంతులే**. మృత్యు దేవత ఆయనకు హెచ్చరిక ఇవ్వకుండానే మీదపడింది. కూతురు అల్లుడు ఇంటికి వస్తారని సైకిల్ మీద సరుకులు తెచ్చి ఇంట్లో దించుతుండగా అధిక శ్రమతో హార్ట్ ఎటాక్ వచ్చింది. అందరికీ తెలిసేలోపే ఆయనను మృత్యువు కబళించింది. ఆయన అంత్యక్రియలు అగ్రహారం వెలుపల **బ్రహ్మమేధం, పునర్దహన, లోష్ట చయనా**లతో పూర్తయ్యాయి. **చయనులు** గారి భార్య ''14 వ ఏట కాపురానికి వచ్చాను. మొదట్లో ఆయన అంటే భయంగా ఉండేది. ఇద్దరం కలిసి 32 ఏళ్ళు అగ్నిహోత్రం చేసి నన్ను సోమిదేవమ్మను చేశారు'' అని గుర్తుకు తెచ్చుకున్నారు. తర్వాత కూతురు దగ్గరకు రాజమండ్రి చేరి, దశావతార స్తోత్రం, విష్ణు, లలితా సహస్రనామ స్తోత్రం బిగ్గరగా చదువుకుంటూ గడిపారు. భర్త చనిపోయాక చాలాకాలం దాకా తనకు అక్షర జ్ఞానం లేదంటారు. ఆడవారి చదువును భర్త ప్రోత్సహించ లేదన్నారు. ఇతర సోమిదేవమ్మల కూతుళ్ళు తల్లులకు దగ్గరగా ఉంటే, సోమిదేవమ్మ సుబ్బలక్ష్మిగారి కూతుళ్ళు మాత్రం దూర దూరంగా కోనసీమ అంతా వ్యాపించి ఉన్నారు. బులుసు చయనులు గారి వంశం మగపిల్లలు లేకుండా ఆగిపోయింది. చయనులుగారి మొదటి భార్య కుమారుడు రామమూర్తి మాతామహుల ఇంటపెరిగి,

స్మార్తం నేర్చాడు. అతని కొడుకు కూడా స్మార్తం లో ఉద్దండుడు. వీరివలన బులుసు వంశం కొనసాగింది. బులుసు చయనులుగారు **శ్రీరామపురాగ్రహారం**లో చనిపోయిన ముగ్గురు ఆహితాగ్నులలో రెండవవారు.

---

## కోనసీమ అందాలకు వేద పవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -13

**బ్రహ్మశ్రీ సామవేదం సూర్యనారాయణ అవధాని** గారు, కుమారులు **శ్రీరామపురా**గ్రహారానికి చెందిన నాలుగవ వారు **బ్రహ్మశ్రీ సామవేదం సూర్యనారాయణ అవధాని** గారు **హరితస** గోత్రీకులు. తాతగారు **ముక్కామల**కు చెందిన **ఆహితాగ్ని**. తండ్రి తెలుగు పండితుడు. తండ్రీ కొడుకులు అగ్నహోత్రం కాని శ్రౌతం కాని చేయలేదు, వేదవిద్యకే ప్రాధాన్యమిచ్చారు. **వేదం చదవటం నేర్పటమే నా జీవితం అంటారు సామవేదం**. కుమారులు నలుగురిలో ఇద్దర్ని వేదంలో పెట్టారు. వేద పండిత కుటుంబ కన్యలనే వారికి వివాహం చేశారు. **అవిశ్రాంత వేదాధ్యయన, అధ్యాపనమే వారి శక్తి సామర్థ్యాలు**. 1932 డిసెంబర్ 30న జన్మించిన **శ్రీ సూర్యనారాయణ అవధాని** గారు నలుగురు అన్నదమ్ములలో చివరి వారు. పదవ ఏట ఉపనయనం జరిగి, పదేళ్ళు దీక్షగా వేదం నేర్చుకున్నారు. మొదట పెద్దన్నగారి వద్దే **ముక్కామల**లో, తర్వాత **బిళ్ళకూరు**లో **శ్రీ వ్యాఘ్రేశ్వర చయనుల** గారి దగ్గర నేర్చారు. అ తర్వాత **బులుసు చయనులు** గారి వద్ద **శ్రీరామపురం**లో అభ్యసించారు. కొంతకాలం **ఇందుపల్లి**లోని **శ్రీ రాణి హయగ్రీవం** గారి వద్ద చదివారు. విద్యాభ్యాస సమయంలో వారాలు చేస్తూ, మదుకరంతో జీవనం గడిపారు. 1955లో విజయవాడ లో **కర్మ**లో పరీక్షఇచ్చారు. **శ్రీ బాబళ్ళ శాస్త్రి** గారి కోడలి చిన్న చెల్లెలు **శ్రీమతి కమల** ను వివాహమాడారు. వీరిది **వేల్పేరు**లోని ప్రభల వారి కుటుంబం. ఈ కొత్త **క్రమపాఠి** గారికి 1955లో **శ్రీరామపురం**లో ఒక ఇంటిస్థలం, ఇంటి నిర్మాణానికి వెయ్యి రూపాయలు మంజూరయ్యాయి. దీనితో పాటు సాలుకు 15 బస్తాలు వడ్లు పండే ఎకరం పొలమూ వచ్చింది. **ముక్కామల**కు **శ్రీరామపురం** పది నిమిషాల నడక దూరంలోనే ఉన్నా అవధాని గారి తల్లి తనను వదిలి వెళ్ళవద్దని కోరింది. కాని **ముక్కామల**లో తమకున్న దానిలో తనకు దక్కేది అతి స్వల్పమేనని తెలిసి తనకంటూ ప్రత్యేకమైన గృహం ఎర్పరచుకోవాలనే నిశ్చయించారు. ఆనాటి గ్రామ వాతావరణాన్ని గుర్తు చేసుకొని మట్టి రోడ్డు మీద నడవాలంటే తాతలు దిగోచ్చేవారు. రాత్రి పూట అయితే మరీ భయంకరం. దారిలో దొంగల భయం కూడా. సెటిల్మెంట్ గ్యాంగ్ ల ఆవాసాలు దగ్గరే అంటారు. **శ్రీరామపురం**లోని ఎకరం పొలం కౌలుకిచ్చేవారు. ఫలసాయం బాగానే ముట్టేది. క్రమంగా షెడ్యూల్ కాస్ట్ వారి ప్రాబల్యం పెరిగి వారి ఆక్రమణకు గురైంది పోలం. వాళ్ళు మా పోలంలో గుడిసెలు వేసేశారు కొబ్బరికాయలు మాకు దక్కకుండా కోసేసేవారు. కోళ్ళ పెంపకం కూడా చేసి మా బోటివాళ్ళు అడుగుపెట్టటానికి కూడా వీలులేని దుర్భర పరిస్థితి కలిపించారు. ఈ బాధపడలేక ఆ ఎకరాన్ని అయినకాడికి

అతి తక్కువ ధరకే అమ్మేసి చేతులు దులుపుకొని, పీడా విరగడయిందని వేరొక చోట మళ్ళీ అర ఎకరం పొలం కొన్నాను అని బాపన ఎవసాయం కష్టాలు చెప్పారు సామవేదం. ఏడాదికి రెండు పంటలు పండే పొలం అది. దాన్నీ అమ్మేసి వేద పండితునిగానే జీవిక సాగించాలని నిర్ణయించుకొన్నారు. డబ్బు అడగటానికి నామోషి పడలేదు. వృత్తిలో నిలబడటానికి ఎందరెందరినో ధనసాయం చేయమని అడిగారు. కొంతకాలం బయటికి వెళ్లి వేదవిద్య ప్రదర్శించి డబ్బు సంపాదించటమా, లేక ఇంట్లోనే ఉంటూ తన పిల్లలకు వేదం నేర్పటమా అనే సందిగ్ధంలో పడిపోయారు. "డబ్బు సంపాదన లేకపోతె సంసారం ఈదటం కష్టం. యాచనకు బయటికి వెడితే ఇంట్లో వేదాధ్యయనం సాగదు. ఈ రెండిటికీ లంగరు కుదరదు" అని విచికిత్సకు లోనయ్యారు. చివరికి తానే ఒక నిర్ణయానికి వచ్చి, నలుగురు కొడుకులలో వేదం పై అభిరుచి ఉన్న ఇద్దరికీ తానే ఇంటి వద్ద నేర్పుతూ మిగిలిన ఇద్దరికీ శాస్త్రాలలో పాండిత్యం కలిగించే లౌకిక విద్య నేర్పించాలనుకొన్నారు. ఇంతలో నాలుగవ కుమారుడికి ఉపనయన వయస్సు వచ్చింది. పెద్దవాడికి 24, మధ్యలో ఇద్దరికీ 22, 21 వయసు. వీరిద్దరికీ 82 పన్నాలు వచ్చాయి. అగ్రహారం వదలి బయటికి ఆశీర్వచానాలకు వెళ్ళేవారు. లేకపోతె వేద సభలలో పాల్గొనేవారు. మహా శివరాత్రికి **పట్టిసీమ**లోని **శ్రీ వీరభద్ర స్వామి ఆలయం**లో జరిగే స్వస్తి వచనానికి వెళ్ళేవారు. **తిరుపతి**లో **వరుణ పూజ**లో పాల్గొనేవారు. అవసరమైతే శ్రౌత విధులకు ఆహ్వానిస్తే వెళ్ళేవారు. నా సంసారం గడవటానికి డబ్బుకావాలి. అందుకే వెళ్లి డబ్బు పొంది వచ్చేస్తాను. దీనికి పశ్చాత్తాపం పడాల్సింది ఏమీలేదు. క్షమాపణ అవసరం లేదు అన్నారు. తన వేదస్వరానికి లెక్కకట్టి ఇచ్చే ధనం కోసం చివరిదాకా ఎక్కడికైనా ఏ సమయంలోనైనా వెళ్ళేవారు. ఎక్కడ ఏ సభ ఎప్పుడు జరుగుతుంది, ఎవరి ఆధ్వర్యంలో జరుగుతుంది, యెంత సంభావన గిడుతుంది అన్న లెక్కలన్నీ ఆయన వద్ద సిద్ధంగా ఉంటాయి. దాదాపు ఆ సభలన్నీ ఉభయ గోదావరి జిల్లా లలోనే ఉండేవి. ఒక్కోసారి గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాలలో అరుదుగా జరిగేవి. వాటికీ వెళ్ళేవారు. ఒకసారి మద్రాస్లో అత్యంత సంపన్న బ్రాహ్మణుడి నుంచి కూడా ఘన సంభావన పుచ్చుకున్నానని తెలిపారు. జీవితంలో చాలా ఒడిదుడుకులు చూశారు. ముసలితనంలో జరిగిన సంఘటనలు జ్ఞాపకం చేసుకొన్నారు. 1994లో **తిరుపతి**లో జరిగిన **వైష్ణవ యాగానికి 150 మంది వేదపండితులు ఉదయం 7 గం.ల నుండి మధ్యాహ్నం వరకు 12 రోజులు వరుసగా పారాయణకు పిలిచారు. 1000 అగ్నిహోత్రాలు లక్ష్మీ నారాయణులకు ఏర్పాటు చేశారు**. ఇద్దరు కుమారులతో అవధానిగారు వెళ్ళారు. మళ్ళీ వీరి ముగ్గురినీ 60 మంది వేదపండితులతోపాటు 7 రోజులు వేదపారాయణకు 1955 ఆగస్ట్లో **కంచి**లో స్వామి 60వ జన్మ దినోత్సవంకు ఆహ్వానించారు. ముగ్గురికీ తలా వెయ్యిన్నూట పదహార్లు, ఒక బంగారు నాణెం, 14 తులాల వెండి పళ్ళెం నూతవస్త్రాలు, భార్యలకు కొత్త చీరలు కానుకగా అందించారు. మూడు నెలల తర్వాత

పుట్టపర్తికి శ్రీ సత్యసాయి బాబా 70వ జన్మ దినోత్సవానికి ఆహ్వానింపబడిన 70 మంది వేదపండడితులతో పాటు ఈ ముగ్గురూ వెళ్ళారు. ఒక్కొక్కరికి 5 వేల రూపాయలు, బాబా సృష్టించి ఇచ్చిన చేతి గడియారం, నూతన వస్త్రాలు, భార్యలకు సిల్క్ చీరలు, ఒక్కోక్కరికి రెండు బంగారు గాజులు, ప్రెజర్ కుక్కర్, వారం రోజులు ఉచిత భోజన వసతి కల్పిస్తూ ప్రయాణం ఖర్చులకుగాను ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు ఇచ్చి ఘనంగా సన్మానించారు.



## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -14

ఇప్పటి వరకు మనం కోనసీమలోని **రామేశ్వర** అగ్రహార ఆహితాగ్నులు వేద పండితుల గురించి తెలుసుకొన్నాం. ఇక నుంచి **నేదునూరు** దగ్గరున్న **కామేశ్వరి** అగ్రహారంలోని వారి గురించి తెలియజేస్తాను.


**1.శ్రీ లంకా వెంకటరామ శాస్త్రి** గారు.

రెండు చెవులకు బంగారు రింగులు, కనులలో వేద ప్రకాశం, కుడి చేతి నాలుగు వేళ్ళకూ బంగారు ఉంగరాలు, ముంజేతికి బంగారు మురుగు, మెడలోశుద్ధ స్పటికమాల, కాంతులీనే యజ్ఞోపవీతం, బోసినవ్వులతో 84 ఏళ్ళ వయసు లోనూ తగ్గని వేద స్వరంతో కనిపిస్తారు **శ్రీ లంకా వెంకటరామ శాస్త్రి** గారు. వేద పండితులుగా ఆంధ్రదేశంలో సుప్రసిద్ధులు. **శ్రౌతంలో ఘటికులు. శ్రీ రెండు చింతల యాజులు, శ్రీ కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్రి** గారల మరణం తర్వాత **శాస్త్రి** గారు బాగా ప్రాచుర్యంలోకి వచ్చారు. కొంచెం ఆలస్యంగానే **అగ్నిహోత్రం** ప్రారంభించి, **అగ్నిష్టోమం** వాయిదా వేసి, **యజ్ఞం** చేసిన తర్వాత

**శ్రౌతా**నికి స్వస్తి పలికి, మరణానికి 13 ఏళ్ళ ముందు వరకు **నిత్యాగ్నిహోత్రి**గా ఉన్నారు. **వేద, శ్రౌతాలలో అద్వితీయులనిపించుకొని గౌరవం పొందారు. యజ్ఞయాగాది క్రతు నిర్వహణలో "లంక" వారిని ''అభినవ ఆపస్తంభుడు"** అంటారు. **తైత్తిరీయాన్ని** ఆపోసనపట్టి, **ఋగ్వేద పాండిత్యాన్ని** సాధించి **అధర్వవేదం**లో అవసరమైనంతవరకు పట్టు సాధించి, **సామవేదాన్నీ** చాలినంత మధించారు. **"వేదం, "శ్రౌత, "ధర్మ శాస్త్ర పరీక్షాధికారి" గా ఉన్నారు. జ్యోతిషం**పై సలహాదారు కూడా. ఋత్విక్కు నిర్వహించాల్సినవన్నీ ఆయనకు కరతలామలకం. ''సంస్కృత ఆంధ్రా'' లలో గ్రంథాలు వ్రాసారు, తాము స్వయంగా చేసుకొన్నా **ఆధాన, అగ్నిష్టోమ**లకు యజమానిగా ఉన్నా, **బ్రాహ్మణాల**పై అపార విజ్ఞానఖని అయినందున, జరిగే మంత్ర తంత్రాలపై చక్కని పర్యవేక్షణ చేసేవారు. ఆయన **అగ్నిష్టోమం** చేశాక, భారతదేశంలోనే బాగా అనుభవమున్న అధ్వర్యులలో ఒకరుగా గుర్తింపు పొందారు. సునిశిత మేధ లంక వారి సొత్తు. నిష్పాక్షికతకు నిలువెత్తు దృష్టాంతం. వేదసభలలో సమదృష్టితో, బహు మెత్తగా, మాట్లాడాల్సిన విషయంపై పూర్తి దృష్టితో జనరంజకంగా ప్రసంగించే నేర్పు శాస్త్రి గారిది. ''తిరుపతి దేవస్థానం'' వేతనంతో ఉద్యోగం అందజేస్తామంటే **బాబళ్ళ శాస్త్రి** గారు అది **ఆహితాగ్నికి** కాదు అని తిరస్కరిస్తే, **వెంకరామ శాస్త్రి** గారు వారిని అసలు పట్టించుకోనేలేదు. 1995 నవంబర్ 5న బంగాళాఖాతంలో పెను తుఫాన్ ఏర్పడి కోస్తా జిల్లాల జన జీవితాలను అస్తవ్యస్తం చేసినప్పుడు, ఇళ్ళకప్పులు ఎగిరిపోయి, కొబ్బరి తోటలు నేలకూలి, పంటలు దెబ్బతిని వేలాది పశువులు అసువులుబాసి దారుణ నష్టాన్ని కలిగించింది. లంకా వారి పెంకుటిల్లు, గొడ్లపాక, ఆవులు, పంట, కొబ్బరి చెట్లు తీవ్రంగా నష్టపోయాయి. దాన్ని గురించి ఆయన ''దావోయిస్ట్'' వేదాంతి లాగా ''తుఫాన్లు వస్తాయి, పోతాయి'' అన్నారు. ఈ స్థితప్రజ్ఞత వల్లనే ఆయన ఆరాధనీయులయ్యారు. లంకావారి సంప్రదాయ వేద విద్యాభ్యాసం, **బాబళ్ళ శాస్త్రి** గారి అభ్యాసంలాగానే సాగింది. శాస్త్రిగారు **నేదునూరు** గ్రామంలో జన్మించి, **ముక్కామల**లో **బాబళ్ళ శాస్త్రి** గారి తండ్రిగారి శిష్యులైనారు. చాలా క్రమశిక్షణతో నియమ నిబంధనలతో సాగిన విద్య అది. తెల్లవారు ఝామున 3గంటలకే లేచి రెండుమైళ్ళు చీకటి మట్టి రోడ్డుపై నడిచి **భమిడిపాటి** వారింటికి చేరేవారు, ఉదయం అంతా అధ్యయనం జరిగేది. తర్వాత గురుపత్ని **శ్రీమతి కామేశ్వరి** గారు మధ్యాహ్న భోజనం పెట్టేవారు. ఆ తర్వాత ఉదయం జరిగిన అధ్యయనానికి సుదీర్ఘ సమీక్ష జరిగేది. సాయం సంధ్యావందనం చేసి, మళ్ళీ చీకటిలో నడిచి స్వగ్రామం చేరుకోనేవారు. తల్లిగారు వండి వడ్డించిన భోజనం చేసి, రాత్రి 8 గంటలకు నిద్రపోయేవారు.''మా తండ్రి గారు రోజూ రాత్రి నిద్రపోయే ముందు రెండు శ్లోకాలు నేర్పేవారు'' అని ఆయన జ్ఞాపకం చేసుకొన్నారు. ఈ దినచర్య, బ్రహ్మచర్య జీవితకాలం అంతా కొనసాగింది అని చెబుతూ ముసలితనంలో ''ఇటీవలి కాలంలో ఎక్కువగా నిద్రావసరం లేకపోతోంది. అందుకని 2 గంటలకే నిద్ర

లేచి 3 గంటల వరకు పక్కమీదనే మెలకువగా భగవధ్యానంతో ఉంటాను. అందరు హాయిగా నిద్రపోతుంటారు. అరుణోదయ వేళకు మంచం నుంచి లేస్తాను" అని చెప్పారు. **శాస్త్రిగారి బ్రాహ్మ విద్యాధ్యయనం** 6 సంవత్సరాలు **భమిడిపాటి** గురువరేణ్యుల వద్ద సాగింది. రెండవ గురువు తమ అల్లుడి తండ్రిగారివద్ద **ముక్కమల**లో మూడేళ్ళు **ఘనం** నేర్చారు. అరడజను మంది తోటి విద్యార్ధులతో వారాలు చేసి అక్కడ చదివారు. **లంకా** వారి వేదవిద్యతో పాటు, వివాహం కూడా **భమిడిపాటి** వారి ఆధీనంలోనే జరిగింది. **బాబళ్ళ శాస్త్రి** గారి సమీప బంధువు **శ్రీమతి అనసూయ** గారితో జరిగింది. అప్పుడు ఆయనకు 10, ఆమెకు 7 వయసు. లంకావారి ధర్మపత్నిగారి తండ్రి తాతముత్తాతలు అందరూ ఆహితాగ్నులే కనుక ఆమెకు పత్నీధర్మాలు సహజంగా అలవడ్డాయి. రజస్వలయ్యాక 14వ ఏట ఆమె **నేదునూరు**కు కాపురానికి వచ్చారు. పతివ్రతామతల్లి **అనసూయ** పేరు పెట్టినందుకు ఆ ధార్మాలన్నీ ఆమెలో ఉన్నాయి. 8 మంది మగపిల్లలకు జన్మనిచ్చారు. చివర ఆడపిల్ల అనసూయ. ఒకరు పసితనంలోనే చనిపోయాడు. చిన్ననాటి నుండి శాస్త్రిగారు తండ్రికి వ్యవసాయపనులకు తోడ్పడేవారు. వ్యవసాయ యాజమాన్యం సహజంగా అలవడి, మంచి యజమానులుగా పేరు పొందారు. నారు పోయటం, దుక్కి దున్నటం, నాట్లు వేయటం, కూలీలను మాట్లాడటం, కలుపు తీయటం, అదునుకు నీరు పెట్టటం, కోతలు, కట్టివేతలు, నూర్పిడి అన్నీ దగ్గరుండి తండ్రీ కొడుకులు చూసేవారు. పొలాల గట్లమీద కొబ్బరి చెట్ల నీడలో తండ్రి తనయులు శిష్యులకు అధ్యయనమూ కొనసాగించేవారు. గ్రామస్తులు ముహూర్తాలకోసం, ధర్మ సందేహాలు తీర్చుకోవటం కోసం అక్కడికే వచ్చేవారు. ఒక్కోసారి ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉండాల్సి వచ్చేది. **సామవేదం** వారు **"ఇంటి వద్ద వేదాధ్యయనం, పొలాలలో వల్లెవేయటం అంతా ధనార్జనా వ్యామోహమే"** అన్న విమర్శకు **శాస్త్రిగారు** ధీటుగా సమాధానం చెబుతూ **''కృషి వేదానికి అవరోధం. వేదం కృషికి అడ్డంకి"** అని అర్థం వచ్చే శ్లోకం చదివేవారు. వ్యవసాయం కావాలంటే వేదపండితుడు కాలేడు. కానీ నా విషయంలో నా చదువు, అధ్యయనం నేను వ్యవసాయ విధులను చేబట్టటానికి ముందే జరగటం నా అదృష్టం అన్నారు. శాస్త్రి గారి తండ్రి గారు 72 వ ఏట 1947 లో చనిపోయారు. అప్పుడు ఆయన వయసు 35. శాస్త్రిగారు తల్లి, అర్ధాంగి, కుటుంబం ఇతరులతో సహా రైలులో సుదీర్ఘ ప్రయాణం చేసి కాశీ వెళ్లి శ్రాద్ధకర్మ నెరవేర్చారు. ఉన్న ఆస్తి అన్నదమ్ములు పంచుకోగా, శాస్త్రిగారికి ఎకరం 20 బస్తాలు పండే పంటభూములు వచ్చాయి. అయినా పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సి వచ్చింది. నా జీవితం అప్పు లేకుండా గడవలేదు అన్నారు. **చిన్న అనసూయ** (చిన్న కూతురు) ను **కోరుమిల్లి** వాసి **భమిడిపాటి మిత్రనారాయణ** కిచ్చి వివాహం చేయటానికి చాలాకాలం క్రితం 400 రూపాయలు కట్నమిచ్చారు. ఇతడు ఆహితాగ్ని కుమారుడు. త్వరలో ఆహితాగ్ని అవుతున్నవాడుకూడా. ఆంధ్రదేశంలోనే కాదు, యావత్ భారతదేశంలోనే అత్యంత

చిన్నవయసులో ఆహితాగ్ని అయినవాడు. ఈమె వలన శాస్త్రి గారి కుటుంబం ఆహితాగ్ని కుటుంబంకు మళ్ళీ చేరువయింది.



## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -15

### శ్రీ లంకా వెంకటరామ శాస్త్రి గారు -2

**శ్రీ వెంకటరామ శాస్త్రి** శాస్త్రి గారి భార్య **అనసూయ** గారు మా అమ్మాయిని ఆదర్శంగా అగ్రహారంలో ఆహితాగ్ని భార్యగా పెంచాను. అది బాగా పని చేసింది. మావారు మా ఇద్దరబ్బాయిలకు వేదం నేర్పాలని ప్రయత్నించారు. అది ఫలించలేదు అన్నారామె. **బాబళ్ళ శాస్త్రి** గారు చాలా అంకిత భావంతో **సోమయాగం** చేశారు. ఆయన కుటుంబంలో, ఆయన తరంలోనే ఆరుగురు ఆహితాగ్నులు ఉండటం అరుదైన విశేషం. అయితే అనారోగ్యపు కొడుకు, పిల్లలు లేని మనవడు ఆయనను బాధించాయి. ఇది ఇలా ఉంటే లంకా వారి కుటుంబంలో వేదాధ్యయనం బాగానే కొనసాగి, ఎనిమిది మంది సంతానంలో ఏడుగురు పుత్రులు ఆయన మధ్య వయస్సులోనే లౌకిక వృత్తిలో రాణించారు. నేను కన్న అద్భుత కల నెరవేర్చుకున్నాను. నా నలుగురుకొడుకులు నాలుగు వేదాలలో దిట్టలు. ముగ్గురు శాస్త్రాల లోతులు తరచారు కాని దీని వల్ల లభించింది పూజ్యమే. అని నిర్వేదంగా అన్నారు **లంకా** వారు. మా పెద్దబ్బాయిలిద్దరికీ ముందు వేదం నేర్పాను. కాని వాళ్ళు గొణుగుతూ సణుగుతూనే ఉన్నారు. రూపాయలు రాలటం లేదని నెల జీతాలు లేవనీ. అప్పుడు వాళ్ళతో వేదం, వ్యవసాయం జమిలిగా చేసుకోండి అన్నాను. దీనికి తోడూ బంధువుల ఒత్తిడీ పెరిగింది. వేదం నేర్పి వాళ్ళను ఇంట్లో బందీలుగా ఎందుకు ఉంచుతున్నావని ప్రశ్నించారు. వాళ్ల మానాన వాళ్ళను స్వేచ్ఛగా వదిలెయ్యి, ఏది కావాలంటే అదే నేర్చుకొంటారు. వాళ్ళు బుద్ధిమంతులే కదా!! అంటూ సన్నాయి నొక్కులు నొక్కారు. దీనిపై నిర్ణయం తీసుకోవటం నాకు కష్టమైన విషయం. బాగా ఆలోచించి నిశ్చయానికి వచ్చాను. పెద్దాడిని సంప్రదాయ పద్ధతి ఉన్న బ్రాహ్మణ కుటుంబం వారింట్లో ఉండటానికి

కాకినాడకు పంపాను. మా అమ్మగారు వాడికి వంట చేసిపెట్టేది. వాడు అక్కడ హైస్కూల్ చదువు పూర్తీ చేసి, హైదరాబాద్ వెళ్లి డిగ్రీ అందుకొన్నాడు. కొడుకులకంటే మనవళ్ళు సంప్రదాయానికి ఇంకా దూరమయ్యారు. అయితే కొడుకులు, మనవళ్ళు ఇక్కడికే వచ్చి ఉపనయనాలు చేసుకొని సంధ్యావందనం నేర్చుకొన్నారు. సంప్రదాయం వదిలినా వారి వారి వృత్తులలో వాళ్ళు బాగా రాణించారు అదే మాకు సంతోషం సంతృప్తి. స్వయంగా ఎదిగి స్వంతకాళ్ళపై నిలిచి వాళ్ళు సుఖంగా జీవిస్తున్నారు" అని తమ కుటుంబ విషయాలన్నీ తెలిపారు. **శాస్త్రి**గారి చివరి అబ్బాయి **శ్రీ లంకా భద్రాద్రి శ్రీరాం** అదేనండీ **ఎల్.బి.శ్రీరాం** మంచి రచయిత,నాటకనటుడు, సినిమాలో ప్రముఖ హాస్యనటుడు. **శ్రీ నేదునూరి శ్రీరామమూర్తి** గారు ఉదార హృదయంతో కొత్త అగ్రహారంలో ఇంటినీ, అర ఎకరం పొలాన్నీ 1960 మార్చి 4న ఏర్పాటు చేశారు. అదే కామేశ్వరీ అగ్రహారం శ్రీరామమూర్తి గారి మాతృమూర్తి పేరిట ఏర్పాటు చేశారు. **నేదునూరు**కు చాలా దగ్గరలోనే ఉంది. ఈ ప్రశాంత నూతన అగ్రహారంలో వీరుకాక మరో నాలుగు బ్రాహ్మణ కుటుంబాలున్నాయి. కొబ్బరి, మామిడి తోటల మధ్య, పచ్చటి పంట పొలాల మధ్య ఈ అగ్రహారం ఉంటుంది. ''ఆ నలుగురు" వేద పండితులు కారు, కాని **బాబుళ్ళ శాస్త్రి** గారి ప్రియ శిష్యుడు **రమణ చిర్రావూరి** కుటుంబీకుడు. తర్వాత **శ్రీపాద** వారి కుటుంబం ఇక్కడికి చేరింది. వీరి కుమారుడు **మాణిక్యం** వేదం నేర్చాడు, కనుక **లంకా శాస్త్రి** గారికి ఈ అగ్రహారం చాలా అనువైనదిగా వేదాధ్యనానికి వీలుగా ఉందని సంతృప్తిపడ్డారు. పిత్రార్జితంతోపాటు తనకున్న 7 ఎకరాల పోలం వ్యవసాయం పర్యవేక్షిస్తూ వేదంనేర్పించారు. తాము రచించిన గ్రంథాలను, వేదం, శ్రౌతాలపై వ్రాసిన విషయాలను ముద్రించారు. వీలైనప్పుడు రాజమండ్రి వేద సభ లకు హాజరౌతూ, ఈస్ట్ కోస్ట్ రైలు ఎక్కి **కంచి**కి, **శృంగేరి**లకు వెళ్లి వేదార్థ ప్రవచనాలలో పాల్గొనేవారు. **లంకా** వారు **కామేశ్వరీ అగ్రహారం** చేరాక, **నేదునూరు**లో బ్రాహ్మణ కుటుంబాలు క్రమగా తగ్గిపోయి రెండు మూడు శాతానికి వచ్చింది. షెడ్యూల్డ్ కాస్ట్, బాక్ వర్డ్ క్లాస్, సెట్టిబలిజ, కంసాలి, దేవాంగ, కుమ్మరి, మంగలి, చాకలి కుటుంబాల సంఖ్య పెరిగి వారి మెజార్టీగణనీయంగా వృద్ధి చెందింది. వ్యవసాయ పనులకు వీరి ఆసరా తప్పదు. వీరందరికీ శాస్త్రిగారంటే తమ నేదునూరు వాసి అనే గొప్ప అభిమానమే నేదునూరులో ఏడాదికి రెండు సార్లు వేద సభలు జరుగుతాయి. ఒకటి లంకా శాస్త్రి గారి పేరు మీద, రెండవది గ్రామంలోని శివాలయంలోని శివుని పేరిట. ఆరోగ్యం మరీక్షీణించిపోయేదాకా శాస్త్రిగారు తాము నిర్వహించిన శ్రౌత కార్యాల గురించి ఎంతో ఆసక్తిగా చెప్పేవారు. తమ నిత్య కర్మకాండల గురించి మాత్రం తక్కువగానే మాట్లాడేవారు. నేదునూరు లో ఒక వడ్రంగిని కుదుర్చుకొని 1957లో నిర్వర్తించిన శ్రౌత కార్యాలకు కావలసిన పనిముట్లను స్వయం పర్యవేక్షణలో తనకు కావాల్సిన విధంగా తయారుచేయించుకొన్నారు. అక్కడ ఆధానం

మాత్రమేచేయాలనుకొన్నారు. **అగ్నిష్టోమం** చేస్తే "దుర్బ్రాహ్మణుడు'' అనే మచ్చ మాసిపోతుందనిఅందరికీ చెప్పేవారు. సతీమణి **అనసూయ** గారే ప్రోత్సహించి నిర్వహించేట్లు చేశారు. ఆమె కావాలనికోరింది. జరిగింది అని తాను నిమిత్తమాత్రుడిని అన్నట్లు చెప్పారు. అల్లుడు **మిత్రనారాయణ ''సోమయాగం లేని ఆధానం అర్థరహితం, అసంపూర్ణం''** అని మామగారికి నచ్చ చెప్పాడు. మూడేళ్ళ విరామం తర్వాత **శాస్త్రి** గారు మళ్ళీ వడ్రంగిని పట్టుకొని, **అగ్నిష్టోమా**నికి కావలసిన పరికరాలన్నీ దగ్గరుండి తయారు చేయించుకొని సర్వ సమర్ధమై 1960లో **అగ్నిష్టోమం "కామేశ్వరీ"** అగ్రహారంలో పోలాల మధ్య ఘనంగా నిర్వహించి అందరికి ఆనందం సంతృప్తి కలిగించారు. ఈ సమయంలో **శాస్త్రి** గారి అల్లుడు **మిత్రనారాయణ** ''**సర్వతో ముఖం''** చేయటానికి దూరం వెళ్ళాడు. ఒకసారి ఆ ప్రాంతంలో గంటకు 160 మైళ్ళ అంటే 257 కి.మీ. వేగంతో గాలులతో భీకర తుఫాను చుట్టుముట్టి శాస్త్రి గారి ఇల్లు కొడుకు ఇల్లు, చేతికి అంది వచ్చిన పంట అన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. ఆయన్ను ఓదార్చటానికి వచ్చిన వారితో ''**ఇలా జరగాల్సి ఉంది. జరిగిపోయింది. ఇబ్బందేమీ లేదు"** అన్నస్థితప్రజ్ఞులు శాస్త్రి గారు. ''ఆయనకు దేనితోనూ అంటీముట్టని అనుబంధమే'' అన్నారు **దువ్వూరు యాజులు** గారు. చివరి రోజుల్లో షుగర్ బాగా పెరిగి ఒక బొటన వ్రేలు తీసెయ్యాల్సి వచ్చి ఆపరేషన్ చేసి తీసేస్తే పలకరించటానికి వచ్చిన వారితో "బొటన వ్రేలు తీసేశారా? నిజంగానా? నాకే తెలీలేదు మీకెలా తెలిసింది?'' అని ప్రశ్నించారు. ఆంధ్రలో **శ్రీ కంచి పరమాచార్యుల వారు** మహా వైభవంగా చక్రవర్తి భోగంతో పార్టన చేసున్నారు. ఒకరోజు ఈ చిన్న కామేశ్వరీ ఆగ్రహారానికి కనీసం సంప్రదాయానికి బద్ధంగా పల్లకీలోనైనా కాకుండా సామాన్యునిలాగా కారులో లంకా శాస్త్రి గారింటికి వచ్చి పరామర్శించారు. ఈ విషయం అక్కడా, అన్ని చోట్ల ఎంతో గొప్ప విషయంగా ప్రచారమై పోయింది.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -16

### పద్మభూషణ్ శ్రీ లంకా వెంకటరామ శాస్త్రి గారు-3(చివరి భాగం)

**బాబళ్ళ శాస్త్రి** గారి లాగానే, **లంకా శాస్త్రి** గారు కూడా **వేద విక్రయాన్ని సమర్థించలేదు**. భర్త మరణానతరం **అనసూయ** గారిని తమ దంపతులు **అగ్నిష్టోమం** చేసిన తర్వాత ఇంకా ఏవైనా శ్రౌత కార్యక్రమాలు చేశారా అని అడిగితే ''మా స్వంతిల్లు, వనరులూ ఉన్నా, సరైన ఋత్విజులు లేరు. అన్నీ తెలిసి చేయించగలిగినవారు **నేదునూరు**, **శ్రీరామపురాగ్రహారా**లలో మా చిన్న తమ్ముడితో సహా కొద్ది మంది మాత్రమే ఉండేవారు. **దువ్వూరి యాజులు** మొదలైన పరిణతి చెందినవారు మావారి దగ్గరే నేర్చుకోవటానికి వచ్చేవారు. దేనికైనా డబ్బు కావాలి కదా. మాకు తగినంతగా డబ్బు ఉండేదికాదు. అంతా డబ్బు చుట్టూనే తిరుగుతోంది ప్రపంచం.

డబ్బు సంపాదించటం, కూడబెట్టటమే యావ అయిపోయింది అందరికీ. భారతదేశంలో డబ్బు సంస్కృతి పెరిగిపోయింది. మేము నిత్యం అగ్నిహోత్రం చేస్తూ దానితోనే సరిపుచ్చుకొంటూ సంతృప్తిగా గడిపాము'' అని చెప్పారు. **వేదపండితుడైన శాస్త్రిగారు శ్రౌతంలో ఘనులనిపించుకున్నా, వేదపర్యవేక్షకులుగా, వేద విజ్ఞానాన్నిఅందించేవారుగానే ఉన్నారు కాని ఇంకా క్రతువులు చేసి అదనపు బిరుదులు అందుకోవాలనే తాపత్రయం అత్యాశ లేని వారు. నాటక సినీ నటులకు వచ్చినన్ని అవార్డ్ లు రివార్డ్ లు అందుకున్న మహా వేదపండితులు వేదార్ధ సారమతులు శాస్త్రిగారు**. 1994 మే 7వ తేదీన వారికి భారత ప్రభుత్వం **పద్మభూషణ** పురస్కారం అందజేసి సత్కరించినదుకు ఆయన భుజాలు ఎగరేసి **ఇదంతా ఒట్టి ఆర్భాటం (ప్రాపగాండా) మాత్రమే అన్న నిగర్వి** శాస్త్రి గారు. **లంకా శాస్త్రి** గారిది ''తృప్తి చెందని జిజ్ఞాస ఉన్న వ్యక్తిత్వం. సోమాన్ని గూర్చి సవివరంగా తెలియ జేస్తూనే, మధ్యలో అకస్మాత్తుగా కర్మ, దేవుడు, పుణ్యం, పాపం, మనుషుల కర్మలో మానవత్వంలపై సుదీర్ఘంగా చర్చించేవారు. దళితులలో సద్గురువుల గురించి, క్రైస్తవం గురించి అడిగి తెలుసుకొనేవారు. ఒక్కోసారి ఎదుటివార్ని ఆశ్చర్యపరుస్తూ జార్జి రాజు, విక్టోరియామహారాణిలు ఎలా ఉన్నారు''? అని అడిగేవారు. అంటే వారి ఉద్దేశ్యంలో 20వ శతాబ్దంలో ప్రాముఖ్యమైన సంఘటనలు ఏవీ జరగలేదని. విక్టోరియా మహారాణి 1901లో, 6వ జార్జి చక్రవర్తి 1947 వరకు ఇండియాకు కూడా రాజే. 1952లో చనిపోయాడు. 1991లో శాస్త్రిగారి కాళ్ళకు నీరు పట్టి అగ్నిహోత్రంలో మంత్రాలు మాత్రమే చదివి సరిపుచ్చుకోనేవారు. లేచి నిలబడి క్రియ చేయగలిగే వారు కాదు. దీనిపై జోకులు వేస్తూ ''మేము ముగ్గురం ఆహితాగ్నులం. ''బాబళ్ళ వారికి చెవిలేదు అంటే చెవుడు. యాజులు గారికి కళ్ళు లేవు. అంటే చూడలేరు. నాకు కాళ్ళు లేవు''. కొడుకును వెంట తీసుకొని **విమానం ఎక్కి రాష్ట్రపతి పురస్కారం స్వీకరించటానికి ఢిల్లీ వెళ్ళిన "ఏకైక కోనసీమ ఆహితాగ్ని" పద్మభూషణ్ శ్రీ లంకా వెంకట రామ శాస్త్రి గారు.** తన 72వ ఏట తనకు మరణం సంభవిస్తుందని శాస్త్రి గారికి రెండు దృష్టాంతాలు కనిపించాయి. ఒకటి ఆయన జాతక చక్రంలో రాహు వీక్షణంతో మృత్యుచక్ర సూచన. రెండు తమ తండ్రి గారు కూడా 72వ ఏట రాహు ప్రభావంతో 1947లో మరణించటం. అయితే శాస్త్రి గారు తీవ్రంగా రాహు జపం చేసి మరణం నుంచి తప్పించుకొన్నారు. కాని ఆరోగ్యం ఇదివరకు లాగా బాగాలేదు. రెండేళ్ళ తరవాత 36 ఏళ్ళ సుదీర్ఘ అగ్నిహోత్రానికి స్వస్తి పలికారు. దీనిని జిర్నాదు అంటారని శాస్త్రి గారే చెప్పారు. వృద్ధాప్య కాలంలో ఇతర వేద పండితులలాగా శాస్త్రిగారికి కూడా అన్నం అరిగేదికాదు. తైత్తిరీయ ఉపనిషత్ లోని **''అహమన్నమహమన్నం"** మంత్రాన్ని జ్ఞప్తికి తెచ్చుకోనేవారు. అయినా తగినంత జీర్ణం ఉండేదికాదు. **ఆహితాగ్ని దంపతులు తగినంత శారీరక బలం లేనప్పుడు ఏమి చేయాలో ఇతర ఉపాయాలను ఆయన వెతికి ఆయా మంత్రాలను మననం చేసేవారు**. 1988లో మళ్ళీ మృత్యు చక్రం వేయించారు. దీని ప్రకారం

ఆయనకు 80 గారంటీ. అంటే అప్పటిదాకా మృత్యువు ఆయన సమీపానికి రాదనీ అర్థం. కాని ఈ చక్రం లోపభూయిష్టమై మృత్యువును మరొక్క 7 ఏళ్ళు వాయిదా వేసింది. శాస్త్రిగారి 80వ జన్మ దినోత్సవం నాడు సహస్ర చంద్రదర్శనం ఘనంగా జరుపుకొన్నారు. బొటన వ్రేలి సర్జరీతో బాధపడుతున్నా ముఖంలో చిరునవ్వు తగ్గలేదు, 83 ఏళ్ళ వయసులో కూడా కొత్త స్నాతక విద్యార్థికి ''వ్యాకరణం'' బోధిస్తూనే ఉన్నారు. మృత్యువు అనివార్యం. తప్పింపరానిది. కాని జీవితేచ్ఛ బలీయమైనది అన్నారు వేదాంత ధోరణిలో. **చయనులు గారిలాగా అకస్మాత్తుగా కింద పడి చనిపోలేదు. బాబళ్ళ శాస్త్రి, దువ్వూరి యాజులు గార్లలా అర్ధరాత్రి మరణించనూలేదు. బాధతో, జ్ఞాపకశక్తి లేమితో చివరి సంవత్సరాలు గడపాల్సి వచ్చింది**. ఆయన సెంటిమెంట్ 72 దాటి, మరో 15 ఏళ్ళు జీవించి చివరి రోజుల్లో జ్ఞాపక శక్తి కోల్పోయి, మృత్యువుతో పోరాడి, ఆహితాగ్ని, పద్మభూషణ్, **వేదపండితులు బ్రహ్మశ్రీ లంకా వెంకటరామ శాస్త్రి** గారు 87వ ఏట 20-6-1999 తెల్లవారు ఝామున 3 గం.లకు మృత్యుంజయ సన్నిధానం చేరారు. 1995లో తుఫానుకు కామేశ్వరి అగ్రహారం దెబ్బతినే నాటికి శాస్త్రి అనసూయ దంపతులకు 8 మంది సంతానం. వెంటనే ఎదురుగా ఉన్న ఇంటిని 4వ కుమారుడు వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు ఆక్రమించాడు. తుఫాను శాంతించాక అ ఇంటిని కాంక్రీట్ స్లాబ్ వేసి పునర్నిర్మించాడు. ఇందులోనే శాస్త్రిగారి భార్య అనసూయ గారు చివరి రోజులు గడిపారు. 72 ఏళ్ళ వైవాహిక జీవితం గడిపిన పాత ఇంట్లో మళ్ళీ 1999లో చేరారు. ఇందులో శాస్త్రిగారి మాసికాలు మాత్రమె పెట్టేవారు. సంవత్సరీకాలు జరిగాక మళ్ళీ ఆవాస యోగ్యం చేశారు. భర్త శాస్త్రి గారి గూర్చి చాలా మధుర జ్ఞాపకాలున్నట్లు ఆమె చెప్పారు. భర్త గారి లాగానే అనసూయ గారి అంత్య దశ కూడా కష్టాలలో గడిచింది. 2005 నాటికి నేలమీద దుప్పటిపై నిద్రించే ఆమె అతిథులెవరైనా వస్తే, పలకరిచటానికి లేవలేకపోయేవారు. గుర్తించగలిగే వారు కూడా కాదు. బయటి వారి సంగతి సరేసరి ఇంట్లో తనను అతి జాగ్రత్తగా సంరక్షిస్తున్న కొడుకును, కోడల్ని కూడా గుర్తు పట్టగలిగే వారు కాదు. అప్పటి ఆమె పరిస్థితి ''లేడీ మేక్ బెత్'' లాగా ఉండేది. ఎప్పుడూ ఏదో ఆలోచనలో, ఏదో గొణుగు కొంటూ, తికమకగా మాట్లాడుతూ, ఏదేదో ఊహించుకొంటూ, చేతి ఉంగరాన్ని తనకు తెలీకుండానే మరో చేతి అన్ని వేళ్ళకు మారుస్తూ గడిపారు. ఒక్కోసారి అకస్మాత్తుగా **''అగ్నిహోత్రా అగ్నిహోత్రా''** అని పలవరించేవారు. ఇంత నరక యాతన తెలిసీ తెలియని స్థితిలో అనుభవిస్తూ ఆహితాగ్ని **శ్రీ లంకా వెంకటరామ శాస్త్రి** సహ ధర్మచారిణి **శ్రీమతి అనసూయ** గారు 2005 డిసెంబర్ 31 మధ్యాహ్నం 2:30 గం.లకు 90వ ఏట తుది శ్వాస విడిచారు. ఆమె సహచరులలో అంతకాలం జీవించిన వారు లేరు. ఇవీ కామేశ్వర పురాగ్రహార ఆహితాగ్ని లంకావారి కుటుంబ విశేషాలు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -17

''సారీ ''తో ఆధారం వివరాలు —

''కోనసీమ ఆహితాగ్నులు'' గురించి 17 ఎపిసోడ్ లు వ్రాశాక ,ఇప్పటిదాకా సస్పెన్స్ లో ఉంచి , దీనికి ఆధారం విషయం ఇక భరించలేక ''అతి రహస్యం బట్ట బయలు చందం'' గా'' సారీ'' తో ఇప్పుడు బయట పెడుతున్నాను. హైదరాబాద్ లో ఉంటున్న మా రెండో అబ్బాయి శర్మ నా కోసం ఆర్నెల్ల క్రితం ఒకరోజు ''నాన్నా!గూగుల్ లో **''వేదిక్ వాయిసెస్"** అనే పుస్తకం గురించి చదివాను. అందులో కోనసీమ వేద విద్వాంసుల గురించి ఉన్నట్లు'' సినాప్సిస్ '' చెబుతోంది. వెంటనే గోపాలకృష్ణ గారికి మా వాడిచ్చిన వివరాలతో మెయిల్ రాశాను. ఆయన నా దగ్గర్నుంచి మెయిల్ వస్తే ,అసలు ఆగరు కదా !వెంటనే గూగుల్ లో వెతికి అమెజాన్ ద్వారా ఆర్డర్ చేసి నాకు పంపించే ఏర్పాటు నిమిషాలమీద చేసేశారు .''ఈ నాటి ఈ బంధ మేనాటిదో ''అని పించారు .పుస్తకం నాకు 12-2-18 బహు జాగ్రత్తగా అందింది .అదే 24 సెంటిమీటర్ల పొడవు ,15 సెంటి మీటర్ల వెడల్పు ,3 సెంటి మీటర్ల మందం ఉన్న సుమారు 3 వేల రూపాయల 260పేజీల అరుదైన బృహత్ గ్రంథం **''Vedic Voices ''.-Intimate Narratives of a living ''ANDHRA TRADITION ''** దీన్ని రాసినవారు అమెరికన్ రచయిత'' **DAAVID .M. KNIPE** .''డేవిడ్ ఏం, నైప్-ప్రొఫెసర్ ఎమిరిటస్ సౌత్ ఏషియన్ స్టడీస్ ఎట్ ది యూనివర్సిటి ఆఫ్ విస్కాన్సిన్-మాడిసన్ యు.ఎస్.ఏ. ఈయన మరో రచన **''హిందూఇజం —ఎక్స్పెరిమెంట్స్ ఇన్ ది సేక్రేడ్ ''** పుస్తకం చేతిలోకి వచ్చిన క్షణాన్నే మైనేనిగారికి కృతజ్ఞతలు, మా శర్మకు అభినందనలు తెలియజేసి,పుస్తకంలో దూరిపోయాను. ఒక సరికొత్త పాత లోకంలో అడుగు పెట్టిన గొప్ప అనుభూతి కలిగింది. ఆపు లేకుండా 10 రోజుల్లో చదివేశాను. చాలా ప్రణాళికా బద్ధంగా, అత్యంత నిర్దుష్టంగా కోనసీమ ఆహితాగ్నుల గురించి రచించినపుస్తకం ఇది. రచయితకున్న అవగాహన, చెప్పాలన్న తపన, వారందరి ఇళ్ళకు వెళ్లి వివరాలు సేకరించిన విధానం వారి అనుమతితో తీసిన ఫోటోలు, వారి కుటుంబ వంశాల నేపధ్యాల వివరణ, వారి తరువాత తరం వారి విశేషాలు అతని భాషలో Extended Famiies ''అన్నీ సవివరంగా అతి తేలిక ఇంగ్లీష్ పదజాలంతో హృదయానికి హత్తుకొనేట్లు వ్రాశాడు. ఇంతటి ఆంకిత భావానికి ఏమిచ్చి తెలుగు జాతి రచయిత ఋణం తీర్చుకోగలదు? వీరి గురించి మనవాళ్ళెవరూ ఇంత అధ్యయనం చేసి రాసిన దాఖలాలు లేవు అనిపించింది నా చిన్నబుర్రకు. **శ్రీ పాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు** తమ **''అనుభవాలు జ్ఞాపకాలు''** లో కొందరి వేద విద్వత్తు, వారి అమోఘ సామర్ధ్యాల గురించి కొంత అక్కడక్కడ తెలియ జేసి ఉండవచ్చు. వీరేశలింగం గారు వాళ్ల ఛాందసాన్ని హాస్య అపహాస్య వ్యంగ్యాలకెక్కడైనా పేర్లు లేకుండా ప్రస్తావించి

ఉండచ్చు .కాని ఇంత సమగ్రంగా ఏరచయితా రాసినట్లు లేదనే నేను అనుకొంటున్నాను .ఎవరైనా వారి కుటుంబసభ్యులు ఒకరిద్దరి గురించి రాసి ఉండవచ్చు .కాని ఇంతటి సమగ్ర రచన లేదనే నా విశ్వాసం. అన్నీ వేద వ్యవహార, కర్మ కాండల పదజాలమే. పడికట్టు పదాలే. వాటిని ఆంగ్లంలో అతి తేలికభాషలో వ్రాయటం ''అంత వీజీ కాదు''. ''అసాధ్యాన్ని సుసాధ్యం చేసిచూపాడు రచయిత'' 'నైఫ్'' నిజంగా కత్తి''నైఫ్'' అని పించాడు హాట్సాఫ్. 1980 అక్టోబర్ 3న అతడు కోనసీమ వేదపండితులతో అతని భాషలో ''ఎన్కౌంటర్ '' ప్రారంభించాడు. కొందరు వేదపండితులు అతన్ని సంశయించారు, కొందరు విషయాలు చెప్పటానికి సందేహించారు, అతన్ని వారు ''దొర ''అని దూరం పెట్టారు. ఈ రచయిత తన యువ కొలీగ్ ప్రొఫెసర్, ఆంద్ర విశ్వ విద్యాలయ ఫిలాసఫీ ఎమిరిటస్ చైర్ **శ్రీ ఏం. వి.కృష్ణయ్య** తో కలిసి ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా శ్రమించాడు. అగ్రహారాలు వాటి నేపధ్యం తెలుసుకొని, **రాజమండ్రి, అన్నవరం, సింహాచలం, విజయవాడ**లు తిరిగాడు. ''రామ, కృష్ణ'' వచ్చారని పించుకున్నారు ఇద్దరూ. 3700 ఏళ్ళ భారతీయ సంప్రదాయాన్ని అర్ధం చేసుకొన్నారు.క్లైమోడ్స్ ఘటించాడు. ప్రముఖ ఆంగ్ల కవి **టిఎస్ ఇలియట్** కవితాపంక్తి ''Ido not know much about gods,but I think that the river is a strong brown god '' రచయితకు ప్రేరరణ. డెల్టా, ఏర్పాటు, రాజవంశాలు, స్థానిక రాజులు, కాకతీయ సామ్రాజ్యం, ఇస్లాం మతం దక్కన్ లో కాలుపెట్టటం, విజయనగర సామ్రాజ్యం,యూరోపియన్ లరాక, డెల్టాలోఆదిపత్యం ,ఆంద్ర రాష్ట్రం ఏర్పాటు, అగ్రహారాలు, వేదపండితుల పరిభాష, నాలుగు ఆశ్రమాలు, ధర్మాలు, జీవన భ్రుతి అవకాశాలు, ఆహితగ్ని నిర్వచనం వారి పరిభాష, అగ్ని హోత్రంతో అనుబంధం, ఆహితాగ్నుల, వేదపండితుల''స్వర హేల''మొదలైన శీర్షికలతో రచయిత ఈ గ్రంథాన్ని''సుసంపన్నం''చేశాడు. ఇది చదివి మీకు ఆవిషయాలు అందించాలని మధనపడి, శీర్షిక కోసం కొన్ని రోజులు ఆలోచించి ఇప్పుడున్న శీర్షికతో 25-7-18 వ్రారాయటం ప్రారంభించాను. అయ్యా ఇదీ నేపధ్యం అని విన్నవిస్తున్నాను. రచయిత నైఫ్ కు, పుస్తకం కొనిపంపిన మైనేని గారికి, వ్యాసాలు చదివి ఆదరించిన మీకు ధన్యవాదాలు

మీ —గబ్బిట దుర్గా ప్రసాద్-7-10-18 —ఉయ్యూరు



## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు -18

ఇప్పటి వరకు **సీతారామపుర, కామేశ్వరీ అగ్రహారా**లోని ఆహితాగ్నుల గురించి తెలుసుకొన్నాం. ఇప్పుడు **వ్యాఘ్రేశ్వర అగ్రహారం** లోని వారి గురించి తెలుసుకొందాం.

### 1-బ్రహ్మశ్రీ బులుసు కామేశ్వర సోమయాజి గారు

**శ్రీరామపురం**లో **శ్రీ బులుసు చయనులు** గారి గూర్చి ముందే ముచ్చటించుకొన్నాం. ఇప్పుడు ఈ ఆగ్రహారానికి కూతవేటు దూరంలో అరటి కొబ్బరి తోటల ప్రకృతిలో ఉన్న **వ్యాఘ్రేశ్వర అగ్రహారం** లో ఉన్న **బ్రహ్మశ్రీ బులుసు కామేశ్వర సోమయాజి** గారి గురించి తెలుసుకొందాం. **అమలాపురం** లాక్ ఐన **ముక్కామల** మెయిన్ రోడ్డు దగ్గర చిన్న గ్రామం **వ్యాఘ్రేశ్వరం** ఉంది. ఇక్కడి శివుని పేరు **వ్యాఘ్రేశ్వరుడు** కనుక గ్రామానికి ఆ పేరోచ్చింది. మట్టి రోడ్డుమీదనే నడక, బండీ ప్రయాణం. **సీతారామపురం** నుంచి సైకిల్ మీద వస్తే పది ని.|| లు పడుతుంది. చాలా ప్రశాంతమైన పల్లెటూరు. మోటారు కార్ల రణగొణ ధ్వనులు వినిపించవు. చాలా కాలం క్రితం ఒక బ్రాహ్మణుడికి ఇక్కడ ఒక పులి చెట్టుకింద కనిపిస్తే, ప్రక్కనే ఉన్న బిల్వ వృక్షం ఎక్కి ప్రాణాలు కాపాడుకొన్నాడు మారేడు చెట్టుమీదే ''వ్యాఘ్రేశ్వర మహా పూజ'' చేశాడు. పూజ పూర్తయ్యేటప్పటికి కింద ఉన్న పులి "శివ లింగం''గా మారి ఆశ్చర్యం కలిగించింది. అప్పటి నుంచి ఈ ప్రదేశాన్ని **వ్యాఘ్రేశ్వరపురం** అన్నారు. తర్వాత **వ్యాఘ్రేశ్వరం** అయింది. ఇక్కడున్న బులుసు కుటుంబంలో ఇద్దరు అన్నదమ్ములున్నారు. పెద్దాయన పేరు గ్రామనామమే **వ్యాఘేశ్వరుడు**. రెండవ ఆయన పేరు **కామేశ్వర**. **పుల్లెల** వారి కుటుంబానికి దగ్గరే వీరిల్లు. **బులుసు సోదరులు, పుల్లెలవారు వ్యాఘ్రేశ్వరంలో ఆహితాగ్నులు**. బులుసు సోదరుల తండ్రిగారు **ముంగండ**లో స్కూల్ మాస్టర్. ఆయన ఆహితాగ్నికాడు ఆయన తండ్రీ, తండ్రి గారి సోదరులు మాత్రం ఆహితాగ్నులే. పెద్దాయన **అనంత** గారు **చయనం** చేయటానికి

వెడితే, సోదరులిద్దరు **శ్రౌతాన్ని** తాతగారు, మేనమామల వద్ద నేర్చారు. దీనికి తోడు వీరి ఆసక్తిని రెట్టింపు చేశారు **శ్రీ రెండు చింతల యాజులు** గారు అనే **వ్యాఘ్రేశ్వర** పూర్వ విద్యార్థి, మరొకరు కోనసీమలో పుట్టిన **శ్రీ కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్రుడు**. 1967 ఏప్రిల్ లో బులుసు సోదరులు ఇద్దరు అగ్నిహోత్రం ఏర్పాటు చేసుకొని రోజు విడిచి రోజు యజ్ఞాన్ని ఋత్విక్కుతో కలిసి ముందుగా **వ్యాఘ్రేశ్వర "ఆధానం"** చేస్తే, తర్వాత **కామేశ్వర** గారు **ఆధానం** చేశారు. వెంటనే **వ్యాఘ్రేశ్వరుడు** గారు **అగ్నిష్టోమం** చేసి **బులుసు వ్యాఘ్రేశ్వర సోమయాజి** అయితే **కామేశ్వర** కూడా **అగ్నిష్టోమం** చేసి **బులుసు కామేశ్వర సోమయాజి** అయ్యారు. ఇద్దరి భార్యలు సోమిదేవమ్మ అనిపించుకొన్నారు. పెద్దవారైన **వ్యాఘ్రేశ్వరు**లకు ఆహితాగ్ని అయిన తాత గారి ఆస్తి ఇల్లు సంక్రమించాయి. దీని ప్రక్కనే **కామేశ్వర** కూడా స్వగృహం ఏర్పాటు చేసుకొన్నారు. **కామేశ్వర** గారు అన్నగారిని మేనమామ చేసినట్లు **చయనం** చేసి **చయనులు** అనిపించుకోమని ప్రోత్సహించారు. ఆయన మాత్రం తనకు ఇష్టం లేదని చెప్పి తమ్ముడినే చేయమని ప్రోత్సహించాడు. సరే అన్నాడు తమ్ముడు. తమ్ముడు **కామేశ్వర** చేసే **అగ్నిచయనా**నికి కావలసిన ఏర్పాట్లన్నీ అన్న **వ్యాఘ్రేశ్వరుడు** గారే చేశారు. దురదృష్టవశాత్తు అకస్మాత్తుగా **వ్యాఘ్రేశ్వర సోమయాజి** గారు మరణించారు. విరక్తి పొందిన **కామేశ్వర** ఇక అదనపు క్రతువుల జోలికి పోకుండా **కామేశ్వర సత్యవతి దంపతులు** నిత్యాగ్నిహోత్రంతో సరిపెట్టుకున్నారు.

**కామేశ్వర సోమయాజి** గారు 1926లో జన్మించి 7వ ఏట ఉపనయంచేసుకొని, 6 మైళ్ళ దూరంలో ఉన్న **ఇందుపల్లిలో శ్రీ రాణి హయగ్రీవ అవధాని** గారి వద్ద, 13 ఏళ్ళు వేదం నేర్చారు. ఈ అవధాని గారే సామవేదం వారికి కూడా మూడవ వేదగురువు. **కామేశ్వర** గారు **అపస్తంభ సూత్రా**లను అన్నగారు **వ్యాఘ్రేశ్వరుని** వద్దనే అభ్యసించారు. వేద విద్య పూర్తి కాకమునుపే 20వ ఏట **సావిత్రి** గారిని పరిణయమాడారు. ఈ దంపతులకు 10మంది సంతానం. ఆరుగురు కుమారులు నలుగురు కుమార్తెలు. బులుసు సోదరులు తమ కుమారులకు వేదం నేర్పలేకపోయారు. కాని కుమార్తెను మాత్రం **కామేశ్వరి అగ్రహార** వేద పండితుడు **శ్రీపాద మాణిక్య అవధాని ఘనపాఠీ** కు ఇచ్చి వివాహం చేసి తృప్తి చెందారు. ఆసక్తి ఉంటే ఈయన ఆహితాగ్ని కాగలడు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 19

### 1-బ్రహ్మశ్రీ బులుసు కామేశ్వర సోమయాజి -2

సౌమ్యులైన **శ్రీ కామేశ్వర సోమయాజి** గారి దంపతులు సంభాషించేటప్పుడు కళ్ళల్లో కాంతులు పెదవులపై చిరునవ్వు దర్శనమిస్తాయి. అందరు ఆహితాగ్నుల భార్యల కంటే సోమయాజి గారి భార్య **సావిత్రి** గారు శ్రౌత ధర్మం పాటించే వారి జీవితాలలో ఉన్న సూక్ష్మ విషయాలు కూడాతెలియజేసేవారు. ఈ దంపతులు

అగ్నిహోత్రం చేసే పవిత్ర పరికారాలను చూపించేవారు. అగ్నిహోత్రం ఆరిపోతే ప్రాయశ్చిత్తం చేసుకొని మళ్ళీ వెలిగించేవారు. అగ్నిహోత్రంతో తమకున్న గాఢ అనుబంధాన్ని సవివరంగా తెలియ జేసేవారు. సోమయాజి గారికి ఉన్న విజ్ఞానం సావిత్రి గారికీ ఉండేది. **ఈ దంపతులు 35 ఏళ్ళు నిరాటంకంగా అగ్నిహోత్రారాధన చేసిన ధన్యజీవులు**. ఇంటర్వ్యూ చేసేవారొస్తే వారికి కాఫీ, టీ కొబ్బరి నీళ్ళు ఇచ్చి సంభాషించేవారు. **అన్నవరం**లోని **కపిలవాయి రామశాస్త్రి** గారి పత్ని **శ్రీమతి మారుతి** గారికి ఎలాంటి సంభాషణా చతురత, విషయ స్పష్టీకరణ ఉందో **సావిత్రి** గారికి కూడా ఉన్నది. మగవారితో చక్కగా మాట్లాడుతూ అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం అందించటంలో వీరిద్దరూ దిట్టలు. **కామేశ్వర సోమయాజి** గారు సుమారు **30 శ్రౌత** కార్యక్రమాలకు ఆహ్వానింపబడ్డారు. వీటిలో **వాజపేయం, పౌండరీకం, చయనాలు** కూడా ఉన్నాయి. కొన్నిటిలో **ఋత్విక్కు**గా, **అధ్వర్యు**నిగా కూడా ఉన్నారు. వీరి దగ్గర చదువుకున్న శిష్యులెవరూ **తైత్తిరీయాన్ని** పూర్తి చేయలేకపోయారు. **సోమయాజి గారు 30మందికి పైగా విద్యార్థులకు విజయవంతంగా స్మార్తం నేర్పారు**. 80ఏళ్ళు దాటినాకూడా, ఇంకా నేర్పుతూనే ఉండటం విశేషం. వీరంతా హైదరాబాద్ ఇతర ప్రాంతాలలో స్మార్త పండితులుగా పేరు తెచ్చుకొన్నారు. కామేశ్వర సోమయాజి గారి వేద విధానం ఆంధ్రదేశం అంతటా అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. అది ఆయనకు దక్కిన గొప్ప అదృష్టం. 2010 లో కామేశ్వర సోమయాజి గారు 84వ ఏట మరణించారు. **నేదునూరు** పరిధిలో **శ్రీరామపురం, వ్యాఘ్రేశ్వరం** అగ్రహారాలలో **కామేశ్వర సోమయాజి** గారే చిట్టచివరి ఆహితాగ్ని. **మిత్రనారాయణ** గారు ఈ పరిధికి వెలుపల ఉన్న ఆహితాగ్ని.

## 2-శ్రీ పుల్లెల లక్ష్మీనారాయణ సోమయాజులు గారు (1920-1999)

**వ్యాఘ్రేశ్వర** అగ్రహారంలో 1960లో స్థిరపడిన మూడవ **ఆహితాగ్ని శ్రీ పుల్లెల లక్ష్మీ నారాయణ** గారు. **కౌండిన్య గోత్రీకులు**. 1920లో వసిష్ఠ గోదావరి తీరంలో **గన్నవరం** కాలువ ప్రక్కనున్న **నరేంద్రపురం**లో జన్మించారు. 1970లో **అగ్నిష్టోమం** చేసి **పుల్లెల లక్ష్మీనారాయణ సోమయాజులు** అయ్యారు. అర్ధాంగి **కామేశ్వరి** గారు సోమిదేవమ్మ అయ్యారు. ఆహితాగ్ని తండ్రిగారికి ఈయన ఒక్కరే కుమారుడు. **తొండవరం**లోని మేనమామ **శ్రీపాద లక్ష్మీనరసింహ సోమయాజి** గారు **లక్ష్మీనారాయణ** గారు శ్రౌతం నేర్వటానికి గొప్ప ప్రేరకులయ్యారు. **గంగలకుర్రు**కు దక్షిణాన ఉన్న **తొండవరా**నికి చెందిన ఆహితాగ్ని గారి మనవరాలు శ్రీమతి **కామేశ్వరి** గారినిచ్చి **లక్ష్మీనారాయణ** గారికి వివాహం చేశారు. వివాహం 1936లో వైనతేయ గోదావరినది గుర్రపునాడలాగా వంపు తిరిగిన చోట ఆమెకు 10 ఆయనకు 16 వయసులో జరిగింది.ఈ దంపతులకు నలుగురుపుత్రులు, నలుగురు పుత్రికలు. కుమార్తెలెవ్వరికీ వేదపండితులతో

వివాహం కాలేదు. కుమారులెవరికీ కూడా వేదం అబ్బలేదు. మధ్య వయసు దాటిన ఈ దంపతుల కుమారులు ఆర్థిక బాధలనుభవించారు. తండ్రిగారి లాగే తామూ ఆహితాగ్ని కావాలనుకొన్న **లక్ష్మీనారాయణ** గారు అగ్నిహోత్రం ఏర్పాటు చేసుకోవటానికి ఒక ప్రత్యేక ఇంటికోసం ఎదురుచూశారు. **వ్యాఘ్రేశ్వరా**నికి దక్షిణాన ఉన్న చోట భార్య **కామేశ్వరి** గారి అక్కగారు వీరుండటానికి ఒక నివాసం ఏర్పాటు చేస్తే కుటుంబాన్ని 1962లో అక్కడికి మార్చారు. **ముక్కామల, నేదునూరు, శ్రీరామపురం**లు **వ్యాఘ్రేశ్వరా**నికి ఎలా దగ్గరో, శ్రౌతానికి ఏ విధంగా ఇబ్బంది లేకుండా ఉంటుందో ఇదీ అలాగే ఉన్నది. **దువ్వూరి యాజులు** గారి **పౌండరీకం, బాబళ్ళ శాస్త్రి** గారి **అరుణ కేతుకం లంకా, బులుసు** వారల **యజ్ఞాలు** చాలా ప్రేరణ కలిగించాయి. **లక్ష్మీనారాయణ, కామేశ్వరి** దంపతులు కొత్తచోట అగ్నిహోత్రం ఏర్పాటు చేసుకొని, రెండు పూటలా అగ్ని కార్యం నిర్వహిస్తూ, పౌర్ణమి, పాడ్యమి రోజుల్లో ''ఇష్టి'' చేస్తూ, ప్రతి సంవత్సరం **అగ్రయణం** చేశారు. **లంకా** వారి లాగానే **సోమయాగం** చేయటానికి చాలాకాలం నిరీక్షించాల్సి వచ్చింది. చివరికి **లంకా** వారు **అధ్వర్యులు**గా, **మిత్రనారాయణ** గారు **''బ్రహ్మణ్యులు''**గా, కోనసీమలోని 18మంది "**ఋత్విక్కులు**"గా 1970లో **అగ్నిష్టోమం** నిర్వహించి మనోభీష్టం నెరవేర్చుకొన్నారు. **లక్ష్మీనారాయణ** గారికి **అగ్నిహోత్రం** అన్నా **ఇష్టి** అన్నా పరమ ఆరాధనా భావం. కొడుకులతో కలిసి పొదలలో, పాముల భయం ఉన్న చోట్ల చప్పుళ్ళు చేస్తూఎండు కట్టెలను పోగేసి తెచ్చి అగ్నిహోత్రానికి ఉపయోగించేవారు. ముఖ్యంగా పంటల కాలంలో అమావాస్య, పౌర్ణమి రోజులలోను, దీపావళి సమయంలోనూ **అగ్రయణం** చేయటానికి చాలా ఉత్సాహ పడేవారు. ఒక్కసారి మాత్రమే **అగ్నిష్టోమం** చేసిన వెంటనే **శ్రావణ పశు** చేశారు. మిగిలిన ఏ శ్రౌత కర్మల జోలికీ పోలేదు. **శ్రౌతం డబ్బు వచ్చే వృత్తి అనుకోలేదు**. కనుక కుటుంబ ఆర్థిక స్థితి ఎప్పుడూ ఒడిదుడుకులతోనే ఉండేది. 1986లో ఆయన 66వ ఏట **తిరుపతి దేవస్థానం** వారి దృష్టిలోపడి వృద్ధ పండితులుగా మాత్రమే గుర్తించి వేదపఠనం లేని పెన్షన్ ఇచ్చారు. నెలవారీ డబ్బు రావటంతో కొంత తేరుకున్నారు. చివరికాలంలో ఋత్విజుల లేమితో కొంత కలత చెందారు. తెలుగు పండిట్ అయిన కొడుకు ఆసరాగా నిలబడ్డాడు. 1996లో **కామేశ్వరీ సోమిదేవమ్మ** గారు 70వ ఏట మరణించారు. ఆమెతోపాటు త్రేతాగ్నులు **''బ్రహ్మమేధం''**తో పాటు దూరమయ్యాయి. ఈ **బ్రహ్మమేధాన్ని శ్రీరామపురా** నికి చెందిన **దువ్వూరి యాజులు** గారు, **వ్యాఘ్రేశ్వరా**నికి చెందిన **బులుసు కామేశ్వర సోమయాజి** గారు దగ్గరుండి చేయించారు. **లక్ష్మీనారాయణ** దంపతుల ముసలితనం వలన అంతకు మూడేళ్ళకు ముందే **అగ్నిహోత్రం** ఆగిపోయింది. **''లౌకిక ఆరణి''**, స్త్రీలకు మాత్రమే ఉన్న మరొక **''సభ్యోక్తి''** అగ్నిలను మాత్రమే జాగ్రత్తగా కాపాడి, రెండేళ్ళ తర్వాత చనిపోయిన లక్ష్మీ

నారాయణసోమయాజులు గారి **అన్త్యేష్టికి** ఉపయోగించారు. వీరితో పుల్లెల వారి కుటుంబం ఆత్మవిశ్వాసంగా, గర్వంగా చెప్పుకొనే వేదంలో ఉన్నాము అనే మాట కూడా దూరమైపోయింది.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – ౨౦

ఇప్పుడు **కాకినాడ**లోని ఆహితాగ్నుల గురించి తెలుసుకొందాం

### 1-బ్రహ్మశ్రీ భమిడిపాటి మిత్రనారాయణ మహాగ్ని చతుర్ సర్వతోముఖ యాజులు గారు.

**కాకినాడ**కు చెందిన **బ్రహ్మశ్రీ భమిడిపాటి మిత్రనారాయణ సర్వతోముఖ సోమయాజి** గారు **శాండిల్య గోత్రీకులు**. తండ్రి గారు **బ్రహ్మశ్రీ భమిడిపాటి శేషాద్రి సోమయాజులు** గారు **ఆహితాగ్ని, ఘనపాఠీ, వేద భాష్య ప్రవీణులు**. **శేషాద్రి** గారు 1935లో **అగ్నిష్టోమం** తన 26 ఏళ్ళ వయసులో చేశారు. అప్పుడు **మిత్రనారాయణ** గారి వయసు 5 సం.లు. **వేద, శ్రౌతాలలో శేషాద్రి** గారు డిస్టింక్షన్ సర్టిఫికేట్ పొందారు. **ఉర్లాంపట్టా, బెజవాడ** పట్టాదారు కూడా. ఇవి ఈనాడు గొప్పగా చెప్పుకొనే హార్వర్డ్, ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీల నుండి పొందే పి.హెచ్.డి.ల కంటే ఎక్కువ. అర్ధాంగి **శ్రీమతి సూర్య సోమిదేవమ్మ** గారి తండ్రి, తాత, సోదరులు **అగ్నిష్టోమం** చేసినవారే. **శేషాద్రి** దంపతులకు ముగ్గురు కొడుకులు, ఏడుగురు కుమార్తెలు. ఇద్దరు కొడుకులకు **శేషాద్రి**గారే వేదం నేర్పి వేద పండితులను చేశారు. ఇద్దరూ సర్టిఫికేట్ పొందినవారే. ఒక ఆడపిల్లను మాత్రం వేదపండితుడికిచ్చి పెళ్లి చేశారు. **లంకా** వారు **భమిడిపాటి** వారికంటే మూడేళ్ళు చిన్నవారు. **లంకా వారు కూడా భమిడిపాటి శిష్యుడే**. **లంకా** వారు **అగ్నిహోత్రం** ప్రారంభించేనాటికి **మిత్రనారాయణ** గారికి **లంకా** వారి ఏకైక పుత్రిక **అనసూయ** గారితో వివాహమైంది. దీనితో **లంకా** వారికి ఆహితాగ్ని అల్లుడు లభించాడన్నమాట. **శేషాద్రి** దంపతుల పెద్ద కొడుకు **మిత్రనారాయణ** గారు 1930లో జన్మించారు. 16ఏళ్ళ వయసులోనే వేద విద్యనంతటినీ **కపిలేశ్వరపురం** దగ్గరున్న **కోరుమిల్లి**లో తండ్రి గారి వద్దనే అభ్యసించారు. **నేదునూరు**కు **కోరుమిల్లి** ఉత్తరాన ఉంటుంది. ఇదే **దువ్వూరి యాజులు** గారి ఆవాస భూమి. తూర్పుకు ప్రవహించే గౌతమి గోదావరికి ఎడమ గట్టు మీద ఉంటుంది. 15 ఏళ్ళ వయసులో **అనసూయ** గారు ఈ అత్యంత విశాల గోదావరి దాటి **కోరుమిల్లి** కి కాపురానికి వచ్చారు. **మిత్రనారాయణ** దంపతులకు ఏడుగురు సంతానం. మొదటి సంతానం పొందగానే 1955లో **శ్రౌతం**లో ప్రవేశం కోసం **ఆధానం, అగ్నిష్టోమం** చేశారు. అల్లుళ్ళు, మామగారి కుటుంబం ప్రోద్బలంతో స్వయంగా 22వ ఏట తండ్రి అయిన దానికంటే నాలుగేళ్ల ముందే ఆహితాగ్ని అయ్యారు **మిత్రనారాయణగారు**. **మిత్రనారాయణ** గారి **అగ్నిష్టోమం**కు **బాబళ్ళ శాస్త్రి** గారు, **బులుసు చయనులు** గారు, **లంకా లక్ష్మీనారాయణ** గారు, **బులుసు వ్యాఘ్రేశ్వరుడు** గారు, **బులుసు కామేశ్వర సోమయాజి** గారు

వంటి దిగ్గంతులు హాజరయ్యారు. **దువ్వూరి యాజులు** గారొక్కరే రాలేదు, **అగ్నిష్టోమం** అవగానే మిగిలిన శ్రౌత కర్మల విషయంపై దృష్టి పెట్టి 1970కి ముందే **చయనం**, **సర్వతోముఖం**లను **నేదునూరు**లో నిర్వహించారు. **సర్వతో ముఖా**నికి నాలుగు వైపులా ఉన్న అగ్నిహోత్రాలు నిర్వహించటానికి 72 మంది ఋత్విక్కులు అవసరం. గోదావరి డెల్టాలో 50ఏళ్ళ క్రితం **బ్రహ్మశ్రీ రెండు చింతల యాజులు** గారు చేసిన తర్వాత మళ్ళీ ఇప్పుడు మిత్రనారాయణ గారు చేసి రికార్డ్ నెలకొల్పారు. దీనితో **మిత్రనారాయణ** గారు **మహాగ్ని చతుర్ సర్వతోముఖ యాజులు** గారు అయ్యారు. **మిత్రనారాయ**ణ గారికి దగ్గర బంధువైన **దువ్వూరి యాజులు** గారే గొప్ప ప్రేరణ. ఈ జంట ఎప్పుడూ కోనసీమలో ఎక్కడ ఏ శ్రౌతకార్యం వచ్చినా కలిసి నిర్వహించేవారు. 1950-60 కాలంలో "**ఇష్టి**", "**అగ్రయణం**", "**శ్రావణ పశు**" నిర్వహణలకు ఋత్విక్కుల కొరత ఉండేదే కాదు. 7ఏళ్ళ వ్యవధిలో **మిత్రనారాయణ** గారు నిత్యాగ్నిహోత్రులుగా ఉంటూనే **నాలుగు అద్వితీయమైన శ్రౌత కార్యాలు** నిర్వహించి ప్రశంసలు పొందారు. కాని మామగారు **లంకా** వారి లాగా **మిత్రనారాయణ** గారు కొడుకులకు వేద విద్య నేర్పటంలో అంతగా సఫలీకృతులవ్వలేదు. ఇతరుల పిల్లలకు బోధించి మాత్రమే సంతృప్తిపడాల్సి వచ్చింది. ఈ వేద బోధ ఆయన 70ఏళ్ళ వయసు దాటే వరకు నిరాఘాటంగా సాగింది. వేదపండితులకు **''పారాయణ ప్రోగ్రాం''** ను ప్రారంభించటానికి **తిరుపతి దేవస్థానా**నికి **బ్రహ్మశ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారు గొప్ప ప్రేరణ, స్ఫూర్తి కలిగించారని **మిత్రనారాయణ** గారు స్పష్టం చేశారు. ఆయన ఈ ఆలోచన చేయకపోతే వేదపండితులకు ఆర్థిక వనరులు సమకూరేవి కావు అన్నారు. **బ్రాహ్మశ్రీ ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారు **కోరుమిల్లి**కి తూర్పునున్న బాంక్ కెనాల్ పై ఉన్న **దంగేరు** గ్రామంలో 1888లో జన్మించారు. **కాకినాడ**లో స్థిరపడ్డారు. **శతమానం భవతి** అన్నట్లు నూరేళ్ళు పూర్ణ ఆయుర్దాయంతో జీవించారు. కాకినాడలో ఉన్న **జానకీ జాని** అని పిలువబడే **శ్రీ సామవేదం జానకిరామశాస్త్రి** గారు ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంగ్లిష్ లెక్చరర్ గా, ప్రిన్సిపాల్ గా పని చేసి రిటైరయ్యారు. కాకినాడ కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఉండే ఎల్.బి.నగర్ లో స్వంత ఇంట్లో ఉండేవారు. 1994లో రాజమండ్రిలో మూడు రోజులపాటు ఆత్మీయులు, మహాకథకులు, అఖిల భారత సాహిత్య పరిషత్ అధ్యక్షులు మాన్యులు **శ్రీ ఆర్.ఎస్. కే.మూర్తి** గారి ఆధ్వర్యంలోనిర్వహించబడిన సభలలో నాకూ మా బావమరది ఆనంద్ కు పరిచయమయ్యారు. వయసులో మాకంటే చాలా పెద్ద అయినా, ఎంతో చనువుగా ఆప్యాయంగా ఆ మూడురోజులు మాతో గడిపారు. ఆయనకు వాల్మీకి రామాయణం వాచో విధేయం. **కవిసామ్రాట్ విశ్వనాథసత్యనారాయణ** గారి ముఖ్య శిష్యుడు కూడా. **కల్పవృక్షరామాయణం** పై అథారిటీ. **గణపతి శాస్త్రి** గారు **మిత్రనారయణ** గారికి కాకినాడలో 1977లో ఒక ఇంటిని కుదిర్చి దగ్గరలో ఉన్న **జగన్నాయికపురం**లోని **శ్రీ వెంకటేశ్వర దేవాలయం**లో వేదపారాయణకు ఏర్పాటు చేయించారు. అద్దె లేని

ఆ ఇంట్లో ఉంటూ తన 9 మంది సంతానాన్ని మిత్రనారాయణ గారు పోషించారు. నిత్యం స్నానం, సంధ్యావందనం, అగ్నిహోత్రం చేయటం, టిఫిన్ చేసి దేవాలయానికి వెళ్లి ఉదయం 8నుండి 10వరకు వేదపారాయణ చేయటం నిత్య కృత్యం. ఉదయం 11గంటలకు ఇంటికి చేరి మాధ్యాహ్నిక సంధ్యావందనం అగ్నిహోత్రం చేసి భోజనం చేసి మధ్యాహ్నం ఒక విద్యార్థికి వేదం నేర్పేవారు. రాత్రి భోజనం నిద్ర. 1992కు వేదపారాయణ జీతం నెలకు వెయ్యి, 1998కి 1800 రూపాయలయింది.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 21

### 1-బ్రహ్మశ్రీ భమిడిపాటి మిత్రనారాయణ మహాగ్ని చతుర్ సర్వతోముఖ యాజులు గారు -2

తన **సర్వతోముఖ యాగం** గురించి **మిత్రనారాయణ** గారు "సర్వతోముఖం అయ్యాక నాకు శ్రౌతం అంటే విరక్తి కలిగింది" అన్నారు. అందుకనే చాలా ఏళ్ళు శ్రౌతాలకు, ఋత్విక్కులపై పర్యవేక్షకులుగా ఉన్నారు. 1998లో ఆయన విశిష్టమైన **8 పౌండరీకాలకు, 2 వాజపేయా**లకు **బ్రహ్మ** లేక **అధ్వరులు**పై పర్యవేక్షకులుగా ఉన్నారు. చాలా వాటికీ అంటే **నక్షత్రేష్టి, పంచ రత్నయాగం**లలో **ఉద్గార్** గా, **హోత**గా మచిలీపట్నం మొదలైన చోట్ల ఉన్నారు. చివరికి 2005 జనవరి చివరలో విజయవాడలో జరిగిన **పౌండరీకా**నికి **బ్రహ్మ**గా ఉండి 75 ఏళ్ళ **మిత్రనారాయణ** బాగా అలసిపోయి, కాకినాడ వచ్చి విశ్రాంతి తీసుకొన్నారు.

కాకినాడలో ఏడేళ్ళు నిత్యాగ్నిహోత్రం చేసి, ఆ తర్వాత స్వస్తి పలికారు. మళ్ళీ **అగ్రయణం**, **శ్రావణ పశు, దర్శ, పౌర్ణమాస** క్రతువుల్లో ప్రాయశ్చిత్తం జరిపి **పునః అగ్నిహోత్రం** చేశారు. మంచి ఇల్లు కట్టుకొనే సంకల్పంతో కూడా కొంతకాలం ఆపేశారు. చివరకు కాకినాడ సమీపంలో విశాలమైన గృహం నిర్మించుకొని గృహప్రవేశం చేశారు. కానీ అగ్నిహోత్రం జోలికిపోలేదు. దీనికి కారణాలు చాలా ఉన్నాయి. అగ్నిహోత్రం గది పూర్తికాకపోవటం, భార్య ఆరోగ్యం బాగులేకపోవటం, ఇష్టి నిర్వహణకు తగినంత ఋత్విజులు లభ్యం కాకపోవటం. కాకినాడ టౌన్ విపరీతంగా పెరిగిపోయి కోనసీమ అగ్రహారం ఒంటరిది ఐపోయింది. వేదపండితులు విద్యార్ధులు క్రమంగా తగ్గిపోయారు. 1988లో **ఉప్పులూరి గణపతి శాస్త్రి** గారు వందేళ్ళు జీవించి మరణించాక కాకినాడలో వైదిక విద్య కూడా దూరమైందని **మిత్రనారాయణ** అన్నారు. 1992లో ఒక రిటైర్ ఇంజనీర్ కు రోజుకు ఎనిమిది గం.లు వేదం నేర్పారు. **తైత్తిరీయ సంహిత** నాలుగవ కాండ క్రమ పాఠంలో ఉండగా, **మిత్రనారాయణ** గారు కళ్ళు మూసుకొని తన్మయంతో సంత చెబుతుంటే, ఆ 60 ఏళ్ళ ఇంజనీర్ విద్యార్థి పుస్తకం చేతిలో పెట్టుకొని బిగ్గరగా వల్లెవేస్తుంటే, ఆయనకు తన తండ్రి గారి వద్ద యాభై ఏళ్ళ క్రితం వేదాధ్యయనం చేసిన రోజులు గుర్తుకొచ్చేవి. ఈ సన్నివేశాన్ని ఆంగ్ల దొరకు తెలియజేస్తుంటే, ఒక్క అక్షరం కూడా మారకుండా ఇంతకాలం వేదం ఎలా కాపాడబడిందో అర్థమై

ఆనందంతో కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. తర్వాత కాకినాడ బయట ఒక వేదపాఠశాల వెలిసింది. అయితే దానికి శ్రౌతంలో నిష్ణాతులెవరూ ఉపాధ్యాయులు లేరు. వారి అభ్యర్థన మేరకు మిత్రనారాయణగారు 10-12ఏళ్ళ వయసుగల అయిదుగురు విద్యార్థులకు **తైత్తిరీయ సంహిత**లోని **ఆధాన, అగ్నిష్టోమ, అగ్నిచయన భాగాలను** నేర్పారు. మధ్యవయసులో **మిత్రనారాయణ**గారు అందంగా స్ఫురద్రూపిగా, మామగారు **లంకా** వారంత ఎత్తుతో, చెవులకు స్వర్ణకుండలాలతో వాద ప్రతివాదాలలో చేతులూ, తలా ఊపుతున్నప్పుడు ఆ కుండలాలు కూడా ఊగుతూ, స్వర్ణ కాంతులను వెదజల్లేవి. 1992 ఏప్రిల్ లో కాకినాడలో ఆయనకు రాజమండ్రిలోని "**వేద భాష్య ప్రవీణులు**" **శ్రీ రేమెళ్ళ సూర్య ప్రకాశ అవధాని** గారు ముఖ్య అతిథిగా గొప్ప సన్మానం జరిపారు, మామగారు **లంకా** వారు వృద్ధాప్యంతో ప్రయాణం చేయలేక రాలేకపోయారు. **మిత్రనారాయణ**గారికి చాలా సన్మానాలు, పట్టా ప్రదానాలు జరిగాయి. అందులో ముఖ్యమైనవి **మద్రాస్, కంచి, తిరుపతి, రాజమండ్రి, ఢిల్లీ**వి సుప్రసిద్ధమైనవి. సత్కార సన్మానాలంటే చివరికి విసుగనిపించేది ''మీకు సన్మానం చేస్తాం, మీతో ఫోటో దిగుతాం, మీ విగ్రహం పెడతాం'' అని చాలామంది ఉవ్విళ్ళూరించే వారని చెప్పారు. వీటి వలన అంకిత భావం, ఆత్మజ్ఞానం కోల్పోవటం జరుగుతుందని బాధపడ్డారు. శతాబ్దం చివరకు **మిత్రనారాయణ** గారు శరీరం బలహీనమై, వయసు భారమై ఇక తాము ఎన్నో ఏళ్ళు జీవించలేము అని తెలుసుకొన్నారు. ఒత్తు జుట్టు బట్టతల అయింది. శరీరం కృశించి, ముఖం పొడవై చెవికుండలాలు భారమై కిందికి వేలాడేవి. కొత్త శతాబ్దంలో మొదటి దశాబ్దం వరకు సమాజంలోని యువకులు, వృద్ధులు ఆయనను అత్యంత గౌరవంగా ఆదరించారు. ''అరుగో! శ్రౌతంలో అద్వితీయులు, స్వయంపోషకులు, సర్వస్వతంత్రులు, ఏ విషయంపైన అయినా సాధికారంగా, పాండిత్యం ఉట్టిపడేట్లు ప్రసంగించగల దిట్ట **శ్రీ భమిడిపాటి మిత్రనారాయణ సోమయాజులు** గారు'' అని ఉప్పొంగిపోతూ చెప్పుకొనేవారు అని **శ్రీ దువ్వూరి యాజులు** గారు అన్నారు. **దువ్వూరి ఫణి** గారు **మిత్రనారాయణ** గారిని **''మానాన్న గారు యాజులుగారి కంటే ''త్రికాండ'' విద్వత్తులో మిత్రనారాయణ గారు ఘనులు. "కర్మ", "ఉపాసన", "జ్ఞానం" మూడింటిలో మిత్రనారాయణగారికి సాటి వేరెవరూ లేరు''** అని నిష్కర్షగా నిర్దుష్టంగా నిస్సంకోచంగా చెప్పారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 22

1-బ్రహ్మశ్రీ భమిడిపాటి మిత్రనారాయణ మహాగ్ని చతుర్ సర్వతోముఖయాజులు గారు -3 (చివరిభాగం)

"**పట్టిసీమ**" **శ్రీ వీరభద్ర స్వామి దేవాలయం**లో ఒక శివరాత్రి రోజు సుమారు 200 మంది వేదపండితులు వేద పఠన సమావేశంలో **మిత్రనారాయణ** గారు పాల్గొని, వారి సామర్థ్యాన్ని అంచనా వేశారు. స్వస్తి

వచనం నిర్దుష్టంగా చెప్పగల వేరొక ఆరుగురిని ఆహ్వానించి స్వస్తి చెప్పించి ఘనంగా వారికి పారితోషికాలు ఇప్పించారు. మరొకసారి **దువ్వూరి యాజులు** గారి బదులు **మిత్రనారాయణ** గారు వేద విద్యార్థులను పరీక్షించే బోర్డులో సభ్యులుగా ఉన్నప్పుడు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి విద్యార్థులను ఎంపిక చేయమన్నప్పుడు ''ఇందులో శ్రేణి అంటే ఏమిటి? వంద మంది వీళ్ళు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చారు. వీరిలో ఏ ఒక్కరినో ఎంపిక చేసి క్లాస్ ఇవ్వటం కుదరదు. వీరెవరూ పాస్ కు అర్హులుకారు. అందుకని నేను ప్రేక్షక పాత్ర వహించి మిగతా సభ్యులనే నిర్ణయించమని చెప్పాను'' అన్నారు. **వేదసంస్కృతం** గురించి మాట్లాడుతూ **ఎవరికీ సరైన అవగాహన లేదన్నారు. మిత్రనారాయణ** గారు **ప్రాచీన సంప్రదాయ పరిరక్షకులలో ఒకరే కాక, ఆధునికకాలంలో జరుగుతున్న అనర్థాలపై మంచి విమర్శకులు కూడా. ఈ నాటి వేదవిద్యార్థులు ఇంగ్లీష్ కూడా నేర్వటాన్ని ''హూణ విద్యా ప్రవేశంతో వేదం, శ్రౌతం భ్రష్టుపట్టాయి. వైదిక జీవితం కనుమరుగైంది అందులోని ఆత్మ దెబ్బతిన్నది. ఇది హూణ విద్య కాలం. వేదంలో నిష్ణాతుల తరం గడిచిపోయింది సరైన ఋత్విజులు లేరు. ఉన్నవారికి సాధికారత లేదు. ఇప్పుడు జరుగుతున్న శ్రౌత కార్యాలన్నీ రసహీనమే''** అంటారు. దక్షిణాదికి పర్యవేక్షకునిగా వెళ్ళటాన్ని గురించి మాట్లాడుతూ ''ఉద్దేశ్యాలు పవిత్రంగా లేనప్పుడు, అక్కడ జరిగే క్రియలూ సత్ఫలితాలను ఇవ్వవు. చెరుకు గడ నుంచి తీసిన రసం రుచికాని, దాని పిప్పి నుంచి తీస్తే రాదుకదా'' అన్నారు. కృష్ణాజిల్లాలో యజ్ఞయాగాదులు చేయించేవారు డబ్బు గుంజటం మీదనే దృష్టిపెట్టటం బాధాకరం అంటారు. **మిత్రనారాయణ** గారి ఆహితాగ్ని తండ్రి గారు 1989లో చనిపోయినపుడు **''బ్రహ్మమేధం''** చేయటానికి సమర్థులు, నిష్ణాతులైన వారిని పిలిపించటం చాలా కష్టమైంది. ఆయనకు అత్యంత ఆప్తుడు స్నేహితుడే నిర్దాక్షిణ్యంగా రావటానికి నిరాకరించాడు. అప్పుడు వాళ్ళు "దీనికి వస్తే తాము కూడా చస్తామన్న భయం'' అని దెప్పారు. తానే పుస్తకం దగ్గర పెట్టుకొని **బ్రహ్మమేధం** చేశానని గర్వంగా చెప్పారు **మిత్రనారాయణ** గారు. **''బ్రహ్మమేధం లేని అన్త్యేష్టి కుక్కగతే''** అన్నారు. **ధర్మ శాస్త్రం**పై అంతటి అపార విశ్వాసం ఆయనకు. 1988లో **బాబళ్ళ శాస్త్రి** గారు **డెల్టాలో శ్రౌతకర్మలు ఇంకో పదేళ్ళు మాత్రమే జరుగుతాయి** అని చెప్పారు. దాదాపు ఆయన అన్నట్లే జరిగింది. శతాబ్దం చివరలో **బులుసు కామేశ్వర సోమయాజి, మిత్రనారాయణ** గారు మళ్ళీ అగ్నిహోత్రం ప్రారంభించాలని నిర్ణయించారు. అగ్నులన్నీ ఆరిపోయాయి. సంతృప్తిగా **ఆధానం** చేయటానికి ఇద్దరికీ కుదరలేదు. **లంకా** వారి అల్లుడు **మిత్రనారాయణ** గారు **లంకా** వారు, **దువ్వూరి** వారు లాగా పాత తరానికి చెందినవారే. పఞ్చాఙ్గాలను బట్టే నడిచేవారు. చెప్పటం కూడా తెలుగు సంవత్సరాల పేర్లతోనే అంటే నందన, శర్వరి మొదలైన పేర్లతోనే గత చరిత్ర గుర్తు చేస్తారు. **దువ్వూరి యాజులు** గారిలా **శ్రౌత విద్యనూ కులవిద్య**గా భావించారు. ఇంటికి అతిథులెవరైనా వస్తే భార్య **అనసూయ** గారు, మనవరాలు కాఫీ

లేక టీ లుఇచ్చి మర్యాద చేస్తారు. **మిత్రనారాయణ, అనసూయ** దంపతులకు 13మంది మనవలు మనవరాళ్ళు. **ఆయన గదిలో 200 ఏళ్ళనాటి తాళపత్ర గ్రంథాలున్నాయి**. వీటిలో కొన్ని వేదపండితులైన ఆయన తాతగారు వ్రాసినవికూడా ఉండటం విశేషం. ఆహితాగ్ని గారైన తండ్రిగారికి వారినుంచి ఈయనకు తరతరాలుగా సంక్రమించి గ్రంథనిధి. ఒకసారి విసుగుపుట్టి దేశంలో ఈ ప్రాంతంలో మిగిలిఉన్న వైదిక శ్రౌతి అనిపించుకోవటం ఇష్టం లేకపోయింది. అందుకే దానినుంచి విరమించారు. కాని ఒకసారి ఎవరో ఫోన్ చేసి ఫోన్ లో వేద పఠనం వినిపించమని బ్రతిమిలాడారు కానీ ఇష్టపడలేదు. ఆయన స్నేహితుడి బలవంతం పై పఠనం చేసి, ఎలాఉందని ఆయన్ను అడిగితే రికార్డింగ్ చాలా అద్భుతంగా వచ్చిందని సంతోషంగా చెప్పారట. ఫోన్ చేసినాయన వెయ్యిన్నూట పదహారు రూపాయలు గౌరవ పారితోషికంగా పంపాడు. అప్పుడు ''ఎంత ఉత్కృష్టమైనది ఈ వేదవృత్తి? రోజుకో ఫోన్ కాల్ ఇలా వస్తే చాలు సంతోషంగా ఉంటుంది ''అన్నారు ఆనందంగా **బ్రహ్మశ్రీ భమిడిపాటి మిత్రనారాయణ మహాగ్ని చతుర్ సర్వతోముఖయాజులు** గారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 23


### బ్రహ్మశ్రీ కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి గారు (1909-1983)

**కాకినాడ**కు చెందిన **కాశ్యప గోత్రీకులు బ్రహ్మశ్రీ కపిలవాయి వెంకట సోమయాజులు, సుబ్బలక్ష్మీ సోమిదేవమ్మ** దంపతులకు అయిదుగురు పుత్రులు, ముగ్గురు పుత్రికలు. వీరి పెద్ద కుమారుడు **పెద్ద రామ శాస్త్రి (1889-1987)** గారు 98 సం.లు జీవించారు. అరుదైన వేదపండితునిగా గణనకెక్కారు. వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా ఉండిపోయారు. కనుక త్రేతాగ్నులలో ఒకే ఒక అగ్నిహోత్రాన్ని ఆరాధించారు. రెండవ కుమారుడు **చిన్న రామ శాస్త్రి గారు(1904-85)** కూడా గొప్ప వేదపండితులే. వివాహమాడి గార్హపత్యాగ్ని మాత్రమే చేశారు. కాని తండ్రిలాగా త్రేతాగ్నులను ఆరాధించలేదు. ఈయన బాబళ్ళశాస్త్రి గారికి సమకాలీనుడు. మూడవ కుమారుడు జన్మించిన తర్వాత నాలుగవ పుత్రుడు **శ్రీ యజ్ఞేశ్వర శాస్త్రి** గారు జన్మించారు. ఈయనే మన కథానాయకులు.

యజ్ఞేశ్వర శాస్త్రి గారు అన్నగారు **పెద్ద రామ శాస్త్రి** గారి వద్దనే వేదం నేర్చారు. వీరు అన్నివిధాల తండ్రికి సరిజోడు. **#దక్షిణ భారతదేశంలో వీరికి మించినవేదపండితులు, శ్రౌతం కార్య నిర్వాహకులు లేరని పించుకొన్నారు#**. అనేక ప్రముఖ పట్టణాలలో తమ విద్వత్ ప్రదర్శన చేసి గొప్ప ప్రశంసలందుకొన్నారు. పర్యవేక్షణలో, ఆర్థిక ప్రోత్సాహమివ్వటంలో, పదోన్నతిలో, కార్య నిర్వహణలో ఆయనకు సాటి మరెవ్వరూలేరు. కాని చిన్నన్నగారు చిన్న రామ శాస్త్రి గారిలాగా ఆధానం చేయలేదు. కనుక అగ్నిష్టోమం

కూడా లేదు. చెయ్యాలనే కోరికలేకకాదు కాని, సోదరుల అనాసక్తి వలన మాత్రమే. పెద్దన్నలిద్దరూ త్రేతగ్నులను చేయనట్లే ఈయనా చేయలేదు. దీనికి బదులు సరిసాటిలేని "**శ్రౌతి**" అనిపించుకొన్నారు ఆధునిక దక్షిణ భారత చరిత్రలో. ఆహితాగ్ని కుటుంబం వేదంలో ఉన్నాం అని చెప్పినట్లుగా చేయటానికి సరైన గురువు ప్రోద్బలం కూడా అవసరం. ధర్మ శాస్త్రం చెప్పిన **పరీష్ట** అంటే **పెద్దవారిని అధిగమించి తాను చేయటం** అనే సందిగ్ధం కూడా తోడైంది. కనుక అన్నగార్ల అనుమతి పొందాల్సి ఉంది. పెద్దన్నగారు దారిచూపి ఉంటే తనకు ఈ ధర్మ సంకటం రాకపోయేది కదా. అప్పుడుతాను కర్మాధికారి యోగ్యత పొందేవాడిని కదా అని వితర్కించుకొన్నారు. వారితో సహపంక్తి భోజనానికీ అర్హత లేదు. కనీసం చిన్నన్న అయినా మనసు మార్చుకొని **అగ్నిష్టోమం** చేసి ఉంటే తనకీ తిప్పలుండేవి కావు. ఎప్పుడూ తోడి పెళ్లి కొడుగ్గా ఉండటమే తప్ప పెళ్లి కొడుకు పాత్ర రావటం లేదని బాధపడేవారు అంటే యజ్ఞంలో యజమాని అయ్యే అవకాశం కోల్పోతున్నానని భావం. కనుక యజ్ఞయాగాలకు అధికారి, పర్యవేక్షకులుగా ఉండి **యజ్ఞేశ్వర అగ్నిహోత్రి** అని పిలిపించుకోవాలనే గట్టి నిర్ణయానికి వచ్చారు. అంతే ఇక తిరుగులేదు. ఈ రంగంలో తనకు మించినవారెవరూ లేరనే స్థాయి సంపాదించి **యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి** అయ్యారు. ఆరవ ఏటనే ఉపనయనం జరిగి, పెద్దన్నగారి వద్ద **తైత్తిరీయం** నేర్చారు. ఒకరకంగా **అరుదైన బాలమేధావి** అనిపించారు. **25-1-1984న యజ్ఞేశ్వరుల మరణం** తర్వాత రెండు నెలలకు ఇండియన్ ఎక్స్ ప్రెస్ పత్రిక ఆయన ఫోటో ప్రచురించి ఆయన గురించి అత్యద్భుతంగా వ్రాసింది —దాని సారాంశం తెలుసుకొంటే వారి ప్రతిభ మనకు అవగతమవుతుంది. **12వ ఏటనే యజ్ఞేశ్వర శాస్త్రిగారు వేద, వేదాంగాలలో, విద్యారణ్య భాష్యంలో, షట్ శాస్త్రాలలో వీటికి మించి శ్రౌతంలో అపార జ్ఞాన సమున్నులవ్వటం**, అన్నీ నాలుక మీద నర్తిస్తున్నట్లు గోచరించటం చూసి ఇరుగూ, పొరుగూ వారు ఆశ్చర్య చకితులై కళ్ళప్పగించి చూసేవారు. 16వ ఏట మొట్టమొదటిసారిగా ఒక యజ్ఞాన్ని పర్యవేక్షించారు. తర్వాత కుంభకోణం లోని కంచి కామకోటి పీఠం గురుకులంలో చేరారు. అక్కడ నేలమాళిగలో ఉన్న, అక్కడ స్థానిక వేద పండితులకు అవగాహన లేని మూడు తాళపత్ర గ్రంథాలను వెలికితీసి, వాటిలోని రహస్యాలను వెతికి వ్రాసి, లోకానికి తెలియజేసే వరకు విశ్రమించలేదు. అంతటి కఠోర దీక్ష ఆయనది అని ఆయన ప్రతిభను ఆవిష్కరిస్తూ వ్రాసింది. ఈ అసాధారణ ప్రతిభకు ప్రశంసల వర్షం కురిసింది శాస్త్రి గారిపై. దీనితో వారికి వేదవిజ్ఞానంపై విపరీతమైన మక్కువ ఏర్పడింది. జీవితాంతం ఉత్తమ గురువుల, అత్యుత్తమ గ్రంథాల అన్వేషణలోనే ఉన్నారు. గ్రంథాల ఆచూకీ కోసం భార్యతో, ఇద్దరన్నగార్లతో కలిసి రైళ్ళు బస్సులలో ప్రయాణం సంపాదించేవారు. ఒక్కోసారి వీరంతా అనేక మైళ్ళు సాధువులు లాగా నడిచి వెళ్ళాల్సి వచ్చేది. ఈ ప్రయాణాలలో వారి ఆహారం వేరుశనగకాయలు, జీడిపప్పు మాత్రమే. వీరి అన్వేషణ ఎక్కడైనా గొప్ప వేదపండితుల వద్ద అరుదైన శాస్త్ర

గ్రంథాలున్నాయా, శ్రౌత కార్యాలకు ఇంకాఎవైనా నిర్దుష్ట పద్ధతులు ఉన్నాయా అని తెలుసుకోవటానికే. ఒక్కోసారి పీఠాధిపతులను సందర్శించి సంభాషించి విషయ సేకరణ చేసేవారు. తన ముఖ్య స్నేహితుడు **రెండుచింతల యాజులు** గారితో, గోదావరి డెల్టాలోని మరికొందరు పెద్దలతో సమావేశమై చర్చించేవారు. అది ఆయనకు బాగా గుర్తింపు పొందిన కాలం. ఈనాడు వేదపండితులు మొదలైనవారు రైళ్ళలో బస్సుల్లో టాక్సీలలో ప్రయాణాలు చేస్తుంటే ఆనాడు వారు ఎంత శ్రమపడ్డారో తెలిస్తే ఆశ్చర్యమేస్తుంది. ఈ వేద అన్వేషణ శాస్త్రి గారి నడి వయస్సుపైదాకా సాగింది. 50వ యేట ఆయనకు ''**శుక్ల యజుర్వేద వాజసనేయ సంహిత**'' కాశీలో ఉన్నట్లు తెలిసింది. ఆయన ముఖ్య గ్రంథం ''**ఆపస్తంభ శ్రౌత సూత్రం**'' దీన్నే **శ్రౌతం** అంటారు. ఆయనకు అత్యంత ఇష్టమైనది **పౌండరీకం**. ఇది ఒక రకమైన **అగ్ని చయనం**. ఆంధ్రదేశమంతటా ఆచరించేది. దీన్ని వారు **గోదావరి, కృష్ణ, కావేరీ** ప్రాంతాలలో, **రామేశ్వరం** దాటి **శృంగేరి, కంచి, తిరుచినాపల్లి**లలో దక్షిణాన, ఉత్తరాన **బదరీనాథ్, ఢిల్లీ, కాశీ**లలో కూడా పర్య వేక్షకులుగా ఉంటూ నిర్వహించారు. "తైత్తిరీయ సంహిత" ఆయనకుఅభిమానమైనదే అయినా,ఆయనకు "సామవేదం" మీదా అత్యంత ఆదరణ ఉండేది. యుక్త వయసులో **విజయనగరం**లో **రాణాయానీయ** విధానాన్ని అధ్యయనం చేశారు. తర్వాత **కౌథుమ** పద్ధతి **కంచి**లో నేర్చారు. **జైమినీయ** పద్ధతి పై ఆసక్తిలేదు. పై రెండు పద్ధతులలో తేడాలు పెద్దగా లేవని అందరూ అంటున్నా శాస్త్రి గారికి వీటిలోని సూక్ష్మం భేదాలను గుర్తించే సామర్థ్యం ఉండేదని వారి కుమారులు చెప్పారు. ఈ భేదాలే శ్రౌత కుటుంబాలలో 20వ శతాబ్దంలో చీలికలకు దారితీసింది. అథర్వ వేదం విషయంలో డెల్టాలో ఒకటికంటే ఎక్కువ పంక్తులలో దాటవేతలున్నాయి. **శ్రీ తంగిరాలబాలగంగాధర శాస్త్రి** గారు, **యజ్ఞేశ్వర శాస్త్రి** గారికి **కపిలేశ్వరపురం**లో **ఋగ్వేదం** నేర్పారని **లంకా** వారు తెలియజేశారు. శాస్త్రి గారు నేర్చుకొని ఋగ్వేదం బోధించారు కూడా. **తంగిరాల** వారు **కాశీ**లో **అథర్వణ వేదాన్ని** ప్రత్యేక విధానంలో ఉదయం వేళ మాత్రమే ఒక కుండలో ఉన్న అగ్నిహోత్రాన్ని శిరసుపై ఒక తడిగుడ్డపై ఉంచుకొని "**అగ్నివ్రతం**"గా అభ్యసించారు. శిష్యుడు **యజ్ఞేశ్వర శాస్త్రి** గారు కూడా ఇదే పద్ధతిలో నేర్చుకొన్నారు. 1975లో **యజ్ఞేశ్వర, మహాలక్ష్మి** దంపతులు విజయవాడ కృష్ణలంకలో స్వగృహం నిర్మించుకొని, ఆంధ్రదేశమంతాసంచారం చేస్తూ జీవితం గడిపారు. తర్వాత నేదునూరులో జరిగిన **వాజపేయం**కు **యజ్ఞేశ్వర శాస్త్రి** గారు, లంకా వారు పర్యవేక్షకులుగా ఉండి నిర్వహించారు. 74వ ఏట బ్రహ్మశ్రీ యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి గారు యజ్ఞపురుషునిలో లీనమయ్యారు. **#ఆంధ్రదేశమే కాదు, యావద్భారతదేశం కూడా ఒక మహా శ్రౌతిని, మహనీయ వేదపండితుని కోల్పోయింది#.**



**కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి** గారి కుటుంబ సభ్యుల చిత్రం.

చిత్రంలో వరుసగా ...

- **శిరస్సు**నందు **కపిలవాయి పెదరామశాస్త్రి** {**కపిలవాయియజ్ఞేశ్వర అగ్నిహోత్రశాస్త్రి** గారి పెద్ద అన్నయ్య} గారు
- **హృదయం** లో **కపిలవాయియజ్ఞేశ్వర అగ్నిహోత్రశాస్త్రి** గారు
- **వామపక్షం**లో **కపిలవాయి చినరామశాస్త్రి** { **కపిలవాయియజ్ఞేశ్వర అగ్నిహోత్రశాస్త్రి** గారి చిన్న అన్నయ్య} గారు
- **దక్షిణ పక్షం**లో **కపిలవాయి గణపతిశాస్త్రి** గారు
- **పుచ్ఛం (తోక భాగం)** లో, **కపిలవాయి వేంకటేశ్వర శాస్త్రి** గారు ( **కపిలవాయియజ్ఞేశ్వర అగ్నిహోత్రశాస్త్రి** గారి పెద్ద కుమారులు), **కపిలవాయి రామశాస్త్రి** ( **కపిలవాయియజ్ఞేశ్వర అగ్నిహోత్రశాస్త్రి** గారి చిన్న కుమారులు ) గారు మరియు **కపిలవాయి గణపతి శాస్త్రి** గారి అబ్బాయి **కపిలవాయి రామకృష్ణశాస్త్రి** గారు

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 24

### శ్రీ కపిలవాయి వెంకటేశ్వర శాస్త్రి గారు

**కపిలవాయి** సోదరులు ఏడవ ఏటనుంచి 12వ ఏట వరకు తండ్రితో, మేనమామలతో కలిసి శ్రౌతకార్యాలకు వెళ్ళేవారు. 1953లో పుట్టిన **వెంకటేశ్వర శాస్త్రి** గారు **తైత్తిరీయ సంహిత అపస్తంభం**తో పాటు నేర్చి 12నుంచి 15వ ఏడు వరకు **ఆధ్వర్యవ, హోత్రీయ, ఔద్గాత్రీయ** కాండలను 10అంగుళాల మందం ఉన్న తాతగారు తెలుగు, సంస్కృతాలలో వ్రాసిన దాదాపు శిథిలావస్థలో ఉన్న తాళపత్రాల గ్రంథంలోని శ్రౌతం నేర్చుకున్నారు. తర్వాత **ఋగ్వేదం "శాకల" శాఖ**, "**ఆశ్వలాయన" శాఖ**తో  అభ్యసించారు. ఆ తర్వాత **అథర్వ వేదం "శౌనిక" శాఖ** అధ్యయనం చేసి 27వ ఏట 1979లో పూర్తి చేశారు. వీరికి స్ఫూర్తి **లంకా** వారు. **సామవేదాన్నీ** వదిలిపెట్టలేదు. మూడు పాఠ భేదాలున్న దానిలో కొన్ని భాగాలు నేర్చుకొన్నారు. వీరి బాబాయి **శ్రీ చిన్నరామ శాస్త్రి** గారు **సింహాచల దేవాలయం**లో రిటైరై, వీరిని ఆ పోస్ట్ కు  సిఫార్స్ చేశారు. నిత్యమూ మహా పండితుని వలె **ఋగ్వేదం** వల్లే వేసుకొంటారు. 19 ఏట శాస్త్రి గారికి **శ్రీమతి అన్నదానం సీతామహాలక్ష్మి** గారితో వివాహం జరిగింది. ఈమె **తెనాలి** దగ్గర **ఆర్యపాటి అగ్రహారం** లోని వేదపండితుని కుమార్తె. భార్యతో సింహాచలంలో కాపురముండి, మగ పిల్లల కోసమని ఆశపడి వరుసగా ముగ్గురు ఆడపిల్లలను కన్నారు. చివరికి కోరిక నెరవేరి వరుసగా ఇద్దరు కుమారులు పుట్టారు. కొడుకులను వెంట తీసుకొని 1922 ఏప్రిల్లో సింహాచలం అప్పన్న దేవాలయానికి వెళ్ళేవారు. 13,8 ఏళ్ళ వయసులో వారిద్దర్నీ బడి చదువు మాన్పించేశారు "వాళ్ళకిష్టమేనా!" అని అడిగితే "బోడి వాళ్ళ అంగీకారం ఎవరిక్కావాలి? పనిలేదు. నేను నిర్ణయించా. అలా జరగాల్సిందే" అన్నారు మొండిగా. సోదరులిద్దరూ రోజూ ఉదయం 5 గం.లకే లేచి మూడవ కాండ రెండవ పన్నం సంతను 5 గం.లపాటు చెప్పుకొంటుంటే, తండ్రి గారి పారాయణ పూర్తయ్యేది. **అగ్ని రామకుమార్, రామ యజ్ఞవరాహ నరసింహమూర్తి**లకు వరుసగా ఉపనయనాలు జరిపిచారు. అన్న వేదం నేరుస్తుంటే తమ్ముడు వింటూ ఉండేవాడు "ఇలా చేస్తే రెండవవాడు నేర్వటం ప్రారంభించే నాటికి అనుభవం బాగా వస్తుంది" అన్నారు తండ్రి. ఆరేళ్ళ తర్వాత ఇద్దరూ మళ్ళీ బడిలో చేరి పెద్దాయన ఇంటర్ పాసై నేవీలో ఉద్యోగార్హత సాధిస్తే, తమ్ముడు టెన్త్ క్లాస్ లో ఉండి, వేదం పూర్తి చేశాడు. 1998 నాటికి **వెంకటేశ్వర శాస్త్రి** గారి ముగ్గురమ్మాయిలు **సీతారామలక్ష్మి, సీతా మహాలక్ష్మి, శ్రీదేవి**లకు వివాహాలు అయిపోయాయి. సంతానవతులై తలిదండ్రులకు మనవళ్ళు మనవరాళ్ళను అందించారు. పెద్దమ్మాయికి ఇద్దరాడపిల్లల తర్వాత కవల మగపిల్లలు పుట్టారు. వీళ్లిద్దరిని అతిజాగ్రత్తగా పెంచి తమ అగ్నిహోత్ర విధులు అప్పగించారు. అతి పెద్ద నగరమైన విశాఖ పట్టణానికి

సింహాచలం అతి చేరువలో ఉండటం వలన, ఋగ్వేద పఠనంలో మంచి గుర్తింపు పొందినందువలన **వెంకటేశ్వర శాస్త్రి** గారి ఆదాయం చాలా బాగా ఉండేది. వేదపండితులలో మొట్ట మొదటిసారిగా మోటార్ సైకిల్, టి.వి, సెల్ ఫోన్ లను కొన్న ఘనులాయన. మధ్యతరగతికుటుంబమైనా మంచి ఆధునిక వసరులతో సంతృప్తిగా సంసారం గడిపారు. దురదృష్టవశాత్తు శాస్త్రి గారి భార్య **సీతాలక్ష్మి** గారు 49ఏళ్ళకే కేన్సర్ వ్యాధి తో 2010లో మరణించారు. ఆమె మరణం శాస్త్రి గారికి, పిల్లలకు అత్యంత బాధాకరమైంది. మళ్ళీ వివాహమాడకుండా, అగ్నిహోత్రం జోలికి వెళ్ళకుండా ఉన్నారు. ఆయన చిన్నతమ్ముడు **రామశాస్త్రి** గారు కూడా అంతే. ఈయన కూడా బాబాయి, తండ్రి గార్లలాగానే ఉండిపోయాడు. సాగారాంధ్రలో కుటుంబంలో యవ్వనంలొ ఉన్నవాడు మరణిస్తే అతని భార్య ఆమె స్నేహితులు, బంధుజనం **''గుండా గుండా''** అని ఏడవటం సంప్రదాయం. దీని అర్థం **అగ్నిగుండంలో దూకాలని**. అంటే **సహగమనం** చేయాలని భావం. కాని కాలం మారి ఇప్పుడెవరూ అలా చేయటం లేదు. చట్టం ఊరుకోదు కూడా. **ఆహితాగ్ని భార్య మరణిస్తే అగ్నిహోత్రం ఆర్పేయటం, శ్రౌతకార్యాలు నిషేధించటం జరుగుతాయి**. వెంకటేశ్వర గారు తన జాతక రీత్యా ద్వితీయం వ్రాసిపెట్టి ఉందని తెలుసుకొన్నారు. కాని వివాహం చేసుకొంటే రజస్వల కాని పిల్లనే చేసుకోవాలి. తనకు అప్పటికే 61, కొడుక్కి 35 ఏళ్ళు కనుక అలా చేసుకోవటం భావ్యం కాదని, విరమించుకున్నారు. ఇంతలో వీరి కొడుకులిద్దరూ వేదంలో సర్టిఫికేట్ పొంది **తిరుపతి దేవస్థానం** వారి **వేదం పారాయణ** కార్యక్రమంలో నియోగింపబడ్డారు. **రామయజ్ఞశాస్త్రి**కి చిత్తూరు జిల్లా **కాణీపాకం దేవాలయం**లో పారాయణ ఉద్యోగంలో చేరారు. ఈ దంపతులకు ఒక కొడుకు. **రామయజ్ఞేశ్వరుడు** తాతగారు, గురువు అయిన **వెంకటేశ్వర శాస్త్రి** గారి వద్దనే **సింహాచలం**లో ఉన్నాడు. 2014లో ఉపనయనం అయింది. చిన్నతమ్ముడు **రామకుమార్** ఋగ్వేద పండితుడై విశాఖ పట్టణంలో శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో పారాయణ ఉద్యోగం చేస్తున్నాడు. ఇవీ **శ్రీ కపిలవాయి వెంకటేశ్వర శాస్త్రి** గారి కుటుంబ విషయాలు, విశేషాలు.

**సూచన:** పై వ్యాసాంగంలో చిన్న సవరణలు. ఈ క్రింది సవరణలు స్వయాన *శ్రీ కపిలవాయి వెంకటేశ్వర శాస్త్రి★ గారి మేనల్లుడు ★శ్రీ పోలా పవనకుమార శర్మ, బాపట్ల భావనారాయణ స్వామి దేవాలయ వేదపండితులు★ గారు స్వయంగా తెలిపిన విషయాలు.

**సవరణ 1 – వీరి సంతానం:–** మొదట ఆడపిల్ల అనంతరం మగపిల్లవాడు పునః ఇద్దరు ఆడపిల్లలు,మరల మగపిల్లవాడు.ఇది పిల్లల వరుస.

**సవరణ 2 - వీరి విద్యాభ్యాసం :-** ఋగ్వేదమూలం, యజుర్వేదక్రమాన్తం, అథర్వవేద మూలం, సామవేదం యజ్ఞభాగం ఆంధ్రగానం వరకు అధ్యయనం, ఆంగ్లంలో BA డిగ్రీని కూడా పొందనారు.

**సవరణ 3- వీరి పునర్వివాహంలో చేసిన కల్పన (ఊహ):-**పునర్వివాహ ఆలోచన విషయం ఊహాజనితమే.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 25

### శ్రీ కపిలవాయి రామశాస్త్రి గారు

**శ్రీ కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి** గారి రెండవ కుమారుడు సర్వ స్వతంత్రుడుగా,ఆత్మ విశ్వాసంతో పెరిగారు. చాలా విశాల హృదయులు. అన్నగారితో కలిసి శ్రౌతకార్యాలకు అప్పుడప్పుడు వెళ్ళినా, **అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ ఆస్థాన వేదపారాయణ విద్వాంసులు**గా ఉన్నారు. చాలా వినయంతో ఉంటారు. అన్నగారు **వెంకటేశ్వర చతుర్వేది** అని బిజినెస్ కార్డ్ లు వేయించుకొంటే, దానికి భిన్నంగా ఉంటారు. **అథర్వణ వేదం**లో **బ్రాహ్మణాలు** కూడా నేర్చి **త్రివేది** అనిపించుకొన్నారు. 1998లో అన్నవరం దేవాలయం దశావతారాలకు యజ్ఞం చేశారు. దీనికి **రామశాస్త్రి** గారు అధ్వర్యులుగా వ్యవహరించారు. **వెంకటేశ్వర్లు** గారు మొదలైన చాలామంది ఆంధ్రదేశంలోని వేదపండితులు అగ్నిహోత్రాలలో నెయ్యి, సమిధలు వేసే పనిలో ఉన్నారు. మధ్యలో వచ్చే ఖాళీ సమయాలలో అన్నదమ్ములిద్దరూ చేసే క్రియా పరమార్థాన్ని అందరికి అర్థమగునట్లు వివరించేవారు. ఇద్దరికీ తండ్రిగారే గురువు అని మనకు తెలుసు. అన్నదమ్ములిద్దరికీ సమాన పారితోషికమే దేవస్థానం అందించింది. కపిలవాయి వారి బజారులో శాస్త్రిగారు అయిదు అంతస్తుల సౌధం నిర్మించుకొన్నారు. ఇద్దరు కూతుళ్ళకు వివాహం చేశారు. కొడుకు **అగ్నిహోత్ర శర్మ** వీరితోనే ఉండేవారు. అయిదవ అంతస్తులో విలువైన **150 ప్రాచీన తాళపత్ర గ్రంథాల**ను భద్రపరచారు. శాస్త్రి గారికి 11వ ఏట కాశీలో ఉపనయనం జరిగింది. అన్నగారు **వెంకటేశ్వర శాస్త్రి** గారు **తైత్తిరీయం** పూర్తీ చేసి **ఘనం** కాక **ఋగ్వేదం**లో పడ్డారు. ఈయన **అథర్వ వేదం** దారిన పడ్డారు. అన్నగారు అగ్నిహోత్ర పరికరాలను చూపించేవారు కాదు. వీరు మాత్రం అతిథులు అడిగితే తమ వద్ద ఉన్న **అరణి, జుహు, ఉపభృత్, చమస** మొదలైనవి చూపెట్టేవారు. బ్రాహ్మలు కాని వారు ఇతరులేవరైనా ఇంటర్వ్యూ చేయటానికి వస్తే భోజనానికి ఆహ్వానించేవారు. సంభాషణ సమయంలో టీ కాని కాఫీ కాని ఇచ్చేవారు, అవసరమైతే అతిథి ఉండటానికి సౌకర్యం కల్పించేవారు. వీరి సతీమణి **శ్రీమతి బోనపల్లి మారుతి** గారు భర్తకు సమానంగా వేదం శ్రౌతాలలో బాగా అవగాహన, ఆకళింపు ఉన్నవారు. పురుషులతో పాటు వేదం, శ్రౌత చర్చలు చేసేవారు. వేదపండితుని కుమార్తె, ఆహితాగ్ని అయిన తాతగారి ఇంట **గుంటూరు** జిల్లా **రేపల్లె**

**అగ్రహారం**లో పెరిగారు. **వెంకటేశ్వర** గారి భార్య గారిదీ ఈ అగ్రహారమే. **కపిలవాయి సోదరులు** ఈమె తాతగారి శిష్యులే. గురువు గారింట్లోనే ఆరు నెలలు ఉండి నేర్చుకున్నారు. వీరిలో తమ్ముడు **రామశాస్త్రి** గారికి తన మనవరాలినిచ్చి శిష్యుడి వివాహం చేశారు గురువు గారు. 16వ ఏట భర్తతో **కాశీ**లో కాపురం పెట్టినప్పటికే ఆమెకు శ్రౌతంలో ప్రక్రియలపై గొప్ప అవగాహన ఉండేది. **కాశీ**లో మొదటి ఆరేళ్ళు **యజ్ఞపాయసం** మొదలైన అగ్నిహోత్రునికి నివేదింపబడినవి మాత్రమే భుజించేవారు. ఇందులో ఆమెకు సత్పుత్రుడు కలగాలనే తీవ్ర సంకల్పమూ ఉండేది. చాలా మంది వేదపత్నిల కంటే మారుతి గారు పూర్తిగా వైదిక జీవితానికే అంకితమై ఉన్నారు. శ్రౌతకర్మలలో ఏవైనా లోపాలు జరిగితే తప్పనిసరిగా చెప్పి సరి చేయించే నేర్పు ఆమెది. ఆమె గారి పరిశీలన అంత నిశితంగా ఉండేదనిచెప్పుకొనేవారు. 2005లో ఒకరోజు ఆమె తన విశాల భవనంలో మూడు నెలల మనవడిని ఉయ్యాల ఊపుతుంటే, ఒళ్ళంతా నలుగు పెట్టి తలంటి పోస్తుంటే   ఇరుగమ్మ,పొరుగమ్మలు ఆశ్చర్యంగా చూసేవారు. పిల్లాడు నడక మొదలుపెడితే, అరికాళ్ళకింద అరిసెలు వేసి నడిపించారు. ఇవన్నీ చేస్తున్నా భర్తకు అగ్నిహోత్ర విధిలో యథావిధిగా సహకరించేవారు. అదే ఏడాది **రామశాస్త్రి** గారు **తిరుపతి**లో జరిగిన **పౌండరీకం**కు **ఉద్గాత**గా ఉన్నారు. చిన్ననాట, యవ్వనంలో  ఎప్పుడో **పౌండరీకం** చూశారు. మళ్ళీ 25ఏళ్ళ తర్వాత ఉద్గాతగా ఆహ్వానిస్తే సమర్థంగా చేయించగలనా అనే సందేహం వచ్చిందట. ఆ విషయం వివరిస్తూ ఆయన దీర్ఘకాలం వ్యాధితో ఉన్నా మా తాత గారు కలలో కన్పించి భయం లేదు బాగా చేయించగలవు అని చెప్పారు. కలలోనే దానికి సంబంధిన చార్టులను ఏర్పాటు చేసే పనిలోపడ్డాను, ఇంతలో గాలి వచ్చి వాటిని చెల్లా చెదురు చేసింది. కంగారు పడ్డాను.''వెతకండి వెతకండి ''అని అరిచాను. అప్పుడు ''అవి పోతే పోయాయిలే. వాటి కోసం దిగులుపడకు'' అనే మాటలు వినిపించాయి. మా నాన్న గారిని రేపు నేను ''పౌండరీకం''ఎలా చేయించగలను'' అని అడిగాను. ఆయన "భయపడకు. నేను నీ వెంట ఉంటాను" అన్నారు. ''తెల్లవారి లేచిచూస్తే ఇది కలా! నిజమా! అని ఆశ్చర్యపోయాను'' అని చెప్పారు శాస్త్రిగారు. అన్నదమ్ములిద్దరి మధ్యా పోలికలే ఎక్కువ. వెంకటేశ్వర్లు గారి ముగ్గురు కుమార్తెల వివాహాలు అయ్యాయి. పెద్దమ్మాయి **సీతా నాగ లక్ష్మి** కంప్యూటర్ సైన్స్ లో డిగ్రీ పొంది, ఇంగ్లిష్ టీచర్ గా పని చేస్తూ **గుంటూరు** జిల్లా **బాపట్ల**లోని వేదపండితుడు **పోలా పవన కుమార శర్మ**తో  వివాహమైంది. సుందరి అయిన ఈమె అత్యద్భుత గాత్రంతో భక్తి గీతాలను, మంత్రాలను సుస్వరంగా ఆలపించే నైపుణ్యం కలది. ఈమె కంటే మూడేళ్ళ చిన్నదైన **అగ్నివతి నాగలక్ష్మి**కి **ద్రాక్షారామా**నికి చెందిన వేదపండితునితో వివాహం జరిగి బెజవాడలో భర్తతో కాపురం ఉంటోంది. చిన్నకూతురు **స్వాహాదేవి**కి 11వ ఏటనే 1998లో **తూర్పుగోదావరి** జిల్లా **ఏలేశ్వరా**నికి చెందిన స్మార్త బ్రాహ్మణుడు, తండ్రిగారి శిష్యుడికిచ్చి వివాహం చేశారు. వీళ్ళు మాత్రమే తూ.గో.జిలో ఉంటున్నారు.

2005లో పెద్దకుమార్తె **సీతా నాగలక్ష్మి**, **బాపట్ల శ్రీ భావనారాయణ దేవాలయం**లో వేదపండితుడుగా ఉన్న **పవన్ కుమార్** దంపతులు తాము బాపట్లలో **ఆధానం** చేయబోతున్నామన్న కమ్మని వార్త తెలియ జేశారు. ఒక దశాబ్దం తర్వాత కూడా **రామ శాస్త్రి** గారు ఆ పని చేస్తారేమో అని ఎదురు చూశారు. 2016లో శాస్త్రి గారు రిటైర్మెంట్ సన్యాసంలో ఉన్నారు. 1998 మే నెలలో ఉపనయనం అయిన **అగ్నిహోత్ర శర్మ** "అగ్నికార్యం" చేశాడు. తండ్రిచాటున యవ్వన ప్రాదుర్భావంలోనే ఋత్విక్కుగా ఉన్నాడు. 14వ ఏట తొమ్మిదో క్లాస్ చదువుతూ, **తైత్తిరీయం**లో పదపాఠం నేర్చాడు. తండ్రి **ఉద్గాత**గా, బాబాయి **హోత**గా **తిరుపతి**లో జరిగిన **పౌండరీకం**లో **ప్రస్తారుడు**గా ఉన్నాడు. దీనికి ముందే ఒక **అగ్నిష్టోమా**నికి **సుబ్రహ్మణ్యు**నిగా వ్యవహరించాడు. దీనితో శ్రౌతంలో నిష్ణాతుడు అనిపించుకున్నాడు. 2014కు **బాపట్ల శంకర విద్యాలయం**లో **సామవేద ఉపాధ్యాయు**నిగా, అక్కడే **యజుర్వేద పారాయణ** కూడా చేసి మంచి కీర్తి సాధించాడు. **రామశాస్త్రి** గారి **శ్రౌత సంప్రదాయం** కుమారుడికి, మనవడు **మారుతి రామయజ్ఞేశ్వరుని** వరకు కొనసాగింది. ఇవీ **కపిలవాయి రామశాస్త్రి** గారి కుటుంబ విశేషాలు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 26

### శ్రౌత కక్షలు:

కొన్ని దశాబ్దాలుగా శ్రౌత, కర్మకాండలలో తమ తండ్రిగారి పై కక్షలు ఉన్నాయని కపిలవాయి సోదరులు చెప్పారు. ఇవి **శ్రౌతకర్మలు** చేయించటంలో, **శ్రౌత పరిజ్ఞాన** విషయంలో ఉండేవి. ఇవి శ్రౌతకర్మకాండలు ఆరంభమైన నాటినుండే ఉండేవట. ముఖ్యంగా **దర్శ, పూర్ణమాస** విషయంలో, **యజమాని** విషయంలో బాగా కనిపించేవి. **యజ్ఞేశ్వర శాస్త్రి** గారు విజయవాడలో 1975లో స్వగృహంలో ఉన్నప్పుడు, అక్కడి **దెందుకూరి యాజులు** గారితో ఈ స్పర్ధలు బయటపడ్డాయి. అనేక సభలు సమావేశాలలో ఇద్దరి మధ్యా చర్చోపచర్చలు జరిగాయి. ఈ కక్షలకు ముఖ్య కారణం **దెందుకూరి** వారు శ్రౌత కార్యాలకు కోనసీమ వారిని ఆహ్వానించే వారు కాదని, తర్వాత పిలిచినా కొనసీమ నుంచి ఎవరూ ఋత్విక్కులుగా వచ్చేవారు కాదని **కపిలవాయి సోదరుల** ఉవాచ. **దెందుకూరి** గారు **తమిళ వేద పండితుల** వైపు మొగ్గు చూపి, **సామవేద గానాన్ని**, కోనసీమ **యజ్ఞేశ్వర శాస్త్రి** గారు బోధించిన **ఆంధ్ర గాన విధానాన్ని** కాదని **తమిళనాడు విధానాన్ని** ప్రవేశపెట్టారు. కనుక మేము ''ఎవరో చెప్పిన గానాన్ని ఎందుకు అనుసరించాలి?'' అని సోదరుల ప్రశ్న. ఒకేసారి అనేక క్రతువులు ఒకేచోట చేయటం విషయంలోనూ అభిప్రాయ భేదాలొచ్చాయి. యజ్ఞేశ్వరులు **''సరైన నిష్ణాతులైన వారు నిర్వహిస్తే, వారు బంధువులుకాని స్నేహితులుకాని కాకపోతే, రెండు ప్రదేశాలు ఒకనది లేక కొండ చేత విడదీయబడి, ఒక చోటి శబ్దం వేరే చోట వినబడనంత దూరంలో**

**ఉంటేనే అనేక క్రతువులు నిర్వహించాలని''** యజ్ఞేశ్వర శాస్త్రి గారు చెప్పారు. కంచి స్వాములు కొన్ని విషయాలపై తమ అభిప్రాయాన్ని కోరితే అన్నీ పూసగుచ్చినట్లు వివరించి వ్రాసి పీఠానికి అందజేశారు యజ్ఞేశ్వరులు. వీరి అభిప్రాయాలను వారు పూర్తిగా అంగీకరించి, ఆమోద ముద్ర వేశారు. **యజ్ఞేశ్వర** గారి అభిప్రాయాలను **లంకా** వారు సమర్ధించారు. అభిచార విషయంలో యజ్ఞేశ్వర, లంకా వారలపై తీవ్ర ఆరోపణలు ఉండేవి. వీటికి సమాధానాలుచెప్పటానికి వారిద్దరూ బాగా ముసలివారైపోయారు, **లంకా** వారు 1983 నవంబర్లో దేహం చాలించారు. కనుక ''డిఫెన్స్'' ఇవ్వలేకపోయారు. కనుక **కోనసీమ,కృష్ణా శ్రౌతుల మధ్య "తమిళ గాన", "ఆంధ్రగాన" వివాదం అలాగే ఉండిపోయింది**. తర్వాత కాలంలో వైదిక విధిలో కొన్ని సమస్యలొచ్చాయి. ఇవి తెలుసుకోవటం చరిత్రను తెలుసుకోవటమే అవుతుంది. చాలా ఉత్సాహంగా ఉంటాయి కూడా. కపిలవాయి వారి ఆరోపణలో **దెందుకూరి** వారి ఋత్విక్కులు రజస్వల కాని పిల్లలను పెళ్లి చేసుకోన్నారనేది ఒకటి. కనుక వారికి **ఋత్విజ** అర్హత లేదంటారు. రెండోది **దెందుకూరి** గారు శ్రౌతాన్ని వ్యాపారంగా మార్చేశారని. డబ్బు కోసం కక్కుర్తిపడి కొన్నిటిని అతి తక్కువ సమయంలో అంటే చేయాల్సిన సమయం కంటే సగం సమయం కూడా తీసుకోకుండా, యజమాని అమాయకత్వాన్ని ''క్యాష్'' చేసుకొని సమయమంతా డబ్బు మీదే లగ్నం చేస్తున్నారని, చేసి లాభం పొందుతున్నారనేది. దెందుకూరి వారు కోనసీమలో సరైన వారులేక, ఇక్కడి తమ సంపాదన చూసి ''అందని ద్రాక్ష పళ్ళు పుల్లన'' అనే సామెత ఋజువు చేస్తున్నారు'' అంటారు. దువ్వూరి యాజులు గారు చేసిన పౌండరీకానికి దెందుకూరి వారు ఆర్థిక సహాయం చేశారు. దీనితో వీరిద్దరి మధ్య సయోధ్య కుదిరి **శ్రీరామపురం, నేదునూరు** వేదపండితులు దూరమయ్యారు. ఒక రకంగా దువ్వూరి వారిని ''కొనేశారు'' అంటారు కపిలవాయి, దెందుకూరి వర్గాలకు చెందని తటస్థులైన వేదపండితులు. వీరే **''శ్రౌత కక్షలు అంతా నాటకం, రాజకీయం''** అన్నారు కూడా. **దువ్వూరి, దెందుకూరి** కుటుంబాలు పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న **గొల్లపల్లి** వేదపండిత కుటుంబాలతో వివాహాలు ఇచ్చిపుచ్చుకున్నట్లుగా జరిగాయి.

## బ్రహ్మశ్రీ దెందుకూరి అగ్నిహోత్ర సోమయాజులు గారు:

**దెందుకూరి అగ్ని హోత్ర యాజులు** గారి కుటుంబంలో **15 తరాల వేద పండితులు** ఉన్నారు. ఆయన **త్రేతాగ్నిహోత్రులు**. కుమారుడు **శ్రీ లక్ష్మీ నరసింహసోమయాజులు** గారు కూడా అగ్నిహోత్రం చేస్తారు. పెద్దయాజులు గారి వద్ద పెద్దపెద్ద ప్లాస్టిక్ సంచులలో సంస్కృత, తెలుగు గ్రంథాలున్నాయి. ఇద్దరి కలర్ జిరాక్స్ ''రెస్యూమ్స్'' కూడా అందరికి పంచి పెడతారు. రూపాయలలో కాని, డాలర్లలో కాని ''ఇష్టి'' కోసం ధన

సాయం అర్థిస్తారు. ఈ అభ్యర్థనలు ఏదో ఒకసారి మాత్రమే కాదు. పదే పదే అడగటం వారికి పరిపాటి. ఈ లక్షణం ఇప్పటివరకు మనం చెప్పుకొన్న ప్రసిద్ధ కోనసీమ శ్రౌతుల విషయంలో లేనేలేదు. ప్రపంచం సుభిక్షంగా ఉండాలనే వారు కాక్షించి చేశారు తప్ప స్వంత లాభం కోసం కానేకాదు. అంతా అయ్యాక యజమానులు యెంత ఇస్తే అంతే స్వీకరించారే తప్ప ముందుగా బేరసారాలు ఉండేవికావు వారి విషయంలో. 1980 నాటికీ కోనసీమలో శ్రౌతకార్యాలు చివరి దశకు చేరుకొంటే, 180మైళ్ళ పడమరలో ఉన్న కృష్ణా తీరాన విజయవాడలో అప్పుడప్పుడే మొదలయ్యాయి. 2005కు కృష్ణా జిల్లాలో 20 మంది ''ఆహితాగ్ని''లున్నారని, అందులో 12 మంది బెజవాడలోనే ఉన్నారని **దెందుకూరి** వారు చెప్పారు. నిత్యాగ్నిహోత్రులలో **దెందుకూరి తండ్రీ కొడుకులు, రెండు చింతల, విష్ణుభొట్ల, కప్పగంతుల, మద్దూరి** మొదలైన కుటుంబాల వారున్నారు. 1965లో దెందుకూరి గారు విజయవాడలో **అగ్నిష్టోమం** చేసి, తర్వాత అనేక శ్రౌత కార్యాలు నిర్వహించి **బహు యాజి** అనిపించుకొన్నారు. **వాజపేయం, సర్వతోముఖం, అరుణకేతు, మూడు పౌండరీకాలు** మొదలైనవి చేసిన ఘన చరిత్ర ఆయనది. ముగ్గురు కొడుకులకు నేర్పారు. ఇద్దరు కూతుళ్ళను వేదపండితులకిచ్చి వివాహాలు చేశారు. ఒక "వేద సభ" స్థాపించి కృష్ణాజిల్లాలో వైదిక వ్యవస్థకు బలం చేకూర్చారు. శ్రౌత కక్ష ఉన్నా, **కపిలవాయి వెంకటేశ్వర్లు** గారు **దెందుకూరి** వారి **18 శ్రౌత** కార్యాలలో **లంకా** వారిలాగా **ఋత్విజులుగా** చూపిన సర్వ సమర్థతను మెచ్చుకొని, తమ విశాల హృదయన్ని ఆవిష్కరించారు. **దెందుకూరి** గారి తండ్రీ, పెద్దన్న **పౌండరీక యాజులు** గారు కూడా **''ఆహితాగ్ను''లే**. తండ్రి గారు గుంటూరు జిల్లా **నల్లపాడు** నుంచి ఇక్కడి విజయవాడకు వచ్చారు. **డయాబెటిస్, నరాల బలహీనత, కీళ్ళనొప్పులు** ఉన్నా అన్నిటినీ అధిగమించి **దెందుకూరి యజ్ఞేశ్వర సోమయాజులు** గారు కోనసీమలోని **కపిలవాయి యజ్ఞేశ్వర అగ్నిహోత్ర శాస్త్రి, రెండు చింతల యాజులు** గార్ల రికార్డ్ లను అధిగమించి, కొత్త రికార్డ్ సాధించి, స్థాపించి, తమకు, కృష్ణా జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. దెందుకూరి యాజులు గారు పొట్టిగా నుదుట దట్టమైన విభూతి రేఖలతో మెడలోరుద్రాక్షలతో , మొకాలిపైకి బిగించికట్టిన అంగోస్త్రం, పైన ఉత్తరీయం, చేతిలో దర్భలకట్టతో కనిపించేవారు. **అన్నవరం వారి దేవస్థాన** సర్వీస్ లో ఉన్న **కపిలవాయి రామశాస్త్రి** గారిని దేవస్థానం 2014 ఫిబ్రవరి-మార్చిలో నెల్లూరు జిల్లా మాదిరాజు గోడూరు గ్రామంలో జరిగిన **వ్యాధ పౌండరీకం**కు సలహాదారుగా ఉండమని పంపింది. దీనికి యజమాని **కపిలవాయి, రెండు చింతల కృష్ణ చయనులు** గారు.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 27

కాకినాడ ఆహితాగ్నుల గురించి తెలుసుకొన్నాం కనుక ఇప్పుడు **పశ్చిమ గోదావరి** జిల్లా **ఇరగవరం** గ్రామ ఆహితాగ్నుల గురించి తెలుసుకొందాం

### పశ్చిమ గోదావరిజిల్లా:

కోనసీమ ఆగ్రహారానికి పశ్చిమాన, మధ్య డెల్టాకు **గోదావరి—వసిష్ఠ**కు తూర్పు సరిహద్దున, **గోదావరి-వైనతేయ (గరుడ )**నది అంతమౌతుంది. ఆధునిక కాలంలో బ్రిడ్జీల నిర్మాణం జరిగే వరకు ఈ రెండు చానళ్ళు దాటాలంటే ప్రవాహ ఉద్ధృతి లేనప్పుడు ఫెర్రీలే దిక్కు. **వసిష్ఠ**కు దూరంగా ఉన్న కుడి భూభాగాన్ని ఇప్పుడు **పశ్చిమ గోదావరి** జిల్లా అంటున్నారు. దీని ముఖ్యపట్టణం **ఏలూరు**. ఇది కూడా దాదాపు తూర్పు గోదావరి వైభవాన్ని పచ్చదనంతో సహా కలిగి ఉంటుంది. ధాన్యాగారం అనిపించే పంట పొలాలు వాటి దగ్గర తెల్లకొంగలు ముచ్చటగా ఉంటాయి, ఇక్కడి పక్షులలో **''పాలపిట్ట''** ప్రత్యేకమైనది. **త్రికోణాకారమైన ఈ భూభాగం** జూన్ జులై ఆగస్ట్ నెలలో వరదలకు గురౌతుంది. వీటితో అంటువ్యాధులు ప్రబలి జన నష్టం కలుగ జేస్తాయి. 26 -12 -2004న వచ్చిన సునామీలో 2,32,000 మంది మృతి చెందారు.

### వేదపండిత ముఖ్యపట్టణం''ఇరగవరం''

కోనసీమకు చేరువలో **తణుకు** పట్టణం వసిష్ఠ గోదావరికి కనుచూపులో ఉంటుంది. ఇప్పటికీ ఇక్కడ డజనుకు పైగా వేద పండిత కుటుంబాలున్నాయి. దీనికి సమీప గ్రామాలే **ఇరగవరం, జుత్తిగ, నిడదవోలు, ఖండవల్లి, సిద్ధాంతం, కానూరు, ముక్కామల అగ్రహారాలు**. 20వ శతాబ్దిలో ఇక్కడ చాలా కుటుంబాలలో ఎందరో ''ఆహితాగ్నులు'' వర్ధిల్లారు. 1991లో **శ్రీ పీసపాటి వేంకట సిద్ధాంతి** గారు కోనసీమ **శ్రీరామపురాగ్రహారా**నికి చెందిన **శ్రీ దువ్వూరి యాజులు** గారిని అందరు ఋత్విక్కులను ఆహ్వానించే **సోమ ప్రవాకు**నిగా తాము చేస్తున్న **అగ్నిష్టోమా**నికి ఆహ్వానించారు. ఇప్పుడు ఈ ప్రాంతంలో పేరు పొందిన శిక్షణ పొందిన వేదపండితులు, ఘనపాఠీలకు కొదువలేరు. **తణుకు**కు 6 మైళ్ళ దూరంలో ఉన్న **ఇరగవరం** "భారతదేశంలో వేదపండిత ముఖ్య పట్టణం"గా వన్నెకెక్కింది. భారత ఉపఖండంలోనే అరుదైన వేదపండితులను అందించింది **ఇరగవరం**. వీరిలో క్రమపాఠంలో సర్టిఫికేట్ పొందినవారే 30 మందికి పైగా, అందులో సగం మంది అనేక స్థాయిలలో 2007లో ఏర్పడిన శంకర వేద పాఠశాలలో ఉన్నారు. ఇవాళ ఈ గ్రామానికి తూర్పున ఉన్న ఏ గ్రామంలోనూ ఇలా చెప్పకోవటానికి ఎవరూ లేరు. శతాబ్దం క్రితం

కోనసీమలోని **ముక్కామల**కు ఎంతటి ఘన కీర్తి ఉండేదో, నేడు **ఇరగవరా**నికి అంతటి కీర్తి ప్రతిష్టలు లభించాయి. **వేద సంప్రదాయానికి ఇరగవరం గర్వపడే స్థితి లభించింది**. అనేక కలర్ ఫోటోల ఆల్బంలు, వీడియోలు అనేక వేద సభలలలో ఎందరెందరో ఘనత వహించిన వేదపండితులకు నెమలి సింహాసనం పై ఆసీనులను చేసి జరిపించిన అరుదైన సత్కారాలు, ఘన సన్మానాలు పై తీసినవి చూసి ఆనంద పరవశం పొందవచ్చు. అలాంటి ఘన వేద సంప్రదాయం ఉన్న ఇరగవరానికి చెందిన వారిలో **గుళ్ళపల్లి** వారి కుటుంబం ఎన్నదగినది. వీరికి కోనసీమ **దువ్వూరి, దెందుకూరి** కుటుంబాలతో జరిగిన వివాహాల విషయాలు ముందే చెప్పుకొన్నాం. ప్రస్తుతం **గుళ్ళపల్లి** కుటుంబంలో మూడు తరాలవారి గురించి తెలుసుకొందాం.

శ్రీ గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి అవధానులు గారు:- **శ్రీ గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి అవధానులు** గారు, అర్ధాంగి **నరసమాంబ** గారికి అయిదుగురు కుమారులు, ఇద్దరు  కుమార్తెలు, చాలా మంది మనవాళ్ళు, మనవరాళ్ళు ఉన్నారు. అయిదుగురిలో నలుగురు కుమారులు తిరుపతి దేవస్థానం 1990 అక్టోబర్ లో వరుణపూజ కార్యక్రమం నిర్వహించినపుడు ఆహ్వానింపబడిన 16 మంది ఆంధ్ర వేద పండితులలో ఈ నలుగురూ ఉండటం విశేషం. దీనితో వర్షాభావం ఏర్పడిన తిరుపతిలో కుంభవృష్టి కురిసి బాధలను పోగొట్టింది. **గుళ్ళపల్లి కుటుంబం పూర్తిగా వేద సంప్రదాయానికే కట్టుబడింది**. వీరి ఉప కుటుంబాలు ఆ సంప్రదాయం నిలబెడుతూ ఆధునిక సౌధాలు  బ్రాహ్మణ వాటికలలో నిర్మించుకొని ఉంటున్నా, సంప్రదాయాన్ని విస్మరించక అవిచ్చినంగా కొనసాగిస్తున్నారు. ఇద్దరు ''ఘనపాఠీ''లయ్యారు వీరిలో. ఆధునిక కాలంలో కూడా ఈ కుటుంబం కోనసీమ అగ్రహార కుటుంబాలతో వియ్యం అందుకోనటం సంప్రదాయ పరి రక్షణలో భాగమే. **సీతారామ శాస్త్రి అవధానులు** గారు **లోహితస** గోత్రీకులు. 1925లో **ఇరగవరం**లో జన్మించి, 10వ ఏట ఉపనయనం చేసుకొని, కోనసీమలంక **పొద్దగట్లపల్లి**లోని **శ్రీ కంభంపాటి లక్ష్మణ అవధాని** ఉండి అగ్రహారంలోని **శ్రీ తంగిరాల సుబ్బావధానులు**, **రాజమండ్రి**లోని **శ్రీ విశ్వనాథ ఘనపాఠీ** గార్ల వద్ద శాస్త్రాలు అభ్యసించారు. కనుక వీరి చదువు ఎక్కువ భాగం కొనసీమలోనే కొనసాగింది. మామూలు పద్ధతిని వదిలి, ముందుగా శాస్త్ర విద్య నేర్చి, తర్వాతే వేద విద్య అభ్యసించారు. ఆ తర్వాత వేదార్ధం నేర్చారు. **విజయవాడ, రాజమండ్రి, సల్లేపల్లి**లలో జరిగిన పరీక్షలో ఉత్తీర్ణులైనారు. **శ్రౌతం**పై అభిలాష తక్కువే అయినా **శ్రౌత, స్మార్త** కర్మలు నేర్చుకున్నారు. వీరి నైపుణ్యాన్ని కొందరు చక్కగా ఉపయోగించుకున్నారు కూడా. **ఇరగవరం**లోని **తంగిరాల** వారిలో చాలా మంది ఆహితాగ్నులు ఉన్నారు.

1970లో **శ్రీ తంగిరాల రామ సోమయాజులు** గారు నిర్వహించిన **అగ్నిష్టోమంకు గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి** గారిని అధ్వర్యుని చేశారు.

16వ ఏట వివాహం:- 1924లో జన్మించిన **నరసమాంబ** గారితో జరిగింది. ఔపోసన కార్యం అయ్యాక 1950-60 మధ్యకాలంలో వరుసగా ఏడుగురు సంతానం కన్నారు దంపతులు. ఇందులో ఇద్దరు కుమార్తెలను వేదపండితులకే ఇచ్చి సంప్రదాయబద్ధంగా రజస్వల పూర్వ వివాహం చేశారు. కొడుకుల్లో ఒకాయన వేదమార్గం పై కొంత కాలం ఊగిసలాడినా, చివరికి వేదం నేర్చి సెవెన్ అవుట్ ఆఫ్ సెవెన్ అని పించుకొన్నారు శాస్త్రిగారు. అయిదుగురు కుమారులు తిరుపతి వారి వేదపారాయణ స్కీంలో ఉద్యోగాలు పొందారు. ఉపనయనం తర్వాత **సీతారామ శాస్త్రి** గారే వేదం నేర్పారు. **''మా మనవాళ్ళు అందరూ అయిదోక్లాస్ తోనే ఇంగ్లీష్ చదువు మానేసి వేదంలో పడ్డారు. ఇప్పుడు స్కూల్ లో ఎవ్వరూ మావాళ్ళు లేరు. అందరూ వేదంలోనే ఉన్నారు''** అని గర్వపడతారు **శాస్త్రి** గారు. ప్రశాంత చిత్తంగా ఉండే ఆయన విద్య నేర్పటంలో చాల క్రమశిక్షణ పాటిస్తారు. ''కోనసీమలో ఒకే గ్రంథాన్ని ఒకేసారి ఇద్దరు బ్రహ్మచారులకు బోధించరాదు'' అనే "సంప్రదాయం" ఉన్నది. కాని శాస్త్రిగారు దాన్ని అధిగమించి ఎక్కువ మందికి నేర్పారు. 1998 లో 10-12 ఏళ్ళ వయసున్న తన అయిదుగురు మనుమలకు, 8వ ఏట ఉపనయనం తర్వాత ఒకేసారి **తైత్తిరీయ సంహిత నాలుగవ కాండ** బోధించారు. తర్వాత ఇకటి, రెండు, మూడు కాండలు, తరువాత అయిదు, నాలుగు, ఏడు కాండలు నేర్పి 2000 మార్చి నాటికి పూర్తి చేయించి పరీక్షకు సిద్ధం చేయించారు. నాలుగు నెలలు పునశ్చరణ చేయించి, నలభైనాలుగు పన్నాలలో శ్రావణమాసంలో జరిగిన పరీక్షలో కూర్చోపెట్టారు. పరీక్ష వ్రాసిన తర్వాత మొదట ప్రారంభించిన నాలుగవ కాండను ''పదం'' తో నేర్పారు. అంత పట్టుదల దీక్షగా **గుళ్ళపల్లి రామశాస్త్రి** అవధాని గారు నేర్పితే, అంతే పద్ధతిగా క్రమశిక్షణతో అయిదుగురు మనవలు నేర్చుకొని తాతగారి కీర్తిని ఇనుమడింపజేశారు ఇరగవరంలో.

## కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు – 28 (చివరిభాగం)

### శ్రీ గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి అవధానులు గారు-28 (చివరిభాగం)

ఈ అయిదుగురు మనవళ్ళు సంహిత నేర్చుకున్న వేగం అచ్చంగా కోనసీమలో ఎనభై, తొంభై ఏళ్ళక్రితం **బాబళ్ళ, లంకా** వారి కుటుంబాలలోని వారు నేర్చుకున్న వేగానికి సమానంగా ఉంది. **లంకా** వారు

లేచినట్లుగా వీరు తెల్లవారు ఝామున మూడు గంటలకే లేచి గురువుగారింటికి నాలుగు గంటలకు చేరి వేదం నేర్చుకోలేదు. తాతగారు దాదాపు జీవితమంతా గడిపిన మేడ క్రింది భాగంలో ఉన్న గదిలోనే ఉదయం స్నాన, సంధ్యావందన, అగ్నికార్యాలు నిర్వర్తించి సరిగ్గా 7:30కు తాతగారి వద్ద అధ్యయనం ప్రారంభించి 11 గం.ల వరకు నేర్చుకొనేవారు. వీరు ఒక్కసారి మాత్రమే సింబాలిక్ గా **''మధుకరం''** (భిక్షాన్నము) చేశారు. మిగతా కాలంలో తమ తల్లులు వండి పెట్టిన దానినే భుజించారు. మధ్యాహ్న సమయంలో ఈ బ్రహ్మచారి శిష్యులు అచ్చు పుస్తకాలు చేతబట్టి పునశ్చరణ చేసేవారు. ఒక్కోసారి తాతగారు ఇంట్లో లేనప్పుడూ అలా చేసేవారు. ఎవ్వరైనా ముందు గురుముఖతగా నేర్వాల్సిందే ఆ తర్వాతనే ''పుస్తకాల''సాయం. గురువు కంటే ముందే చదవరాదు. ఇటీవలి కాలంలోనే పుస్తకాలను వాడటానికి అనుమతిస్తున్నారు. అచ్చుపుస్తకం ఉంటే, పూర్తిగా దానిపైనే ఆధారపడతారని భావించేవారు. ఈ అయిదుగు వారి తండ్రులు అందరూ కలిస్తే సీతారామ శాస్త్రి గారి కుటుంబంలో వేదంనేర్చిన వారు 30 మంది అవుతారు. **మిత్రనారాయణ** గారు కోపంగా చెప్పినట్లుగా వేదం మేధా ప్రమాణాలు ఏమీ తగ్గిపోలేదని వీరిని చూస్తేనే తెలుస్తుంది. ఇదంతా వీరి వారసత్వ ప్రభావ బలమే. **బాబళ్ళ, లంకా** వారిలాగానే **సీతారామ శాస్త్రి** గారు కూడా **అపరిగ్రహులే** అంటే **దానం గ్రహించేవారు కాదు**. అనసూయ గారు నిర్వేదంతో చెప్పిన **''డబ్బు యావ'' వీరికి అంటలేదు**. కోనసీమ **సీతారామపురాగ్రహారం**లో ఉన్న ఇళ్ళ మాదిరివి కాకపోయినా గుళ్ళపల్లి వారి గృహాలు రెండు అంతస్తుల బిల్డింగ్లు. చక్కని ఎలివేషన్ వర్క్ తో అందంగా నిర్మించినవి. ఇంట్లోకి పక్షులు రాకుండా కిటికీలకు కావలసిన రక్షణ ఉంది. అలమరాలలో కప్ బోర్డ్ లలో ఇంట్లో జరిగిన ఉపనయనాది శుభకార్యాల వేదసభల మొదలైన కలర్ ఫోటో ఆల్బంలు చాలా ఉన్నాయి. **వేంకట నాగ సీతారామావధాని** గారి గృహం పూర్తిగా తయారయ్యాక **వేదిక్ వాయిసెస్** రచయిత **డేవిడ్ నైప్** ఇంటర్వ్యూ చేయటానికి వెడితే లేచినిలబడి షేక్ హాండ్ ఇచ్చారు. ఇలాంటి అనుభవం తనకు కోనసీమలో ఎవరింటా జరగలేదన్నాడు రచయిత. కాలాన్ని బట్టి వచ్చిన మార్పు. ఇక్కడ కట్టిన రెండు అంతస్తుల ''వేద సభ భవనం'' కు **''ఘనాపాఠీ భవనం''** అని గౌరవంగా నామకరణం చేశారు. ఇక్కడ వేదపండితుల ఇళ్ళల్లో జరిగే శుభకార్యాలు నిర్వహించుకోవచ్చు. సభలనూ హాయిగా జరుపుకోవచ్చు. **గుళ్ళపల్లి** వారి అయిదుగురుకుమారులు దాదాపు ఒకే మాదిరిగా ఉంటారు. వారి పేర్లు వరుసగా **గుళ్ళపల్లి రామకృష్ణ, వేంకట సూర్య సుబ్రహ్మణ్య అవధాని, వేంకట రామ సూర్యనారాయణ ఘనపాఠీ, చిన్న ఆంజనేయ ఘనపాఠీ**. 1946లో **బులుసు చయనులు** గారి అమ్మాయిని శిష్యుడైన చయనులు గారికిచ్చిన విషయం తెలుసుకొన్నారు. అలాగే వీరి కుటుంబాలలోనూ జరిగాయి. **సీతారామ శాస్త్రి** గారి కూతురు **కనకదుర్గ**ను **దువ్వూరి యాజులు** గారి మూడవ కుమారుడు **వేంకట సూర్య ప్రకాశ**

**అవధాని** గారికిచ్చి 1970లో పెళ్లి చేశారు. అప్పటికి ఆయన వయసు 18, ఆమెకు 12. మాత్రమే. అప్పటికే ఆయన 82 పన్నాలు **సీతారామపురం**లో తండ్రిగారి వద్ద పూర్తి చేశారు. వీరికి నలుగురు మగ సంతానం. ఆడపిల్లలు లేరు. మేనరిక వివాహాలు వీరింట్లో జరిగాయి. **దువ్వూరి సూర్యప్రకాశావధాని** గారి నలుగురు కుమారులు – **ఫణి యాజులు, సీతారామ శాస్త్రి,హరిప్రసాద్,గిరిజా శంకర్**. వీరు **గుళ్ళపల్లి** వారి **నాగలక్ష్మి, గిరిజాశ్యామల, కామేశ్వరి, పల్లవి**లను వివాహం చేసుకున్నారు. **సూర్య ప్రకాశ** గారి నలుగురు కొడుకులలో పెద్దవాడు వేదం నేర్చాడు. నిజంగా ఆతను'' ఘనపాఠీ'' అని పించుకొన్నాడు. సీతారామ శాస్త్రి గారి మిగిలిన ముగ్గురు కూతుళ్ళను వేదంలో ప్రవేశమున్న లౌకికులకే ఇచ్చి పెళ్లి చేశారు. పెద్ద కూతురు లక్ష్మికి ఇద్దరు కొడుకులు. ఘనపాఠీ కొడుకు, దువ్వూరి యాజులు గారి ఏకైక మనవడు వేదమే అభ్యసించాడు. ఇద్దరబ్బాయిలు ఇంగ్లీష్ విద్య నేర్చారు. సీతారామ శాస్త్రి గారు మాత్రం మనవళ్ళను బాల్యం లోనే వేదంలో ప్రవేశపెట్టగలిగి వేద సంప్రదాయాన్ని కొనసాగించగలిగారు. 2000లో రాజమండ్రిలో దువ్వూరి సూర్య ప్రకాశ గారు నూతన గృహం నిర్మించి తల్లిదండ్రులతో సహా మార్చిలో గృహప్రవేశం చేశారు. మిగిలిన ముగ్గురు కొడుకులకు యవ్వనం లోనే(టీనేజ్) లోనే అయిదు రోజుల వివాహాలు సంప్రదాయ బద్ధంగా జరిపించారు. భార్యలు మాత్రం ఇరగవరంలోనే భర్తలు పూర్తిగా స్థిరపడే వరకు ఉండిపోయారు. **సీతారామ శాస్త్రి** గారి ధర్మపత్ని **నరసమాంబ** గారు.

---

59 ఏళ్ళకే 1983లో చనిపోయారు. దీనితో శాస్త్రిగారు గృహ్యాకర్మ, ఔపోసనాగ్నికి స్వస్తి పలికారు. జీవిత చరమాంకంలో శాస్త్రిగారు మనవళ్ళకు వేదం నేర్పుతూ సంతృప్తిగా జీవించారు. దీనితో **గుళ్ళపల్లి సీతారామ శాస్త్రి** గారి కుటుంబ విశేషాలేకాక, ఆహితాగ్నుల ధారావాహి కంసంపూర్ణం.

ఈ 28 ధారావాహికలలో కొన్ని చోట్ల'' గుళ్ళపల్లి'' కి బదులు'' గొల్లపల్లి'' అని పొరబాటున పడింది. దాన్ని ''గుళ్ళపల్లి'' గా భావించమని మనవి.

**ఆధారం –** '' కోనసీమ అందాలకు వేదపవిత్ర సొబగులు సౌరభాలు అలదిన ఆహితాగ్నులు '' అనే ఈ 28 ధారావాహికలకు **Emeritus of South Asian Studies** at the **University of Visconsin, Madison** లో Professor అయిన **David.M.Knipe** రచించిన **Vedic Voices-intimate Narratives of a Living Andhra Tradition** అని సవినయంగా మళ్ళీ మనవి చేస్తున్నాను. ఆ ఆంగ్ల రచయితకు మనందరి తరఫున అభినందన, ధన్యవాద కృతజ్ఞతలు అందజేస్తున్నాను. ఈ పుస్తకాన్ని నెట్ లో చూసి నాకు తెలియజేసిన మా అబ్బాయి శర్మకు అభినందనలు. నేను చెప్పినదే ఆలస్యంగా పుస్తకాన్ని

కొని, నాకు పంపి, చదివించి, ఈ ధారావాహిక వ్రాయటానికి నన్ను ప్రోత్సహించిన సరసభారతి ఆత్మీయులు శ్రీ మైనేని గోపాలకృష్ణ గారి సౌజన్యానికి కృతజ్ఞతలు. ధారావాహికను చదివి ప్రోత్సహించి, అభినందించిన సాహితీ బంధువులకు నమస్సులు.

**మనవి —** కోన సీమ ఆహితాగ్నుల గురించి మాత్రమే వ్రాయగలిగాను. ఇలాంటి ఆహితాగ్నులు ఆంధ్రదేశంలో చాలా ప్రాంతాలలో ఉన్నట్లు తెలిసింది. మీరెవరిదగ్గరైనా వారి సమాచారం ఉంటే వ్రాసి, అందరికీ తెలియజేయండి. ఒకవేళ మీకు కుదరకపోతే ఆ వివరాలు నాకు పంపితే నేను వ్రాసి, నా జీవితం ధన్యం చేసుకొంటాను అని మనవి చేస్తున్నాను.

**సమాప్తం**

మీ- గబ్బిట దుర్గా ప్రసాద్ - ఉయ్యూరు.

http://sarasabharati.wordpress.com
http://sarasabharativuyyuru.wordpress.com
http://suvarchalaanjaneyaswami.wordpress.com

Gabbita Durga Prasad (Rtd. head Master)

Sivalayam Street, Vuyyuru 521165

Krisha District

Andhra Pradesh

India

Cell: 9989066375, 8520805566

Land Line: 08676-232797

